

సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

* సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ సహాయకులు సీహెచ్ విజయకృష్ణ పంచాయతీ రికార్డులు అప్పగించకుండా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేస్తూ డీపీవో ఉషారాణి ఈ నెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

* సింగరాయకొండ గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై చేసిన విచారణ నివేదికను సకాలంలో ఇవ్వకపోవడంతో ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇస్తూ ఈనెల 16న డీపీవో ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

* మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ వాటర్ స్కీం నిధులను దుర్వినియోగం చేశారని ఈనెల 16న సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శిని తాజాగా శుక్రవారం సస్పెండ్ చేశారు.

* నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ జూనియర్ సహాయకులుగా ఉంటూ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన ఎం.శ్రీరామమూర్తి సర్పంచ్‌తో కలిసి రూ.42.70 లక్షల నిధులను అసాధారణంగా ఖర్చు చేసినట్లు డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక ఇచ్చారు. ఆ మేరకు కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నిధులు దోచేశారు..!

కొందరు అక్రమార్కులు అధికారం ముసుగులో నిధులను అడ్డంగా దోచేశారు. గత వైసీపీ ప్రభుత్వం.. పంచాయతీ పాలనను గాలికొదిలేయడంతో కొంతమంది సర్పంచ్‌లు, అధికారులు తాము చెప్పిందే రాజ్యాంగమన్న విధంగా వ్యవహరించారు. నిధులను ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారు. అందుకు సంబంధించిన రికార్డులు, రసీదులు సక్రమంగా లేనేలేవు. ముఖ్యంగా ఒంగోలు డివిజన్ పరిధిలో ఈ దుస్థితి మరింత ఎక్కువగా ఉంది. మేజర్ పంచాయతీలైన సింగరాయకొండ, ఉప్పుగుండూరు, దొడ్డవరం గ్రామాల్లో లక్షల రూపాయల నిధులను అక్రమంగా వినియోగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు విచారణ జరిపిన అధికారులు అవినీతికి పాల్పడిన ఒక్కొక్కరిపై వేటు వేస్తున్నారు. అధికారులపై సస్పెన్షన్ వేటువేస్తుండగా, సర్పంచ్‌లకు చెక్‌పవర్ రద్దుచేస్తున్నారు.

- గ్రామ పంచాయతీల్లో అంతా గోల్‌మాల్
- కరెంటు సామగ్రి, బ్లీచింగ్ పేరుతో వినియోగం
- లెక్కాపక్కా లేని రికార్డులు
- అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి
- పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు షోకాజ్ నోటీసులు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో నిధుల వినియోగంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు వేగం పెంచారు. అక్రమార్కులపై దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించిన ఘటనలు బయటకు వస్తుండటంతో పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది. ఉప్పుగుండూరు గ్రామపంచాయతీలో అయితే ఏకంగా సర్పంచ్‌కు తెలియకుండానే అప్పటి వైసీపీ నాయకుల అండదండలు చూసుకొని పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. పంచాయతీ నిధులు అక్రమంగా ఖర్చుచేశారని, వాటి వినియోగంపై విచారణ చేయాలని ఇటీవల ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఆ నిధుల వినియోగంపై విచారణకు ఆదేశించగా పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు వెలుగులోకి రావడంతో పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆ పంచాయతీలో సుమారు రూ.42లక్షల నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసినట్లు తెలిసింది.

సింగరాయకొండలో భారీగా దుర్వినియోగం

సింగరాయకొండ మేజర్ పంచాయతీలో సుమారు రూ.40లక్షల మేరకు నిధులను డ్రా చేసినట్లు తెలిసింది. పంచాయతీ నిధుల వినియోగంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని జనసేన పార్టీ ఆ మండల నాయకుడితో పాటు మరికొంతమంది ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేయడంతో జనరల్ ఫండ్ నుంచి రూ.13 లక్షలు, 15 ఆర్థికసంఘం నిధులు సుమారు రూ.38.73 లక్షలు డ్రా చేయగా అందులో రూ.24.87 లక్షలు సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతభత్యాలకు చెల్లించారు. మిగిలిన రూ.12లక్షల నిధులకు రికార్డులు లేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ గత జనవరి నుంచి తన కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో ఇటీవల ఆ ఆఫీసు తాళాలు పగలగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు దొడ్డవరం గ్రామపంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని భారీగా నిధులను దుర్వినియోగం చేసినట్లు సమాచారం.




దొడ్డవరంలోని వాటర్ పంపింగ్ స్కీం



ఉప్పుగుండూరు పంచాయతీ కార్యాలయం

పంచాయతీ కార్యదర్శుల ద్వారా..

అనేక పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గ్రామాల్లో ఏదైనా అత్యవసర పనులు ఉంటే వాటిని పూర్తిచేసి నిధులు డ్రా చేస్తారు. కానీ అందుకు భిన్నంగా పారిశుధ్య నిర్వహణ కోసం అవసరమయ్యే బ్లీచింగ్, కరెంటు సామగ్రిలను కొనుగోలు చేసినట్లు తెలిసింది. అందుకు సంబంధించిన రసీదులను కూడా ఇష్టారీతిన పెట్టినట్లు సమాచారం. సింగరాయకొండ గ్రామపంచాయతీలో అయితే పూర్వ పంచాయతీ కార్యదర్శుల సమయంలో విద్యుత్ సామగ్రి కొనుగోలు చేసినట్లు ఇప్పుడు బిల్లులు పెట్టారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.



పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జాన్‌బాషాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జాన్‌బాషా ప్రస్తుతం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. దొడ్డవరం గ్రామపంచాయతీలో వాటర్‌స్కీంకు సంబంధించి రూ.25.02 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయి. ఇటీవల ఆ విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఆ నిధులకు సంబంధించి జాన్‌బాషా అధికారులకు వివరాలు ఇవ్వలేదు. దీంతో వాటిని దుర్వినియోగం చేశారన్న అభియోగంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఇప్పటికే ఆ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను కూడా రద్దుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అరకొరగా ఉన్న నిధులను కూడా అధికారపార్టీ సర్పంచ్‌లు ఇష్టారీతిన ఎలాంటి బిల్లులు లేకుండా ఖర్చుచేశారు. ఆయా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలకు ఉపక్రమించారు.

అసెంబ్లీలో ఆకట్టుకున్నారు

- వివరణాత్మక సమాధానాలిచ్చిన మంత్రులు
- నాలుగు సబ్జెక్ట్‌లపై అనర్గళంగా మాట్లాడిన ఏలూరి
- సీఎం, మంత్రులను కలిసి సమస్యలు చెప్పుకున్న ఎమ్మెల్యేలు
- రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ మంత్రులతో పలుమార్లు భేటీ

లోపలి పేజీల్లో...

వైద్యశాఖ ఉద్యోగుల్లో అలజడి

- ఎప్పుడో భర్తీచేసిన ఉద్యోగాలకు ఇప్పుడు విచారణలు
- ఆ సమయంలో ఏ ప్రాతిపదికన తీసుకున్నారో తెలియని పరిస్థితి
- ఉద్యోగుల వద్ద ధ్రువీకరణ పత్రాల పరిశీలనతో సరిపెట్టిన విచారణ
- శాఖలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సిబ్బంది వణుకు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఎప్పుడో భర్తీచేసిన పోస్టులపై ఇప్పుడు విచారణలు జరుగుతుండటంతో ఆ శాఖ ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. 2004 నుంచి ఇప్పటివరకు జరిగిన నియామకాలపై రాష్ట్రస్థాయి అధికారులు విచారణలు చేస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వైద్యశాఖలో 2002లో గుంటూరు రీజియన్ పరిధిలో భర్తీచేసిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఆ నేపథ్యంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో విచారణ పూర్తికాగా గురువారం ఒంగోలులో విచారణ జరిగింది. 2002 నుంచి ఇప్పటివరకు 160 హెల్త్ అసిస్టెంట్లు పోస్టులు భర్తీచేయగా, వారిలో వందమంది ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారు. మరో 60 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరూ అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులతోపాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపాల్సిన అవసరం వచ్చింది.



అంతా అయోమయం

సాధారణంగా ఉద్యోగ నియామకాల భర్తీలో అక్రమాలు జరిగాయంటే అప్పటి నోటిఫికేషన్‌తో పాటు రోస్టర్ విధానం, ఏ కేటగిరీకి ఎన్ని ఇచ్చారు తదితర అంశాలతో విచారణ చేపడుతారు. అలా కాకుండా నేరుగా 2002 నుంచి ఇప్పటివరకు భర్తీచేసిన పోస్టులపై విచారణ పేరుతో ఉద్యోగులందరినీ వైద్యశాఖ కార్యాలయానికి పిలిపించడంతో వారిలో ఆందోళన నెలకొంది. వైద్యశాఖపై ఎప్పుడు ఎవరు ఫిర్యాదులు చేస్తారో, ఎప్పుడు ఎవరు విచారణ చేస్తారో తెలియదు, ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ విచారణకు రావాలని ఆదేశాలిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు ఉన్నారు. గత నియామకాలపై అనేకమార్లు విచారణలు చేసి అక్రమాలు జరిగాయని నిర్ధారించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా విచారణ కూడా అలానే ఉంటుందా అన్న అనుమానాలున్నాయి. కేవలం ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకే విచారణ చేస్తున్నారా? అన్న ఆరోపణలున్నాయి.



రైతులకు రూ.83కోట్ల లబ్ధి

అధిక ఉత్పత్తిపై అపరాధ రుసుంను కేంద్రం రద్దుచేయడంతో దక్షిణాది ప్రాంత పొగాకు రైతులకు దాదాపు రూ.83 కోట్ల మేర లబ్ధిచేకూరనుంది. గతంలో అధికపంటపై ఐదుశాతం అపరాధ రుసుం వసూలు చేసేవారు. కాగా గత ఏడాది నుంచి వరుసగా రెండేళ్ల కర్నాటకలో దానిని రద్దు చేశారు. ఈ ఏడాది కూడా రద్దుచేయాలని రైతులు కోరిన నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించింది. అలాగే కూడా రాష్ట్రంలో అపరాధ రుసుం రద్దు వల్ల రూ.111 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరగా అందులో దక్షిణాదిలో దాదాపు రూ.83కోట్లు మేర లభించింది. ఒక్కొక్క రైతుకు సగటున సుమారు రూ.50వేల వరకు లబ్ధి చేకూరినట్లు బోర్డు అధికార వర్గాల సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

పొగాకు మార్కెట్లో అదే జోరు

- తిరిగి ప్రారంభమైన వేలం
- వెల్లంపల్లిలో రైతులతో ఈడీ సమావేశం
- గరిష్ఠ ధర కిలో రూ.360
- బ్రౌన్, బీఎక్స్‌లకు భారీ డిమాండ్
- అపరాధ రుసుం రద్దుతో రూ.83 కోట్ల మేర రైతులకు లబ్ధి



వెల్లంపల్లిలో వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు ఇతర అధికారులు

ఒంగోలు, జూలై 26(ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో అదే జోరు కొనసాగుతోంది. దాదాపు మూడు వారాల అనంతరం ఈ ప్రాంతంలోని 11 వేలం కేంద్రాల్లో శుక్రవారం పొగాకు కొనుగోళ్లు పునఃప్రారంభం కాగా గతంలో ఉన్న డిమాండ్ కొనసాగింది. మేలు రకం గరిష్ఠ ధర కిలో రూ.360 లభించగా లోగ్రేడ్లో నాణ్యమైన బ్రౌన్, బీఎక్స్‌గా పిలిచే గ్రేడ్‌లకు గతం కన్నా కిలోకు దాదాపు రూ.60 నుంచి 70కిపైగా పెరిగింది. అనుమతించిన మేర పంట కొనుగోళ్ల పూర్తి కాగా అధిక ఉత్పత్తి కొనుగోళ్లకు అనుమతి కోసం మూడు వారాల క్రితం వేలాన్ని బోర్డు అధికారులు నిలిపివేసిన విషయం విదితమే. అలాంటి పంటను అపరాధరుసుం కూడా లేకుండా తిరిగి కొనుగోలుకు కేంద్రం అనుమతించిన నేపథ్యంలో శుక్రవారం వేలం కేంద్రాలు తెరుచుకున్నాయి. దక్షిణాదిలోని 11 కేంద్రాలలో తిరిగి కొనుగోళ్ల ప్రారంభం కాగా పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, సెక్రటరీ దివి వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు ఇతర అధికారులు వెల్లంపల్లి కేంద్రంలో కొనుగోళ్లను పరిశీలించారు. రైతులతో ఈడీ సమావేశం నిర్వహించారు. అధిక పంట ఉత్పత్తికి అపరాధ రుసుం లేకుండా కొనేలా ఉత్తర్వులు తీసుకురావడం కోసం కీలక ప్రజాప్రతినిధులు, బోర్డు అధికారులు చేసిన కృషిని వివరించారు.

అధికంగా పండిస్తే నష్టమే: ఈడీ

ఇలా అధికంగా పంట పండిస్తే వచ్చే సీజన్‌లో రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించిన ఈడీ శ్రీధర్‌బాబు బోర్డు అనుమతించిన మేరకే సాగు, ఉత్పత్తిని చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా కొనుగోళ్ల పునఃప్రారంభం రోజున కూడా భారీ డిమాండ్ మార్కెట్లో కనిపించింది. ఇంచుమించు అన్ని కేంద్రాల్లోనూ గరిష్ఠ ధరలు కిలో రూ.360 మేర పలికాయి. అదేసమయంలో లోగ్రేడ్ ధరలు భారీగా పెరిగాయి. గతంలో లోగ్రేడ్‌లో నాణ్యతగా భావించే బ్రౌన్ రకం కిలో రూ.250 నుంచి 270 వరకు, అలాగే బీఎక్స్ రకం కిలో రూ.220 నుంచి రూ.240వరకు ఉండగా శుక్రవారం నాటి మార్కెట్లో వాటి ధరలు భారీగా పెరిగాయి. అత్యధిక శాతం బ్రౌన్ రకం కిలో రూ.320 నుంచి 330 వరకు పలుకగా బీఎక్స్ ధరలు కిలో రూ.300 పలికాయి. అంతేకాక ఆ రకం బేళ్ల కోసం బయ్యర్లు పోటీపడ్డారు.



విచారణకు హాజరైన అభ్యర్థులు

ఎయిడెడ్‌లో బోగస్ ఎన్‌రోల్‌మెంట్

పాఠశాలల్లో ఏరివేతకు ప్రభుత్వం ఉత్తర్వులు



ఒంగోలు(విద్య), జూలై 26 : ఎయిడెడ్ పాఠశాలల యాజమానులలో కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. పాఠశాలల్లో పిల్లలు చేరకపోయినా ప్రైవేటు స్కూళ్లల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు తమ స్కూళ్లల్లో నమోదు చేసి వారికి హాజరు వేస్తూ మోసానికి పాల్పడుతున్నారు. వాస్తవంగా తమ స్కూళ్లల్లో లేని విద్యార్థుల పేర్లు, వివరాలు యూడైస్‌లో ఎక్కించి కొత్తగా పోస్టులు మంజూరు చేయించుకునేందుకు చూస్తున్నారు. ఇటీవల కొన్ని ఎయిడెడ్ యాజమాన్యాలు కొత్త పోస్టుల కోసం కోర్టులను ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు పొందారు. తమ పాఠశాలల్లో పిల్లలు ఉన్నా పోస్టులు భర్తీచేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని హైకోర్టును ఆశ్రయించి పోరాడి పోస్టులు తెచ్చుకున్నారు. ప్రభుత్వం పోస్టుల భర్తీకి అనుమతిచ్చింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టులు మంజూరు చేయనున్నారు. తీరా కొందరు అధికారులు ఆ పాఠశాలల సందర్శనకు వెళ్లినప్పుడు బోగస్ ఎన్‌రోల్‌మెంట్ వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలపై దృష్టి పెట్టింది. వాటిల్లో బోగస్ ఎన్‌రోల్‌మెంట్ ఏరివేతకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు బుధవారం ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌జేడీలు, డీఈవోలు ఎయిడెడ్ పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. యూడైస్ నుంచి బోగస్ పేర్లు తొలగించాలన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కమిషనర్ కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : కలెక్టర్ తమీమ్ అన్సారియాను నూతన ఎస్పీ ఏఆర్.దామోదర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో శాంతిభద్రతలు, పోలీస్ శాఖ, పరిపాలన అధికార యంత్రాంగం మధ్య సమన్వయం, జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఎస్పీ మాట్లాడారు.



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు మొక్కను అందజేస్తున్న ఎస్పీ దామోదర్



ట్రంకురోడ్డు మధ్యలో తోపుడుబండ్లు



బంగారపు దుకాణాల రోడ్డులో నిలిపి ఉన్న వాహనాలు



బండ్లమిట్ట నుంచి మసీదుకు వెళ్లే రోడ్డులో..



వాహనాలతో రద్దీగా ఉన్న గాంధీరోడ్డు



కర్నూలురోడ్డులో నోపార్కింగ్ బోర్డు వద్ద ఉన్న ఆటోలు



కర్నూలురోడ్డులో బారులు తీరిన వాహనాలు

నగరంలో ట్రాఫిక్ కష్టాలు !

- రహదారుల వెంట పెరిగిపోయిన ఆక్రమణలు
- ఇష్టానుసారంగా ఎక్కడికక్కడే వాహనాల పార్కింగ్
- షాపుల వద్ద వాహనదారులకు స్థలం కరువు
- పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్..నిలిచిపోతున్న రాకపోకలు

ఆంధ్రజ్యోతి ఫోకస్



కొత్తపట్నం బస్టాండ్‌లో గందరగోళంగా వాహనాల రాకపోకలు

ఒంగోలు(క్రైం), జూలై 26: ఒంగోలు నగరంలో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయి. ఇరుకు రోడ్లు, ఆపై ఆక్రమణలు మూలంగా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. దీనికితోడు జంక్షన్స్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ సిబ్బంది బాధ్యతారహిత్యం వాహనదారులకు తలనొప్పిగా మారింది. మొత్తంగా నగరంలో పనులు నిమిత్తం బయిటకు రావాలంటే గంటల సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఇక చిరువ్యాపారులు రోడ్లపైన తోపుడు బండ్లు పెట్టడంతో కొనుగోలు చేసేవారు వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. షాపులకు పార్కింగ్ స్థలం లేకుండా రోడ్డు వరకు వారే ఆక్రమించుకుంటున్నారు. నగరంలో పెరుగుతున్న జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరగడంతో వీధులు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. అయితే అందుకు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయకపోగా, ఆక్రమణలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యపై పాలకులు, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పలు ప్రాంతాల్లో ఆక్రమణలు : నగరంలోని పలు ప్రాంతాల్లో గల రహదారులు ఆక్రమణకు గురికావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఆర్టీసీబస్టాండ్ అవుట్ గేటు వద్ద నుంచి ఇన్‌గేట్ వరకు ఉన్న పండ్ల దుకాణాలతో పాటుగా అక్కడే తోపుడు బండ్లను పెట్టుకొని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. దీంతో నిత్యంట్రాఫిక్ నిలిచిపోవడం సాధరణమైంది. అదే విధంగా సుందరయ్యభవన్ రోడ్డులో అనేక ఆసుపత్రులు ఉండటంతో ఎక్కువ రద్దీగా ఉంటుంది. అయితే వాహనాలు రోడ్లపైనే పార్కు చేయడంతో కొంచం సమయం పట్టే ప్రయాణం గగనంగా మారుతోంది. దీనికితోడు నగరంలోని పెద్దపెద్ద షాపులకు సైతం పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్ల పైనే వాహనాలు పార్కు చేస్తున్నారు. నెల్లూరు బస్టాండ్‌లో బ్యాంకలుఉ, షాపులకు కూడా పార్కింగ్ స్థలాలు లేవు. దీంతో ద్విచక్రవాహనదారులు తమ వాహనాలు రోడ్లపైనే పార్కింగ్ చేయడం పరిపాటిగా మారింది. దీనివల్ల ట్రాఫిక్ నిలిచిపోతుంది.

పార్కింగ్ ఎక్కడపడితే అక్కడే.. వాహనదారులు తమ పనుల కోసం వచ్చి రోడ్లపైనే తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే ఆయా ప్రాంతాల్లో ఉన్న షాపులు, కార్యాలయాలు, వివిధ బార్‌లు, హోటల్స్ వద్ద కూడా కారు పార్కింగ్ సౌకర్యం లేదు. దీంతో రోడ్ల వెంట పార్కు చేసి హోటల్స్‌కు వెళుతున్నారు. దీంతో ఆ మార్గంలో వాహనదారులకు అడ్డుగా మారుతున్నాయి.

ఆటోడ్రైవర్లు ఇష్టానుసారం.. ఇక నగరంలో ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఆటంకం కలగడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా రోడ్లపై ప్రయాణికుల కోసం ఎక్కడ పడితే అకస్మాత్తుగా ఆటోలు ఆపి ఎక్కించుకుంటున్నారు. దీంతో ఆటోల వెనుక వచ్చే వాహనదారులు ఢీకొని ప్రమాదాలు జరగడం నిత్యకృత్యం. కొంతమంది డ్రైవర్లు అతివేగంగా ఆటోలు నడుపుతూ వన్‌వేలలోకి వెళుతున్నారు. ఇలా కొత్తపట్నం బస్టాండ్ నుంచి మస్తాన్ దర్గా వరకు జరుగుతుంది. దీంతో వన్‌వేలో వచ్చే వాహనాలు నిలిచి పోతున్నాయి.

అస్తవ్యస్తంగా ట్రాఫిక్ సిగ్నల్స్ : నగరంలో ప్రకాశంభవన్, మంగమూరురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు ఎటుపడితే అటు వెళ్ళడంతో ప్రమాదాలు జరగడంతో పాటు వాహన రాకపోకలు నిలిచి పోతున్నాయి. ప్రస్తుతం ప్రకాశంభవన్, మంగమూరు రోడ్డు వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయడం లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ లేక పోవడం వాహనదారులు ఇష్టానుసారంగా నడపడంతో సమస్యగా మారుతుంది. ఇలా ట్రాఫిక్ సమస్యకు అనేక కారణాలు ఉన్నాయి.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నాం : సీఐ

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు అనేక చర్యలు చేపట్టామని ట్రాఫిక్ సీఐ మాలకొండయ్య శుక్రవారం తెలిపారు. మంగమూరు రోడ్డు జంక్షన్, ప్రకాశం భవన్ వద్ద సిగ్నల్ వ్యవస్థను మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. రోడ్లపైన నిలిపిన వాహనాలను టోయింగ్ వెహికల్ ద్వారా పోలీస్‌స్టేషన్‌కు తరలించి జరిమానాలు వేస్తున్నామన్నారు. కొన్ని చోట్ల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సంబంధించి కార్పొరేషన్ అధికారులతో మాట్లాడినట్లు సీఐ పేర్కొన్నారు.

జీవో 217 రద్దుపై మత్స్యకారుల హర్షం



చంద్రబాబు చిత్రపటానిక పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

సింగరాయకొండ, జూలై 26 : గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.217 టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దుచేయటం పట్ల మండలంలోని ఊళ్లపాలేనికి చెందిన మత్స్యకారులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్‌రెడ్డి జీవో నెం. 217 తీసుకొచ్చి మత్స్యకారులు పొట్టకొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ జీవోతో సొసైటీల పరిధిలోని చెరువులను వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు అప్పగించి మత్స్యకారులను జీవనోపాధిపై దెబ్బకొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం జీవో నెం.217 రద్దుచేయడంతో రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాలకు మేలు చేకూరుతుందని ఆనందం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, నాయుడు గోపాల్ పాల్గొన్నారు.

పంచాయతీ స్థలంలో వైసీపీ నాయకుడి అక్రమ నిర్మాణం

- తొలగించాలని హైకోర్టు ఆదేశం



ఆక్రమణను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య

సింగరాయకొండ, జూలై 26 : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్ సర్వే నెం. 668 పంచాయతీకి చెందిన స్థలాన్ని ఆక్రమించి వైసీపీ నేత దావులూరి ఆదాం కట్టడాన్ని నిర్మించాడు. దీనిపై స్థానికులు గతంలో డీపీవోకి ఫిర్యాదు చేశారు. ఏడాది కితం డీఎల్పీవో పద్మ అక్రమ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధికారుల ఆదేశాలతో పంచాయతీ స్థలంలో నిర్మించిన మెట్ల నిర్మాణాన్ని తొలగించాలని అప్పటి పంచాయతీ కార్యదర్శి ఆదాంకు నోటీసులు జారీచేశారు. దీనిపై వైసీపీ నేత ఆదాం హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు, ప్రతివాదనలు విన్న హైకోర్టు పంచాయతీ స్థలంలో ఉన్న అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో శుక్రవారం ఆక్రమణకు గురైన స్థలాన్ని పంచాయతీ కార్యదర్శి రామకోటయ్య పరిశీలించారు. మూడురోజులలోపు రెవెన్యూ, పోలీసుల సమక్షంలో ఆక్రమణలు తొలగిస్తామని చెప్పారు.

గ్రానైట్ వ్యర్థాలతో జలాలు కలుషితం



కాలువను పరిశీలిస్తున్న మైన్స్ ఆర్ఐ

చీమకుర్తి, జూలై26 : రామతీర్థం ప్రాంతంలో మైలవరం మేజర్‌లోకి క్వారీల నుంచి యథేచ్ఛగా వదులుతున్న వ్యర్థాలతో జలాలు కలుషితమై ఈ ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు గనులశాఖకు చెందిన ఆర్ఐ శుక్రవారం మైలవరం మేజర్‌ని పరిశీలించారు. గనులశాఖ ఉన్నతాధికారులు, పొల్యూషన్ కంట్రోల్ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని గుండా శ్రీనివాసరావు తదితరులు కోరారు.

ప్రత్యేకంగా ఇసుక చార్జీలు వసూలు చేయొద్దు

కలెక్టర్ అన్సారియా

ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: ఇసుక స్టాక్ పాయింట్ల నిర్వహణ ఖర్చులు తప్ప ప్రజల నుంచి ప్రత్యేకంగా ఇసుక చార్జీలు ఏమీ వసూలు చేయడం లేదన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం అమరావతి నుంచి గనులు, భూగర్భ వనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ముఖేష్‌కుమార్‌మీనా, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు నూతన ఇసుక విధానంలో స్టాక్ పాయింట్ల నిర్వహణకు తప్ప ఇసుక కోసం ప్రత్యేకంగా ఎలాంటి రుసుం వసూలు చేయడంలేదన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్టాక్ పాయింట్ నుంచి ఒకే ప్రదేశానికి సరఫరాలో రవాణా చార్జీల పరంగా వ్యత్యాసం లేకుండా త్వరలోనే ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో 26వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ మురళీమోహన్, డీటీసీ సుశీల, ఆర్డీవో సుబ్బారెడ్డి, గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

క్షేత్రస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు లబ్ధిదారులకు అందేలా మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం జిల్లా పరిషత్, గ్రామ, వార్డు సచివాయాలు, ప్రణాళిక, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఇస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోమౌలిక సదుపాయాలపై జిల్లా పరిషత్ అధికారులు మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అధికారులు మాధురి, హనుమంతరావు, ఉషారాణి, సాయికుమార్, భరద్వాజ్, రవితేజ, సీపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీని సెంట్రల్ స్కీం కింద చేర్చాలి

- కేంద్రాన్ని కోరిన ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని మార్కాపురం మెడికల్ కాలేజీని సెంట్రల్ స్కీం కింద చేర్చాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. తద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు దోహదపడుతుందన్నారు. శుక్రవారం పార్లమెంట్‌లో జరిగిన సమావేశంలో ఈ విషయంపై మాగుంట మాట్లాడారు. నేషనల్ మెడికల్ కమిషన్ 10 లక్షల జనాభాకు 100 మెడికల్ సీట్లు పరిమితి విధించిందని, దీని వల్ల ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు నష్టపోతున్నాయని తెలిపారు. అందువల్ల ఎన్ఎంసీ విధించిన పరిమితిని సరిచేయాలని కోరారు. దీనిపై వైద్యశాఖ మంత్రి సమాధానం ఇస్తూ దేశంలో 2014లో 387 వైద్య కళాశాలలు ఉండగా 51,348 సీట్లు ఉండగా, ప్రస్తుతం దేశంలో 731 వైద్యకళాశాలల్లో 1,12,113సీట్లు ఉన్నాయన్నారు. నాణ్యమైన వైద్య విద్యను అందించడంలో ముందున్నామని తెలిపారు. ఎన్ఎంసీ విధించిన పరిమితిపై సంబంధిత రాష్ట్రాలతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాగుంట మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వకాలంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారని, కానీ వాటిలో సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం కింద మూడు కళాశాలలు మాత్రమే తీసుకున్నారని తెలిపారు. మార్కాపురంలోని వైద్యకళాశాల నిర్మాణంలో ఉందని, జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించినందున కళాశాలను సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీం కిందకు తీసుకు రావాలని కోరారు. దీనిపై ఆరోగ్యశాఖమంత్రి సమాధానం ఇస్తూ రాష్ట్రంలో ఆల్ ఇండి యా మెడికల్ సైన్సెస్‌ను ప్రారంభించనున్నామని తెలిపారు.

అధికంగా పొగాకు పండిస్తే అనర్థం తప్పదు

- ఈడీ శ్రీధర్‌బాబు



రైతులతో మాట్లాడుతున్న ఈడీ శ్రీధర్‌బాబు

మద్దిపాడు, జూలై 26: రైతులు పొగాకును అధికంగా పండిస్తే అనర్థాలు తప్పవని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో వేలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రెజిల్, జింబాబ్వే వంటి దేశాల్లో పొగాకు పంట ఉత్పత్తి తక్కువ కావడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో పొగాకుకు డిమాండ్ వచ్చిందన్నారు. అనధికార బేరన్లను నిర్మించడం మంచిది కాదని ఆలా నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎం లక్ష్మణరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులతో నాణ్యమైన పొగాకు పండించాలని, అధికంగా రసాయన ఎరువులు వాడకూడదని చెప్పారు. రైతు సంఘ నాయకుడు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ అదనపు పొగాకు ఉత్పత్తిపై కేంద్రం జరిమానా రద్దు చేసిందని, మరో వైపు పొగాకుకు మంచి ధర వస్తుండటంతో రైతులలో హర్షం వ్యక్తమవుతుందన్నారు. పంట ఉత్పత్తి పరిణామం పెరగడంతో పాటు అదనపు ఉత్పత్తి కమీషన్ రద్దు చేయటంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బోర్డు సెక్రటరీ వేణుగోపాల్, ప్రొడక్షన్ మేనేజర్ ఎం.కృష్ణ, టెక్నికల్ మేనేజర్ రామాంజనేయులు, ఆక్షన్ సూపరింటెండెంట్ కోవి రామకృష్ణ, బోర్డు మెంబర్లు, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు విధిగా వేయించాలి

- జేడీఏ బేబీరాణి



రైతులకు సూచనలు చేస్తున్న జేడీఏ బేబీరాణి

సింగరాయకొండ, జూలై 26 : పశువులు, జీవాలకు వ్యాధులు సోకకుండా పశుపోషకులు విధిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి సూచించారు. స్థానిక పశువైద్యశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు ఉచితంగా టీకాలు అందజేస్తోందన్నారు. టీకాలు వేయించడం వలన పాలదిగుబడి తగ్గదని సూచించారు. ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న జొన్నవిత్తనాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. పచ్చిమేత వలన పాలదిగుబడి పెరుగుతుందని చెప్పారు. అనంతరం రైతులకు సబ్సిడీ జొన్నవిత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు ఎస్. హజరత్తయ్య, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

30న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : ఒంగోలులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 30వతేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ రిటైల్ రంగంలో ఉద్యోగ అవకాశానికి సంబంధించి కంపెనీలో ప్యాకింగ్, పికింగ్, స్కానింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఐటీఐ డిప్లమో, పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు జీతం నెలకు రూ.16975తో పాటు నివాసం, రవాణా ఖర్చులు, పనితీరు ఆధారంగా ప్రోత్సాహకాలు ఇస్తారన్నారు. 18నుంచి 35 ఏళ్ళ మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 08592-281776 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, జూలై 26: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు గాయాలైన సంఘటన శుక్రవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర వద్ద జరిగింది. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న లారీ, మరో లారీని అధిగమించబోయి మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న అద్దంకికి చెందిన ఆర్.పరమేశ్వర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

డాక్టర్ సత్యనారాయణాచార్యులుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న అభిమానులు

ఒంగోలు(కల్చరల్), జూలై 26: ఆయుర్వేద వైద్యరంగానికి పరాంకుశం సత్యనారాయణాచార్యులు అందించిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఒంగోలులో మున్సిపల్ ఆయుర్వేద వైద్యశాల (ఘోషా ఆస్పత్రి) వైద్యునిగా మూడు దశాబ్దాలకు పైగా సేవలందించిన డాక్టర్ పరాంకుశం సత్యనారాయణాచార్యులు ద్వితీయ వర్ధంతి పేర్నమిట్టలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు అభిమానులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఘోషా హాస్పటల్ డాక్టర్‌గా పేరుపొంది అనేక వేలమందికి ఆయుర్వేద వైద్య సేవలను సత్యనారాయణాచార్యులు అందించారని, ప్రతి ఒక్కరినీ ఎంతో ప్రేమగా చూసేవారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరాంకుశం వేణు, పరాంకుశం చక్రవర్తి పాల్గొన్నారు.

నేడు ఓఎఫ్ఎం సినీ సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), జూలై 26: ఒంగోలు ఫస్ట్ మీడియా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు, ఆల్ ఇండియా కళారంగం జిల్లా వైస్ ప్రెసిడెంట్ జీ.పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ప్రాంగణంలో సాయంత్రం 4 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ప్రముఖ గాయకులు శైలజ, అంజుస్వామి, శ్రావ్యరెడ్డి, యశోద, ఉషారాణి తదితరులు పాటలు పాడతారన్నారు. సంగీతాభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కేన్సర్ బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: కేన్సర్‌తో బాధపడుతున్న బాధిత కుటుంబానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకున్నారు. ఒంగోలు మండలం గుండమాలకు చెందిన సింగోతు కోటేశ్వరరావు గత రెండేళ్ల నుంచి కేన్సర్‌తో బాధపడుతున్నారు. నాల్గవ స్టేజికి చేరిన వ్యాధికి గుంటూరులో రేడియేషన్‌చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని పునర్జన్ ఆయుర్వేద ఆస్పత్రిలో గతరెండు నెలలుగా మందులు వాడటంతో కొంత మేర నయమైంది. అయితే నెలకు రూ.20వేలు మందులకు అవుతుండటంతో సోమవారం కలెక్టర్‌ను కలిసి తన ఆవేదనను చెప్పుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ అన్సారియా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఆ ఆర్థిక సహాయాన్ని అందించాలని చైర్మన్ ప్రకాష్‌బాబుకు సూచించారు. దీంతో శుక్రవారం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా బాధితుడు కోటేశ్వరరావు సతీమణికి ఆ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏవో సుధాకరరావు, అడ్మిన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకేయూ వైస్ చాన్స్‌లర్‌కు శుభాకాంక్షలు

ఒంగోలు(విద్య), జూలై 26: ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వైస్ చాన్స్‌లర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ డీవీఆర్.మూర్తిని శుక్రవారం ఐసీఐసీఐ బ్యాంకు ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు వీసీకి పూల మొక్కను అందజేశారు. తమ బ్యాంకు ఖాతాదారులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ రామకృష్ణారెడ్డి, సేల్స్ రీజనల్ హెడ్స్ లిపిక, ముష్రాత్, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో క్విస్ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు(విద్య), జూలై 26: ఒంగోలు నగరం కర్నూలురోడ్డులోని క్విస్ హైస్కూలు విద్యార్థులు కరాటే పోటీల్లో తమ సత్తా చాటి పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు శుభశ్రదాస్, సీహెచ్.హరినారాయణ, ఎస్‌కే.ఖలీద్‌లు గోల్డ్, బ్రౌంజ్, సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక స్కూలులో పతకాలు సాధించిన విద్యార్థులను క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ చక్రవర్తి, వైస్ చైర్మన్ ఎన్.గాయత్రిదేవి, ప్రిన్సిపాల్ ఎస్.ఆంధ్రానిమేరి అభినందించారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఒంగోలు(విద్య), జూలై 26: ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే భవిష్యత్ రోజుల్లో పోటీతత్వాన్ని తట్టుకోగలరని సమగ్రశిక్ష జిల్లా అకడమిక్ మానటరింగ్ అధికారి ఎం.రమేష్ పేర్కొన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రాకెట్ ప్రయోగాన్ని పరిశీలించి, దానిని తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జీ.కృష్ణకుమారి, స్టాఫ్ సెక్రటరీ డి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేస్‌లో ఇంజనీరింగ్ తరగతులు ప్రారంభం

ఒంగోలు(విద్య), జూలై 26: ఒంగోలులోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాన్సెంటిక్స్ క్యాటలిస్ట్ టెక్నాలజీ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ శ్రీనివాసరెడ్డి ముమ్మడి హాజరై మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ వృత్తి విద్య నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఉన్నత ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు పేస్ కాలేజీలో ఉన్నాని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తమ కాలేజీ మీద నమ్మకం పెట్టుకొని వందశాతం అడ్మిషన్ల భర్తీకి సహకరించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రతిభను చూపి కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ప్రిన్సిపాల్ జీవీకే. మూర్తి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో సానుకూల దృక్పథం, మంచి ఆలోచనలతో రాణిస్తేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో డీన్ కె.రూపఅక్కేష్, విభాగాధిపతి రవీంద్ర, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ఆర్.వీ రాంజనేయులు, అకడమిక్ డీన్ సీవీ.సుబ్బారావు, ఏవో రమణబాబు పాల్గొన్నారు.

ఇంటిపన్ను వసూలు ముమ్మరం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

మద్దిపాడు, జూలై 26: మద్దిపాడు పంచాయితీలో ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ఆశాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయితీలో పారిశుధ్యంపై దృష్టిపెట్టాలని, సకాలంలో తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సచివాలయ సిబ్బంది కూడా సమన్వయంతో పనిచేయాలని, పనులు చేసిన తర్వాతే బిల్లులు మంజూరు చేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఆకట్టుకున్నారు..!

వివరణాత్మక సమాధానాలిచ్చిన మంత్రులు

నాలుగు సబ్జెక్టులపై అనర్గళంగా మాట్లాడిన ఏలూరి

సీఎం, మంత్రులను కలిసి సమస్యలు చెప్పుకున్న ఎమ్మెల్యేలు

రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ మంత్రులతో పలుమార్లు భేటీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం ఐదు రోజులే జరిగినప్పటికీ అసెంబ్లీ సమావేశాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవటంలో జిల్లాలోని అధికారపార్టీ ఎమ్మెల్యేలు సఫలీకృతులయ్యారనే చెప్పుకోవచ్చు. తొలిసరిగా మంత్రులైనప్పటికీ ఇటు స్వామి, అటు రవికుమార్ సభ్యుల ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు ఇచ్చి మన్ననలు పొందారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు నాలుగు అంశాలపై అనర్గళంగా మాట్లాడారు. మిగిలిన ఎమ్మెల్యేలు సీఎం నుంచి ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల వరకు తిరిగి ఆయా నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం తొలి అడుగు వేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిరోజు సమావేశాలకు అలా వచ్చి ఇలా వెళ్లిపోగా ఆ నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు మాత్రం దరఖాస్తులు పట్టుకొని అసెంబ్లీలోను బయట మంత్రుల చుట్టూ తిరగటం కనిపించింది.

కలిసికట్టుగా సమస్యల ప్రస్తావన

ప్రస్తుతం ఐదురోజులు పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల సాధన, సమస్యల పరిష్కారంలో కలిసికట్టుగా ముందడుగు వేశారు. అసెంబ్లీ బయట లోపల కూడా ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు కలిసి తిరగటం ముఖ్యమంత్రి నుంచి ఆయా మంత్రుల వరకు కలిసి వెళ్లి మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం జిల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చిన వెంటనే అందరూ సీఎంని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించి ఐక్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి రావటం పట్ల చంద్రబాబు కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఆ సందర్భంలోనే ఎమ్మెల్యేలు జిల్లాకు సంబంధించి ఆయన ఇచ్చిన హామీలను గుర్తుచేయటం విశేషం. ఇక పర్చూరు, కందుకూరు ఎమ్మెల్యేలు ఏలూరి, ఇంటూరి సీఎంని కలిసి నియోజకవర్గాల సమస్యల చిట్టాను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి, రామానాయుడు, సత్యప్రసాద్‌తోపాటు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులను ప్రత్యేకంగా కలిసి ఆయారంగాల వారి సమస్యలు వివరించి కొన్ని హామీలు పొందారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తాగునీరు, గ్రామీణాభివృద్ధి సమస్యలపై అటు పవన్‌కళ్యాణ్ ఇటు లోకేష్‌తోపాటు కొందరు అధికారులను కలిశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల సీఎంతోపాటు లోకేష్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. ఎస్‌ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మంత్రులతోపాటు తనకున్న పరిచయాలతో కొన్ని శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయి పలురంగాల అంశాలపై కదలిక తెచ్చుకోగలిగారు. మధ్యలో అటు వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఇటు దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు అధికారులను కలిసి కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎరిక్షన్‌బాబు మూడు రోజులు అక్కడే మకాం వేసి మంత్రులతోపాటు ఉన్నతాధికారులను కలిసి కొన్ని స్పష్టమైన హామీలు పొందగలిగారు.

దీటైన సమాధానాలు ఇచ్చిన మంత్రులు

ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు స్వామి, రవికుమార్‌లు వారి శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానాలు ఇచ్చి ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. మంత్రి స్వామి వద్ద ఎక్కువ శాఖలు ఉండటంతో నాలుగు రోజులుపాటు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ముందుగా సేకరించుకున్న సమాచారంతోపాటు గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తిచూపుతూ స్వామి మాట్లాడారు. శాసనమండలిలో విద్యుత్ రంగంపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రవికుమార్ సమాధానమిస్తూ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం నాడు చంద్రబాబు ప్రయత్నిస్తే, చెత్తపై పన్ను వేసి తలాతోక లేని నిర్ణయాలతో విద్యుత్ శాఖను జగన్ అప్పులపాలు చేశాడంటూ చక్కటి ఉదాహరణలతో ప్రసంగించారు. ఆ సమయంలో శాసనమండలిలో ఉన్న లోకేష్ కూడా రవి ప్రసంగాన్ని ఆసక్తిగా వినటం, చప్పట్లు కొట్టడం విశేషం. అన్ని అంశాలపై అవగాహన ఉన్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరికి ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం కల్పించారు. నాడు-నేడు పనులు, గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసకర చర్యలపై ఆయన ప్రసంగించారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపుతూ ఆయన అనర్గళంగా చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

లయన్స్‌క్లబ్ ఆఫ్ చీమకుర్తి సేవలు మరింత విస్తృతం



ప్రమాణ స్వీకారం చేసిన క్లబ్ నూతన కార్యవర్గం

చీమకుర్తి, జూలై26 : లయన్స్‌క్లబ్ ఆఫ్ చీమకుర్తి సేవలను మరింత విస్తృత పరుస్తామని నూతన అధ్యక్షుడు నూనె హేమసుందరం తెలిపారు. నూతనకార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం శుక్రవారం చీమకుర్తిలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా హేమసుందరం, ప్రధానకార్యదర్శిగా అంజిరెడ్డి, కోశాధికారిగా పార్థసారథిలు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా సీహెచ్.హరిప్రసాద్‌రావు, ఆర్.లక్ష్మీనారాయణ, ఎన్.మోహనరావు, డాక్టర్ బి.జవహర్, చలువాది బదరినారాయణ పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలకు బీరువాలు, వంటసామగ్రి అందచేతతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో చలువాది రమేష్, సుబ్బరామయ్య, మందపాటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్యమహిళలు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో వాసవీమాత



ఆశీర్వాదం అందుకుంటున్న సుధీర్‌కుమార్

చీమకుర్తి, జూలై26 : చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో ఆషాడ గోరింటాకు పండగను పురస్కరించుకొని వాసవీమాత శాకంబరి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం నుంచే భక్తులు విశేషపూజల్లో పాల్గొన్నారు. యువపారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్, శిద్దా లక్ష్మీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. సంప్రదాయబద్ధంగా పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వాసవి మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు, జూలై 26: సంతనూతలపాడు బస్టాండ్ వద్ద సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం దాత సబ్‌రిజిస్ట్రార్ ఇస్మాయిల్ షరీఫ్ కుమార్తె సల్మా పుట్టిన రోజు సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వేమా కవిత, వైస్ చైర్మన్ హసీనబేగం, సభ్యులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ సీనియర్ జట్ల ఎంపిక

ఒంగోలు (కార్పొరేషన్), జూలై 26 : జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ జట్లు ఎంపిక శుక్రవారం ఒంగోలులోని ఏబీఎం డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. స్త్రీ, పురుషుల వేర్వేరు జట్లు ఎంపిక జరగ్గా, ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఆగస్టు 10 నుంచి 12వ తేది వరకు గుంటూరు జిల్లా వినుకొండలో జరిగే 10వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని కార్యదర్శి బి.సుబ్బారావు తెలిపారు.

నగర క్యాటర్స్ అసోసియేషన్ ఎన్నిక

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 26 : ఒంగోలు నగర క్యాటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. స్థానిక రామనగర్ 11వ లైనులో ఏర్పాటు చేసిన సమావేశానికి జెమిని శ్రీనివాసరావు నిర్వహణ కర్తగా వ్యవహరించగా, అధ్యక్షులుగా మూతిన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మూసులూరి కోటి, చీదళ్ల సతీష్‌కుమార్, కార్యదర్శిగా వల్లశెట్టి నాగరాజు, కోశాధికారిగా నంగనం శివ, జాయింట్ సెక్రటరీగా బొంతల అర్జున్, సుంకర శివ, పువ్వాడ సురేష్‌తోపాటు మరో కార్యవర్గ సభ్యులుగా ఎనిబెర విల్సన్, సొప్పా శివ కుమార్, జంపాల సునీత, అన్నెబోయిన వెంకటేశ్వర్లు, మన్నే శంకర్, వి.విశ్వనాథశాస్త్రిలను ఎన్నుకున్నారు.

రేపు జిల్లా స్థాయి అండర్-9 చెస్ పోటీలు

ఒంగోలు(విద్య), జూలై 26 : జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 28 న ఒంగోలు నగరం సుజాతనగర్‌లోని ఐకాన్ గ్లోబల్‌స్కూలులో జిల్లా స్థాయి అం డర్-9 చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాఖ్య సెక్రటరీ అబ్దుల్‌నబీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహిస్తారు. వివరాల కోసం 9666725719 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కౌలు కార్డులను అందజేయాలి : డీఏవో

కొండపి, జూలై 26 : కౌలు రైతులకు అవగాహన కలిగించి కౌలు కార్డుల నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని డీఏఈవో శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం ఉదయం కొండపిలోని ఆర్‌బీకే-1లో వ్యవసాయశాఖ సిబ్బంది, వీఏఏలతో ఆయన మాట్లాడుతూ మండలంలో 1023 కౌలు కార్డులు అర్హులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ ఇ.నిర్మలకుమారి, ఏవో విజయ్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

1న భారీగా ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణ

● నగర అధ్యక్షుడు ప్రభుదాస్



మాట్లాడుతున్న ప్రభుదాస్

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 26 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఆగస్టు 1న ఒంగోలులోని పలు కాలనీల్లో ఎమ్మార్పీఎస్ జెండాల ఆవిష్కరణలు చేపట్టినట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగర అధ్యక్షుడు గుంటూరి ప్రభుదాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ బలోపేతానికి, ఎస్సీ వర్గీకరణ ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వర్గీకరణ సాధనే లక్ష్యంగా మందకృష్ణమాదిగ చేపట్టిన ఉద్యమానికి తగిన ప్రతిఫలం, వర్గీకరణ ఫలాలు త్వరలోనే అందబోతున్నాయన్నారు. అందులో భాగంగా మొదటగా నగరంలోని ఇందిరమ్మకాలనీ, తూర్పు క్రిస్టియన్‌పాలెం, కరుణాకాలనీ, విజయనగర్‌కాలనీ, మామిడిపాలెం, సంతపేట, ప్రగతికాలనీ, క్లౌపేట, వెంగముక్కలపాలెం, దండుపాలెం, దారావారికుంట, గుర్రంజాషువాకాలనీ, కొప్పోలు, త్రోవగుంట, చెరువుకొమ్ముపాలెం, యరజర్ల, కర్నూల్‌రోడ్ తదితర ప్రాంతాలలో ఆగస్టు 1వ తేదీన ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరిస్తున్నట్లు ప్రభుదాస్ తెలిపారు. మాదిగ సోదరులు, యువత, ఎమ్మార్పీఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు పాలడుగు రమేష్, ఆదిమూలపు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

సంతనూతలపాడు, జూలై 26: మండలపరిధిలోని ఆయా గ్రామాలకు సంబంధించిన రెవెన్యూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ సమస్యలపై వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరగా రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే వారి సమస్యలను పరిష్కారం చూపాలని, అలసత్వం ప్రదర్శించవద్దని తెలిపారు. కార్యక్రమంలో డీటీ షేక్.సుష్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్పీ దామోదర్ ● కొండపి, జరుగుమల్లి పోలీస్‌స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు ● ట్రాఫిక్‌ను నియంత్రించాలని ఆదేశం



కొండపిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

కొండపి, జూలై 26 : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ దామోదర్ హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన కొండపి, జరుగుమల్లి పోలీస్ స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిపై సీఐ పాండురంగారావు, ఎస్సై కృష్ణబాజీబాబులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని సూచించారు. అనంతరం స్టేషన్ లోపలి గదులను, స్టేషన్ వెనుకవైపు ఉన్న ఖాళీ స్థలాన్ని, శిథిలావస్థలకు చేరిన పోలీసు క్వార్టర్లను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కొండపిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్లపైనే దుకాణాలు, బండ్లు అడ్డుగా పెట్టిన వారిపై నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేయాలని ఎస్పీ సీఐ, ఎస్సైలకు సూచించారు. ఆదేవిధంగా ట్రాఫిక్ రద్దీ వేళల్లో సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించాలని ఆదేశించారు. స్టేషన్ ప్రహరీ ముందు ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు, ఖాళీ స్థలాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెట్రోల్ బంకు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయిస్తామని ఎస్పీ చెప్పారు. అలాగే జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికులతో ఎస్పీ మాట్లాడారు.

మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌లోనూ...

మర్రిపూడి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ దామోదర్ ఆదేశించారు. మర్రిపూడి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. 60కిపైగా పెండింగ్ కేసులు ఉండటంపై ఆయన ఎస్ఐని ఆరా తీశారు. కొండపి సీఐ పాండురంగారావు, ఎస్ఐ శివబసవరాజు తదితరులు ఉన్నారు.

ప్రజల స్వేచ్ఛను హరించేలా నూతన నేరచట్టాలు

● సీనియర్ న్యాయవాది రాజేంద్రప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : కేంద్రం ప్రభుత్వం తెచ్చిన నూతన నేర చట్టాలు ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు సుంకర రాజేంద్రప్రసాద్ ఆరోపించారు. ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో శుక్రవారం రాత్రి వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ అధ్యక్షత వహించిన సదస్సులో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తెచ్చిన చట్టాలు కొనసాగకూడదని వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన నేర చట్టాలలో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవన్నారు. గతంలో వరకట్నవేధింపులు, వరకట్న ఆత్మహత్యలు నేరాలుగా ఉండేవి కాదన్నారు. వాటి స్థానంలో కొత్త చట్టాలు నేరాలుగా పరిణలోకి తెచ్చారని చెప్పారు. పాత చట్టాలనే పేర్లు మార్చి తెచ్చారని ఆరోపించారు. కానీ నేడు తెచ్చిన నూతన చట్టాలలో కేవలం పదిశాతం చట్టాలను మాత్రమే మార్పులు చేశారన్నారు. చట్టాలు మారినప్పుడు ప్రజలకు మరింత స్వేచ్ఛను ఇచ్చేలా ఉండాలే తప్ప అందుకు భిన్నంగా ఉన్నాయని ఆరోపించారు. ఎటువంటి అభిప్రాయ సేకరణ జరగకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. జూలై 1 నుచి అమలులోకి వచ్చిన ఈ చట్టాలు సెక్షన్ 111తీసుకువచ్చి రాజకీయ పార్టీలు, నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన నిలబడకుండా, వారికి వారి కుటుంబసభ్యులు ఎటువంటి ఆశ్రమం ఇవ్వకుండా ఉండేలా కఠిన శిక్షలను అమలులోకి తెచ్చారని విమర్శించారు. టైటలింగ్ యాక్టులో భూ యాజమాన్య హక్కును ప్రజలను దూరం చేసేలా చట్టాన్ని తెచ్చారన్నారు. చివరకు పోలీసులే న్యాయంచేసేలా కొత్త చట్టాలను రూపొందించారన్నారు. వీటి వల్ల సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో నాయకులు జీవీ.కొండారెడ్డి, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాగర్, డీవీఎన్.స్వామి, చుండూరి రంగారావు, ఎండీ.యాసిన్, సీనియర్ న్యాయవాది గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



వాసవిక్లబ్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న సభ్యులు



మాంటిస్సోరి స్కూల్‌లో కార్గిల్ దివస్ వేడుకలు

ఒంగోలు(కల్చరల్), జూలై 26: కార్గిల్‌దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన భారత సైనికులకు శుక్రవారం ఒంగోలులో ఘనంగా నివాళులర్పించారు. వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో స్థానిక బండ్లమిట్టలోని కార్గిల్ స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి అమరవీరులకు నివాళులర్పించారు. 1999లో కశ్మీర్‌లోని లడఖ్ ప్రాంతంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల చొరబాటును అడ్డుకునే యుద్ధంలో 700 మంది భారత సైనికులు ప్రాణాలు అర్పించారని, వారి త్యాగానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26ను కార్గిల్ దివస్‌గా జరుపుకోవటం జరుగుతుందని వాసవి క్లబ్ అధ్యక్షులు నల్లమల్లి బద్రినారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ రీజన్ చైర్‌పర్సన్ దర్శి మనోహర్, చంద్రశేఖర్, చలువాది సత్యనారాయణ, పబ్బిశెట్టి గోవర్ధన్, చీదెళ్ల వెంకటప్రసాద్, భూమా శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, రాధారమణగుప్తా జంధ్యం, గుర్రం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో...

ఒంగోలు(విద్య): ఒంగోలులోని మాంటిస్సోరి హైస్కూలులో కార్గిల్ విజయదీవస్ సందర్భంగా శుక్రవారం అమరవీరులకు విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శబరినాథ్ మాట్లాడుతూ 1999లో పాకిస్తాన్ సైన్యాన్ని తరిమికొడుతూ కార్గిల్‌లో భారత సైన్యం విజయకేతనం ఎగురవేసిందని, కెప్టెన్ విక్రయబత్రా ధైర్యం, దేశభక్తి అనిర్వచనీయమని చెప్పారు. కార్గిల్‌లో విజయం సాధించి 25సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా విద్యార్థులు సైనికుల వేషధారాణలతో చేసిన కవాతు అందరినీ ఆకర్షించింది. అనంతరం యుద్ధంలో అమరులైన జవానులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నూరుద్దీన్, ఉపాధ్యాయులు రమేష్, అనిల్, గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లన్నీ మందుబాబుల నిలయాలే..!

● భయాందోళనలో ప్రజలు





అనంతవరం రోడ్డు పక్క చేలో తాగి పడేసిన మద్యం సీసాలు, వ్యర్థాలు

టంగుటూరు, జూలై 26 : గ్రామీణ రహదారులన్నీ మందుబాబులకు నిలయాలుగా మారాయి. కాస్త చీకటి పడితే చాలు బ్రిడ్జీలు, చప్టాలన్నీ వారికి విడిది కేంద్రాలుగా మారిపోతున్నాయి. ప్రధానంగా టంగుటూరు నుంచి అనంతవరం, రావివారిపాలెం, పసుకుదురు రహదారులలోని బ్రిడ్జీలు, చప్టాల వద్ద ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. వాటి వద్దకు మందు, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, అలాగే రకరకాల పండ్లు, పునుగులు, బోండాలు, చపాతీలు లాంటి చిరుతిండ్లతో చేరుకుంటున్నారు. రాత్రి పొద్దు పోయేదాకా మద్యం తాగుతూ దారిన వెళ్లే వారిలో అభద్రతను సృష్టిస్తున్నారు. గత ఏడాది అనంతవరం రోడ్డులో తప్ప తాగి రోడ్డు మీదనే వీరంగం వేస్తున్న సమీప పుల్లారెడ్డిపాలెం యువకులను ప్రశ్నించారని దారిని పోయేవారిని ఆపి గందరగోళ పరిచారు. ఇంకొందరు రోడ్డు పక్క చేలల్లో సిటింగ్‌లు వేస్తున్నారు. మహిళలతో బైక్‌పై వెళ్తున్నప్పుడు మందుబాబుల ఈలలు, కేకలు ఇబ్బందిగా ఉంటున్నాయని కొందరు చెబుతున్నారు.

పోలీసులు దాడులే మరిచారు...

గ్రామీణ రహదారుల వెంట పోలీసులు గస్తీ మరిచారు. దీంతో మందుబాబులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు వస్తారన్న భయం ఉంటే మందు బాబులు రోడ్లెక్కేందుకు భయపడతారని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ నిర్వహించాలని కోరుతున్నారు.


జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాల

డిగ్రీ కళాశాలలో వసతులు కరువు

- ఒకే ప్రాంగణంలో ఇంటర్, డిగ్రీ విద్యాబోధన
- గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల అవస్థలు

పెద్ద దోర్నాల, జూలై 26: ప్రభుత్వం ఆర్భాటంగా మంజూరు చేసిన డిగ్రీ కళాశాల వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. దీంతో విద్యార్థుల విద్య కుంటుపడు తోంది. గత ప్రభుత్వం 2022 నవంబరులో డిగ్రీ కళా శాలను మంజూరు చేసింది. కానీ వసతులు కల్పించడం విస్మరించింది. తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదుల్లో డిగ్రీ విద్యార్థులు అభ్యసి స్తున్నారు. దీంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డిగ్రీ విద్యార్థులకు విడతల వారీగా బోధించాల్సి వస్తోంది. ఉదయం గం.8ల నుండి మధ్యాహ్నం గం.12 ల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు, మధ్యాహ్నం గం.12-30ల నుండి సాయంత్రం గం.5ల వరకు డిగ్రీ విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారు. అది కూడా 12 తరగతి గదులు అవసరం కాగా ఏడు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ సావిత్రి తెలిపారు. కొన్నిసార్లు ఇంటర్మీడియట్ విద్యార్థులకు సాయం త్రం 4గంటల వరకు కూడా తరగతులు నిర్వహించే అవసరం వస్తోంది. ఆ సమయంలో మరింత ఇబ్బందికరంగా ఉంటోందని ఆమె చెప్పారు. అధ్యాపకులు పూర్తిస్థాయిలో ఉన్నా విద్యార్థులకు విద్యనందించలేక పోతున్నామని అధ్యాపకులు చెబుతు న్నారు. కళాశాల కార్యాలయ పనులు నిర్వహణ, అధ్యాపక సిబ్బంది కొద్దిసేపు సేదతీరే గదులు కూడా లేక ఇబ్బందు లు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఉన్నతాధికారులు పాలకులు స్పందించాలని కోరుతున్నారు.

కళాశాల నిర్మాణానికి స్థలసేకరణ ముఖ్యం

గత ప్రభుత్వం హడావుడిగా కళాశాలను మంజూరు చేసింది. కానీ అందుకు తగిన స్థలం, నిధుల కేటాయింపు పట్ల నిర్లక్ష్యం వహించడంతో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య చదవలేక ఇంటర్మీడియట్‌తోనే ఇంటికి పరిమితమవుతున్నారు. ప్రధానంగా బాలికలు. గిరిజన నిరుపేదలు అధికంగా ఉండే జిల్లా శివారు ప్రాంతం కావడంతో డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో సంతోషించారు. అయితే కళాశాలకు అవసరమయ్యే స్థలం సేకరణ చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ భూమి అందుబాటు లో ఉంటే వెంటనే నిధులు మంజూరు అయ్యే అవకాశం కూడా ఉందని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. స్థానికంగా నిరుపయోగంగా వ్యవసాయ మార్కెట్టు యార్డు 13 ఎకరాలు ఉండగా 2 ఎకరాలు మండల కార్యాలయాలకు ప్రభుత్వం కేటాయించింది. ఇంకా 11 ఎకరాలు అందుబాటులో ఉంది. మూడు దశాబ్దాలు దాటినా నేటికీ వ్యవసాయ మార్కెట్ యార్డు విని యోగంలోకి రాలేదు. ముళ్లకంపతో అస్తవ్యస్తంగా మారింది. ఆకతాయిలకు అసాంఘిక చర్యలకు ఆవాసంగా మారింది. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి పక్కనే ఉండడంతో బాలికలకు రక్షణగా కూడా ఉంటుందని పట్టణానికి చెందిన పలువురు పెద్దలు భావిస్తున్నారు. కళాశాలకు ఐదు ఎకరాలు స్థలం అవసర మవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి కళాశాల నిర్మాణం చేపట్టాలని, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరతున్నారు.

అవీ..ఇవీ..

రాయితీపై కందుల పంపిణీ


కంది విత్తనాలు అందజేస్తున్న ఏవో

పెద్ద దోర్నాల, జులై 26: మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలో రైతులకు 30శాతం రాయితీతో వ్యవసాయా ధికారి జవహర్ లాల్‌నాయక్ ఆధ్వర్యం లో సర్పంచి జీ పోలమ్మ శుక్రవారం కందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్తికి ప్రత్యామ్నాయంగా కందులు విత్తాలని సూచించారు. మండలానికి 10 క్వింటాళ్ల కందుల విత్తనాలు మంజూరయ్యాయని, కావలసిన రైతులు పట్టాదారుపుస్తకం, ఆధార్‌కార్డు నకలు, ఫోన్ నెంబరు తీసుకుని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కిలో రూ.139.80లు ఖరీదు కాగా రాయితీ రూ.41.94లు పోను రూ.97.86పై.లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజేంద్ర ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

ట్రంకు పెట్టెల అందజేత


ట్రంకు పెట్టెలు అందిస్తున్న డాక్టర్ దంపతులు

గిద్దలూరు, జూలై 26 : పట్టణంలోని సంజీవిని అనాథ వృద్ధాశ్రమానికి కంభం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్, ఆయన భార్య గైనకాలజిస్టు డాక్టర్ పద్మావతిబాయిలు తమ కుమార్తె పుట్టినరోజు సందర్భంగా రూ.10వేల విలువైన ట్రంకు పెట్టెలను వృద్ధులకు అందజేశారు. వృథా ఖర్చులు కొంతవరకు మానివేసి అనాథ, వృద్ధాశ్రమాలకు చేయూతనివ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు రాయుడు, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ హబీబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారును కలిసిన టీడీపీ నాయకులు


తహసీల్దారును సన్మానిస్తున్న నాయకులు

పెద్ద దోర్నాల, జూలై 26: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నూత నంగా బాధ్యతలు చేప ట్టిన తహసీల్దార్ కే. దాసును టీడీపీ మండల నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలి పారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మంజూర్ బాష దేసు నాగేంద్రబాబు, సోమేపల్లి శేఖర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

జీవశిలీంధ్రనాశినిపై అవగాహన


ట్రైకోడెర్మా విరిడిని తయారు చేస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

బేస్తవారపేట, జూలై 26: తక్కువ పెట్టుబడితో పంటల దిగుబడికి ఉపయో గపడే ట్రైకోడెర్మావిరిడి జీవశిలీంధ్ర నాశినిని రైతులో సొంతగా తయారు చేసుకో వచ్చునని గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీ నాయక్ అన్నారు. శుక్రవారం మండలం లోని జగ్గంబోట్ల కృష్ణాపురం గ్రామంలో ట్రైకోడెర్మావిరిడీ తయారీపై అవగాహన కల్పించారు. ట్రైకోడెర్మా విరిడి సుడోమోనాస్‌ను తక్కువ పరిమాణంలో ఉపయో గించి ఎక్కువ ట్రైకోడెర్మా విరిడి ఉత్పత్తి చేసుకునే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా ఒక పొర 50 కిలోల పశువుల ఎరువు, దానిపై కిలో ట్రైకోడెర్మా విరిడి, బెల్లం నీళ్ల చల్లి, 10 కిలోల వేప పిండిని వేయాలన్నారు. అదే విధంగా మరో బెడ్ కూడా వేసుకోవాలన్నారు. వాటిపై నీళ్ల చల్లి నీడ ఉండే ప్రదేశంలో గోనే సంచులు కప్పి ఉంచుకోవాలన్నారు. రోజూ నీళ్ల చల్లుతూ ఉంటే 20 రోజులలో ట్రైకోడెర్మా విరిడి శిలీద్రం వృద్ధి చెందుతుం దన్నారు. తక్కువ ఖర్చుతో ఎరువును తయారు చేసుకోవచ్చునని అన్నారు. కార్య క్రమంలో వ్యవసాయాధికారి జె.మేర్సీ పాల్గొన్నారు.

పింఛన్ దొంగలపై విచారణకు ఆదేశాలు

పుల్లలచెరువు, జూలై 26: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఫించన్ దొంగలపై విచారణకు జిల్లా డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధరకుమారి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో 'పింఛన్ దొంగలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జిల్లా పీడీ ఆదేశాల మేరకు పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం,పెద్దారవీడు, దోర్నాల, త్రిపురాంతకం మండలాల్లోని సుమారు ఏడు వేల బోగస్ పింఛన్లపై ఐదు మండలాల అధికారులు విచారించాలని పీడీ ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే విచారణ ప్రారంభించి అర్హులైన లబ్ధిదారు లను గుర్తించి పెన్షన్ కేటాగిరి వారిగా దివ్యాగ ధ్రువీకరణ పత్రాలు, వాస్తవ వయస్సులను పరిశీలించిన తరువాత అర్హుల పెన్షన్ కొనసాగించాలన్నారు. అనర్హులైన పెన్షన్ దారులకు నోటీసులు జారీ చేసి ఎంపీడీవో లాగిన్‌లో నిలుపు దల చేయాలన్నారు. ఐదు మండలాల ఎంపీడీవోలు రెండు రోజుల్లో తీసుకున్న చర్యలను నివేదికల ద్వారా డీఆర్‌డీఏ కార్యాలయాని నివేదికలు పంపించాలని ఆదేశాలు ఇచ్చారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

మార్కాపురం వన్‌టౌన్, జూలై 26: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ కిరణ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డులలో శుక్రవారం ఆయన పారి శుధ్య పనులు పర్యవేక్షించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమం లో ఏఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గిద్దలూరు, జూలై 26 : పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని బీజేపీ జిల్లాశాఖ ఉపాధ్యక్షులు బి.వి.రామాంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పెట్రోల్ బంకులో తాగునీటి సౌకర్యం, ఎయిర్‌పంప్, మరుగుదొడ్డు, తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. గిద్దలూరు ప్రాంతంలోని పలు పెట్రోల్ బంకుల్లో కొన్ని సదుపాయాలు లేక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

రెండు లారీలు ఢీ- ఇద్దరికి గాయాలు

బేస్తవారపేట, జూలై 26 : అమరావతి - అనంతపురం జాతీయ రహదారిలోని బేస్తవారపేట మండలం లక్ష్మీపురం సమీపంలో ఎదురెదురుగా రెండు లారీలు ఢీ కొట్టుకోవడంతో రెండు లారీలు బోల్తా పడ్డాయి. రోడ్డుపక్కన పంట పోలాలల్లోకి దూసుకెళ్లి బోల్తా పడ్డాయి. దీంతో ఇద్దరు డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి.

గిద్దలూరు తహసీల్దార్ బదిలీ


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

గిద్దలూరు, జూలై 26 : గిద్దలూరు తహసీల్దార్ సిద్ధార్థ తిరిగి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల ముందు బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ప్రభుత్వం తిరిగి సొంత జిల్లాలకు తహసీల్దార్లను బదిలీ చేసింది. దీంతో ఆయన తిరిగి ఆయన గుంటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్ ముస్తాక్, డిప్యూటీ తహసీల్దార్ ఏ.సుబ్బారావు, రీసర్వే డీటీ జె.వెంకటయ్య వీఆర్‌వలో సంఘం జిల్లా అధ్యక్షులు వై.పి.రంగయ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

డ్రైవరు కుటుంబానికి ఆర్థికసాయం


డ్రైవర్ కుటుంబానికి సాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

త్రిపురాంతకం, జూలై 26: ట్రావెల్స్ కారు డ్రైవరుగా పనిచేస్తూ ఇటీవల అనారో గ్యంతో మృతిచెందిన డ్రైవరు కుటుంబానికి మండల ఓనర్స్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తోటిడ్రైవర్లు ఆర్థికసాయం చేశారు. స్థానికంగా డ్రైవరుగా పనిచేస్తున్న పి.కోటిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఆయన కుటుంబ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తోటి డ్రైవర్లు అంతా కలిసి రూ.40,500లను కోటి రెడ్డి కుటుంబానికి గురువారం రాత్రి అందజేశారు.

పూల దుకాణంలో చోరీ

రూ.1.20 లక్షల నగదు అపహరణ

మార్కాపురం, జూలై 26: స్థానిక గడియార స్తంభానికి సమీపంలోని ఓ పూల దుకాణంలో శుక్రవారం చోరీ జరిగింది. దుకాణంలోని బీరువాను పగులగొట్టి రూ.1.20 లక్షల మేర నగదును దోచెకెళ్లారు. పట్టణ పోలీసుల కథనం మేరకు స్థానిక గడియారస్తంభం వద్ద ఉన్న పాత ఏఎస్ఎల్ ఆఫీస్ పక్కన ఎస్‌కే ఖాజావలికి చెందిన ఏపీహెచ్ఎస్ పూల దుకాణం ఉంది. ఎప్పటిలాగే గురువారం రాత్రి కూడా దుకాణం షట్టర్‌కు తాళం వేసి ఖాజావలి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం వేకువజామున దుకాణం వద్దకు వచ్చి చూసేసరికి షట్టర్‌కు ఉన్న తాళం తీసిఉంది. దీంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచివుంది. దానిలోని రూ.1.20 లక్షల నగదు అపహరణకు గురైనట్లు గ్రహించి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ దుకాణాన్ని పరిశీలించి బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్గిల్ 25వ విజయోత్సవ కార్యక్రమాలు

కంభం, జూలై 26 : కంభం మాజీ సైనికుల సంఘం కార్యాలయంలో మాజీ సైనికులు శెట్లం వేణుగోపాల్ ఆధ్వర్యంలో కార్గిల్ 25వ విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అనంతరం వీరనారి వకులాదేవిని సత్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి ఈ ప్రాంతంలో కేంద్రీయ పాఠశాల ఏర్పాటు, వలంటీర్ సేవలకు మాజీ సైనికులు, వితంతువులకు అవకాశం కల్పించాలని కోరారు. రేషన్‌కార్డుతో సమానంగా మాజీ సైనికులకు ప్రత్యేక డిఫెన్స్ వెల్ఫేర్ కార్డు అందచేయాలని కోరారు. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పాతవిధానంలో అమలు చేయాన్నారు. కార్యక్రమంలో రామయ్య, ఎస్సై బాషా, ముస్తఫా, పోలయ్య, సుబ్బయ్య, రంగయ్య, గురువారెడ్డి, పాండురంగయ్య, వకులాదేవి, రాజ్యలక్ష్మి, నూర్జహాన్ పాల్గొన్నారు.

కళాశాలకు వసతులు కల్పించండి

- ఏఎస్‌డబ్ల్యూవోకు సమస్యలు వివరించిన ప్రిన్సిపాల్


సమీక్షిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో అరుణకుమారి

పెద్దదోర్నాల, జూలై 26: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏఎస్‌డబ్ల్యూవో అరుణ కుమారి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల వసతు లపై సమీక్షించారు. ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రి మాట్లాడుతూ కళా శాలలో పూర్తిస్థాయిలో విద్యార్థు ల ఎన్‌రోలుమెంట్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వసతులతో, హాస్టల్ ఏర్పాటు కష్టతరంగా మారుతోం దన్నారు. కళాశాల నూతనంగా ఏర్పాటు కావడంతో విద్యార్థులకు తగిన తరగతి గదులు లేవన్నారు. స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులను విడతల వారీగా వినియోగిస్తున్నామన్నారు. అయినా సరిపోక ఇబ్బందికరంగా మారిందన్నారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నా విద్యనందించలేక పోతున్నట్లు ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏఎస్‌డబ్ల్యూవో అరుణకుమారి మాట్లాడుతూ పూర్తి వివరాలతో నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయ నున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసాచార్యులు, రమణారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ రౌడీషీట్‌లను తొలగించండి

హోం మంత్రి అనితకు ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి


వినతిపత్రం అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూలై 26 : మండలంలోని వాదంపల్లి గ్రామంలో ఎన్నికల అనంతరం ఏర్ప డిన ఘర్షణలో పోలీసులు అక్రమంగా 28 మంది పై అక్రమంగా రౌడీషీట్లు తెరిచారని, వాటిని తొలగించాలని టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కోరారు. ఆ మేరకు అమరావతిలో రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు శుక్రవా రం వినతిపత్రం అందజేశారు. సమస్యలను వివ రించారు. దీనిపై హోం మంత్రి సాను కూలంగా స్పందించారని ఎరిక్షన్‌బాబు తెలిపారు.

ఎర్రగొండపాలెం : నియోజకవర్గంలో తాగు నీటి ఎద్దడి నివారణకు ట్యాంకర్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు కోరారు. శుక్రవారం ఆయన అమరావతిలో శశిభూషణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో వర్షాలు లేక గ్రామాల్లో తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతు న్నట్లు చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారం పై ప్రధానకార్యదర్శి సానుకూలంగా స్పందించా రన్నారు. నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా


వార్డులో రోగులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

కంభం, జూలై 26 : ప్రస్తుతం మారిన వాతావరణ ప్రభావం వలన దోమల బెడదతో ప్రజలు వైరల్ ఫీవర్లతో ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నందున వైద్య శాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకో వాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా కంభం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శివనాయక్‌కు సూచించారు. శుక్రవారం ఆయన కంభం ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఔట్, ఇన్‌పేషంట్ రూములను, మందుల స్టోర్ రూమ్, కంటి పరీక్ష, ప్రసూతి, ఆర్థోపెడిక్, జియోథెరపి, పిల్లల వార్డు, కాన్పుల వార్డులను పరిశీలించారు. రోగులను అడిగి తెలుసుకున్నారు. మహిళ పేషెంట్ల వార్డులో మరుగుదొడ్ల అపరిశుభ్రంగా ఉండడంపై సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జనరేటర్ రూమ్ సమీపంలో నీళ్ల నిలిచి అపరిశుభ్రంగా ఉండడం చూసి వైద్యశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే రోగులు ఇబ్బందులు పడతారని, తక్షణమే పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. వైద్యశాల ఆవరణలో ఇరిగేషన్ పంట కాలువలో మురికినీరు వెళు తుండడం గమనించి ఈ మురికి కాలువ ఎక్కడిదని అడగ్గా, అది ఇరిగేషన్ పంట కాలువ అని తెలిపారు. వెంటనే కాలువ పై భాగాన్ని కప్పివేయాలన్నారు. జనరేటర్ పని చేయక పోవడంతో కరెంటు పోయిన సమయంలో చీకట్లోనే మగ్గాల్సి వస్తుందని, ఫ్యాన్లు తిరగక దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆపరేషన్ సమయంలో కరెంటుపోతే సెల్‌ఫోన్ లైట్‌తో ఆపరేషన్ చేయాల్సి వస్తుందని తెలపగా కొత్త జనరేటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రోగులకు అందచేసే భోజనాన్ని రుచి చూశారు. రోగులకు నాణ్యమైన మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. హాజరుపట్టీని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస రావు, ఎంపీడీవో మస్తాన్‌వలి, తురిమెళ్ల సర్పంచ్ సుభద్ర, ఎస్సీ సెల్ నాయకులు గోన చెన్న కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

పోలీసు సిబ్బందికి ఎస్పీ దామోదర్ సూచన


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

పొదిలి, జూలై 26 : పోలీస్ స్టేషన్‌లో పెండిం గ్‌లో ఉన్న కేసులపై దృష్టిసారించి వాటిని సత్వర మే పరిష్కరించాలని ఎస్పీ దామోదర్ ఆదేశిం చారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డివిజన్ పరిధిలో, స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల పై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. పెండిం గ్ కేసుల గురించి ఎస్ఐని అడిగి తెలుసుకున్నా రు. గ్రామాలలో పోలీసులు తిరుగుతూ శాంతి భద్రతల పరిరక్షణలపై ప్రత్యేక దృష్టి సారించా లని కోరారు. శాంతికి విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. మంచిపనులు చేసేవారిని ప్రోత్సహించాలన్నారు. అదే విధంగా ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు తరచూ కౌన్సిలింగ్ ఇస్తూ అవగాహన కల్పించాల న్నారు. ఈవ్‌టీజింగ్ జరుగుతోం దని కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్ఐకి సూచిం చారు. అదేవిధంగా ట్రాఫిక్ సమస్య ఉందని అందుకు తగి న చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆర్టీసీ డిపో సమీపంలో ప్రధాన రహదారిపై ప్రైవేటు ట్రావెల్స్ ఎక్కువ సమయం నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమౌతుందని ప్రజలు ఫిర్యాదు చేయగా వారికి ట్రాఫిక్‌కు అంతరాయం లేనిచోట స్థలం కేటాయించాలని ఎస్ఐకి సూచించారు. వాహనాల నెంబర్‌ప్లేట్లపై వివిధ రకాల పేర్లతో స్టిక్కరింగ్‌లు వేస్తున్నారని వారిని గుర్తించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది విధి నిర్వాహణలో అలసత్వం వహించ కుండా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం పోలీస్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. 1940లో నిర్మించిన పాత పోలీస్ స్టేషన్‌ను సందర్శించి ప్రత్యేక ఆకర్షణీయంగా ఉండే విధంగా కార్యాలయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కోటయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డిజిటల్ టెక్నాలజీతో నేటి విద్యా విధానం మమేకం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

ఎర్రగొండపాలెం, జూలై 26 : శిక్షా సప్తాహ విద్యా వారో త్సవాలలో శుక్రవారం డిజిటల్ టెక్నాలజీపై విద్యార్థులకు ఎంఈవో పి ఆంజనేయులు అవగాహన శిక్షణ ఇచ్చారు. నేటి విద్యావిధానంలో డిజి టల్ వనరుల ద్వారా నేటి కాలంలో మన పాఠశాలలోనే చాలా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. తరగతి గదిలోని ఐఎఫ్‌బీ పానల్ డిజిటల్ బోర్డులు, అలాగే పాఠ్యపుస్తకాలలోని క్యూఆర్ కోడ్‌లు ఉపయోగించుకొని పాఠ్యాంశ విశ్లేషణ, టాబ్‌ల ద్వారా బోధన యూ ట్యూబ్ పాఠాలు, విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆన్‌లైన్ హజరు నిత్య జీవితంలో ఒక భాగం అవుతోందన్నారు. విద్యార్థులకు డిజటల్ క్లాసులపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే


ఎస్పీకి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే

మార్కాపురం, జూలై 26 : మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి శుక్రవారం రాత్రి ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గంజాయి అసంఘీక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నియోజకవర్గ నాయకులు నూరా పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వెలిగొండను సందర్శించిన డోన్ ఎమ్మెల్యే


సొరంగాలను పరిశీలిస్తున్న సూర్యప్రకాష్‌రెడ్డి

పెద్దదోర్నాల, జూలై 26: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని కీలకమైన సొరంగ నిర్మాణాలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దోర్నాల వచ్చిన క్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఏర్వ మల్లికార్జున రెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, షేక్ మంజూర్ భాష, తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోట్ల వెంట ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు.ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డికి స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు పనుల పురోగతులను వివరించారు.

అసెంబ్లీలో ఆకట్టుకున్నారు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం ఐదు రోజులే జరిగినప్పటికీ అసెంబ్లీ సమా వేశాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంలో జిల్లాలోని అధికారపార్టీ ఎమ్మెల్యేలు సఫలీకృతుల య్యారనే చెప్పుకోవచ్చు. తొలిసరిగా మంత్రులైనప్పటికీ ఇటు స్వామి అటు రవికుమార్ సభ్యుల ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు ఇచ్చి మన్ననలు పొందా రు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు నాలుగు అంశాలపై అనర్గళంగా మాట్లాడారు. మిగిలిన ఎమ్మెల్యేలు సీఎం నుంచి ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల వరకు తిరిగి ఆయా నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం తొలి అడుగు వేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిరోజు సమావేశాలకు అలా వచ్చి ఇలా వెళ్లిపోగా ఆ నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జులు మాత్రం దరఖాస్తులు పట్టుకొని అసెంబ్లీలోను బయట మంత్రుల చుట్టూ తిరగటం కనిపించింది.

కలిసికట్టుగా సమస్యల ప్రస్తావన

ప్రస్తుతం ఐదురోజులు పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల సాధన, సమస్యల పరిష్కారంలో కలిసికట్టుగా ముందడుగు వేశారు. అసెంబ్లీ బయట లోపల కూడా ఉమ్మడి జిల్లా లోని టీడీపీ ఎమ్మెల్యేలు కలిసి తిరగడం ముఖ్యమంత్రి నుంచి ఆయా మంత్రు ల వరకు కలిసి వెళ్లి మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్రప్రభుత్వం జిల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చిన వెంటనే అందరూ సీఎంని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఐక్యంగా కలిసి రావటం పట్ల చంద్రబాబు కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలోనే ఎమ్మెల్యేలు జిల్లాకు సంబం ధించి ఆయన ఇచ్చిన హామీలను గుర్తుచేయడం విశేషం. ఇక పర్చూరు, కందుకూరు ఎమ్మెల్యేలు ఏలూరి, ఇంటూరి సీఎంని కలిసి నియోజకవర్గాల సమస్యల చిట్టాను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర కూడా మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి, రామానాయుడు, సత్యప్రసాద్‌తోపాటు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రు లను ప్రత్యేకంగా కలిసి ఆయా రంగాల వారి సమస్య లు వివరించి కొన్ని హామీలు పొందారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తాగునీరు, గ్రామీణాభివృద్ధి సమస్యలపై అటు పవన్‌కళ్యాణ్ ఇటు లోకేష్‌తోపాటు కొందరు అధికారులను కలిశారు. మార్కాపురం ఎమ్మె ల్యే కందుల సీఎంతోపాటు లోకేష్ ను కలిసి పలు అంశాలను వివరించారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మంత్రులతోపాటు తనకున్న పరిచ యాలతో కొన్ని శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయి పలురంగాల అంశాలపై కదలిక తెచ్చుకోగలిగారు. మధ్యలో అటు వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఇటు దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు అధికారులను కలిసి కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఎరిక్షన్‌బాబు మూడు రోజులు అక్కడే మకాం వేసి మంత్రులతోపాటు ఉన్నతాధికారు లను కలిసి కొన్ని స్పష్టమైన హామీలు పొందగలిగారు.

దీటైన సమాధానాలు ఇచ్చిన మంత్రులు

ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు స్వామి, రవికుమార్‌లు వారి శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానాలు ఇచ్చి ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. మంత్రి స్వామి వద్ద ఎక్కువ శాఖలు ఉండడంతో నాలుగు రోజులుపాటు సభ్యుల ప్రశ్నలకు సమాధా నాలు ఇచ్చారు. ముందుగా సేకరించుకున్న సమాచా రంతోపాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తిచూ పుతూ స్వామి మాట్లాడారు. శాసనమండలిలో విద్యుత్ రంగంపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రవికుమార్ సమాధానమిస్తూ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం నాడు చంద్రబాబు ప్రయత్ని స్తే, చెత్తపై పన్ను వేసి తలాతోక లేని నిర్ణయాలతో విద్యుత్ శాఖను జగన్ అప్పులపాలు చేశాడంటూ చక్కటి ఉదాహరణలతో ప్రసంగించారు. ఆ సమయం లో శాసనమండలిలో ఉన్న లోకేష్ కూడా రవి ప్రసంగాన్ని ఆసక్తిగా వినటం, చప్పట్లు కొట్టడం విశేషం. అన్ని అంశాలపై అవగాహన ఉన్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరికి ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం కల్పించారు. నాడు-నేడు పనులు, గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసకర చర్యలపై ఆయన ప్రసంగించారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపుతా ఆయన అనర్గళంగా చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

వెనుకబడిన జాబితాలో జిల్లాను చేర్చటం అభినందనీయం

దొనకొండ, జూలై 26: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చటం అభినందనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆనంద ఆశ్రమంలో జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకడిన జిల్లాల జాబితాలో చేర్చేలా కృషిచేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి దిక్సూచి అని అన్నారు. దొనకొండలో ఉన్న సదుపాయాలు, ల్యాండ్ బ్యాంక్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వద్ద నివేదిక ఉందన్నారు. దొనకొండలో విమానాశ్రయం అభివృద్ధికి త్వరలో చర్యలు చేపట్టే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా బీజేపీలో చేరిన పలువురికి ఆయన పార్టీ కండవాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి

పామూరు, జూలై 26: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారుచేసి వడ్డించాలని తెలుగురైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గ్రామ టీడీపీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. భోజన నిర్వహణ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహబూబ్‌ఖాన్, టీడీపీ గ్రామ నాయకులు ఏలూరి నరసింహారావు, గోళ్ల వీరబాబు, యాదాల చెన్నకేశవులు, కోలా కృష్ణమూర్తి, వార్డు మెంబర్ కొమ్మలపాటి రామయ్య పాల్గొన్నారు. గ్రామ సచివాలయంలో రైతులకు జొన్నగడ్డి విత్తనాలను పంపిణీ చేశారు.

శాకాంబరీగా వాసవీమాత



శాకాంబరి అలంకరణలో వాసవీ మాత

పామూరు, జూలై 26: స్థానిక వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాస శుద్ధ షష్టి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. సుమారు వెయ్యి కేజీల కూరగాయలతో వాసవీమాతను శాకాంబరిమాతగా అలంకరణచేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో దరిశి నరసింహారావు, మంచికంటి సుబ్బారావు, గోన్గు రామారావు, యేల్చూరి బాలకొండలరావు, శేగు కృష్ణయ్య, దరిశి మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

సీఎస్‌పురం(పామూరు), జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు 75 శాతం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను అందజేస్తుందని పశువైద్యాధికారి డాక్టర్ షేక్ మునీర్‌బాషా తెలిపారు. శుక్రవారం సీఎస్‌పురం మండలం డీజీపేట పశువైద్యశాల కేంద్రంలో పశుపోషకులకు 75 శాతం రాయితీపై పీసీ-6 గడ్డిజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. పశుపోషకులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని ఆర్బీకే కేంద్రాల్లో పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

ముండ్లమూరు, జూలై 26: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం నుంచి ఉపాధి హామీ పథకంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఆర్.జనార్ధన్ తెలిపారు. 2023- 24 సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందంతో గ్రామ సభలు జరుగుతున్నట్టు ఆయన తెలిపారు.

భూ ఆక్రమణలను అరికట్టాలి

ముండ్లమూరు, జూలై 26: మండలంలోని పూరిమెట్లలో 18.50 ఎకరాలు వాగు పోరంబోకు భూమిని ఆక్రమార్కుల నుంచి కాపాడాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కాకనాల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పూరిమెట్ల గ్రామంలో ఆక్రమణలకు గురైన భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే ఆక్రమణదారుల పై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్, వెల్లంపల్లి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

దొనకొండ, జూలై 26: దొనకొండ పంచాయతీలో ముమ్మరంగా పారిశుధ్య పనలుఞ చేపట్టారు. సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, కార్యదర్శి డేవిడ్ నేతృత్వంలో అన్నీ వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్, రహదారుల వెంట బ్లీచింగ్ చల్లించారు. వీపీపురం ప్రధాన రహదారి పక్కన మురుగునీరు పేరుకుపోయి దోమలు, దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యదర్శి డేవిడ్ ఎక్స్‌కవేటర్‌తో కాలువ తీయించి మురుగునీరు నిలబడకుండా చర్యలు తీసుకున్నారు.

కరుణించని వరుణుడు

- చిరుజల్లులతో సరి
- వాడుముఖం పడుతున్న పత్తి
- అన్నదాతల ఆందోళన



వర్షాలు లేక వాడుముఖం పడుతున్న పత్తి మొక్కలు

దొనకొండ, జూలై 26: ఖరీఫ్ సీజన్‌లో పంటలసాగుకు అవసరమైన వర్షం కురవకపోవటంతో అన్నదాతలు వరుణదేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో రైతులు పంటల సాగు నిమిత్తం దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు. ఇటీవల అల్పపీడనం ప్రభావంతో తగినంత వర్షాలు కురుస్తాయని రైతులు ఆశగా ఆకాశం వైపు చూసినా జల్లులతోనే సరిపెట్టటంతో నిరాశకు గురయ్యారు. మండలంలో ఖరీఫ్‌లో మొత్తం 7836 హెక్టార్లల్లో పంటల సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 551 హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. అందులో కంది పంట 3305 హెక్టార్లకు గాను 99 హెక్టార్లు, సజ్జపంట 162 హెక్టార్లకు గాను 42 హెక్టార్లు, ఆముదం పంట 238 హెక్టార్లకు గాను 22 హెక్టార్లు, పత్తి 2568 హెక్టార్లకు గాను 351 హెక్టార్లు, బొప్పాయి తదితర ఇతర పంటలు 37 హెక్టార్లల్లో సాగు అయినట్లు సమాచారం. మండలంలో జూన్ నెలలో 62.5 మిల్లీమీటర్లు వర్షపాత నమోదు కావాల్సి ఉండగా 32.8 మి.మీ నమోదైంది. జూలై నెలలో 95.5 మి.మీ నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 59.8 మి.మీ నమోదు అయినట్లు సమాచారం. కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులు నాటిన విత్తనాలు మొలకెత్తకపోవటం, మొలకెత్తిన పత్తి మొక్కలు వర్షం లేక, ఇటీవల గాలులు వీస్తుండటంతో వాడుముఖం పడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతిరోజు ఆకాశంలో మబ్బులు వస్తుండటం, చిరుజల్లులు కురుస్తుండటంతో భారీ వర్షం కోసం అన్నదాతలు ఆశగా ఆకాశం వైపు చూస్తూ ఎదురుచూస్తున్నారు.

వాడుముఖం పట్టిన పత్తి

శృంగారపు నాగసుబ్బారెడ్డి, రైతు, నరసింహనాయునిపాలెం



పదిహేను రోజుల క్రితం కురిసిన జల్లులకు ఐదు ఎకరాల్లో పత్తిపంట, రెండు ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. అందుకు దాదాపు రూ.50వేలు ఖర్చు అయింది. మొలకెత్తిన పత్తి వర్షంలేక వాడుముఖం పడుతోంది. వర్షం లేక, ఇటీవల బీభత్సంగా గాలులు వీస్తుండటంతో కంది అసలు మొలకెత్తలేదు. వరుణుడు కరుణ కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం.

'ల్యాండ్ టైట్లింగ్' రద్దుపై రైతుల హర్షం

- గత వైసీపీ ప్రభుత్వంలో ఆమోదం
- హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు

పీసీపల్లి, జూలై 26: గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రైతన్నలకు నిద్రలేకుండా చేసింది. వారసత్వం, కష్టార్జితం, పిత్రార్జితం, స్వార్జితంతో సంపాదించుకున్న తమ భూములు వైసీపీ తెచ్చిన ఈ ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో తమ భూములు తమకు లేకుండా పోతాయన్న భయం రైతులను వెంటాడింది. మాజీ సీఎం జగన్ బొమ్మ ముద్రించి వైఎస్సార్ భూరక్ష పేరుతో రాళ్లు పాతడం, హక్కు పత్రాలపై జగన్ బొమ్మలు ముద్రించడతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఈక్రమంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేస్తామని నాటి ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు నిర్వహించిన పలు ప్రచార సభల్లో హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు ల్యాండ్ టైట్లింగ్‌యాక్ట్ రద్దు ఫైలుపై రెండో సంతకం చేసిన విషయం తెలిసిందే. దీనిని చట్టం రూపంలో తెచ్చేందుకు బుధవారం అటు శాసనసభ, ఇటు శాసనమండలిలో తీర్మానం పెట్టగా రెండు సభల్లోనూ ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. దీంతో నాటి వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన టైటిలింగ్ యాక్ట్ రద్దవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బాబు ఇచ్చిన హామీని నెరవేర్చారు

- వెన్నపూస శేషిరెడ్డి, నేరేడుపల్లి



చంద్రబాబునాయుడు రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. దీంతో సొంత భూములపై మాకున్న భయం తొలిగిపోయింది. వైసీపీ ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ప్రకటించగానే ఆందోళన చెందాం. ఇప్పుడు ఆ చట్టం రద్దుతో ఊరట చెందుతున్నాం.

దారుణమైన చట్టం భూస్థాపితం

- మోతుకూరి మాలకొండయ్య, వరిమడుగు



గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ చట్టం దారుణం. నాటి ప్రభుత్వంలోని పెద్దలు భూములు కాజేసేందుకు పన్నిన కుట్రను రైతులందరూ గమనించారు. అందులో భాగంగానే మొన్న జరిగిన ఎన్నికల్లో సైలెంట్‌గా ఓటేసిన రైతులు వైసీపీని సాగనంపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ చట్టాన్ని రద్దుచేయడంతో వైసీపీ తెచ్చిన చట్టం భూస్థాపితమైంది.

రికార్డులు మార్చేస్తారని భయపడ్డాం

- వేమూరి తిరుపతయ్య, కమ్మవారిపల్లి



మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా మా భూములను ప్రభుత్వం లాగేసుకుంటుందేమోనని ఆందోళన పడ్డాం. ఎన్నో ఏళ్లుగా వారసత్వంగా వచ్చిన భూముల కాగితాలను కూడా వైసీపీ నాయకులు మార్చేస్తారేమోనని భయపడ్డాం. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆచట్టాన్ని రద్దు చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నాం. శాసనసభ, శాసన మండలిలో టైటిలింగ్ యాక్ట్ చట్టం రద్దు కావడంతో ఊపిరిపీల్చుకున్నాం.

టైట్లింగ్ యాక్ట్ రద్దుతో ఊరటచెందాం

- కొండ్రెడ్డి అప్పిరెడ్డి, బుడ్డారెడ్డిపల్లి



నాకు వారసత్వంగా కొంత భూమి ఉంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంతో నాకు తెలియకుండా కాగితాలు మార్పు చేసి పొలం దక్కకుండా చేస్తారేమోనని ఆందోళన చెందాం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దుచేయడంతో నామనసు కుదుటపడి ఉరటచెందుతున్నాం.

పంచాయతీల్లో నిధుల కొరత

- పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు



బొట్లపాలెంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు

దర్శి, జూలై 26: పంచాయతీల్లో నిధుల కొరతతో పారిశుధ్య కార్యక్ర మాల నిర్వహణకు ఆటంకం ఏర్పడుతుంది. అయా గ్రామాల్లోని సర్పం చ్‌లు, గ్రామ కార్యదర్శులు కొన్ని పంచాయతీల్లో సొంత నిధులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వాతావణంలో చోటుచేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఈ వ్యాధులు ప్రబలకుండా పంచా యతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ప్రభుత్వం ఆదే శించిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారులు అన్నీ పంచాయతీల్లో మురుగు కాలువలను శుభ్రం చేయటం, బ్లీచింగ్ చల్లటం, ఫాగింగ్ చేయటం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయితే, నిధుల కొరతతో అనేక పంచాయతీలు ఇబ్బంది పడుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు పంచాయతీల్లో ఉన్న నిధులన్నింటినీ గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా డ్రా చేసుకున్నారు. కొన్నిచోట్ల ఎలాంటి పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారు. దీంతో పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది.

చేపల పాట సొమ్ము చెల్లించని పాటదారులు

చేపల చెరువులు ఉన్న పంచాయతీల్లో కూడా అనేకచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. చేపల పెంపకం పాటల ద్వారా అనేక పంచాయతీలకు లక్షలాది రూపాయల ఆదాయం వస్తుంది. కొన్నిచోట్ల వీటిని ఖర్చు చేశారు. మరి కొన్ని పంచాయతీల్లో చేపలు పట్టుకున్నప్పటికీ పాటదారులు సొమ్ము చెల్లించలేదు. సంబంధిత అధికారులు పంచాయతీల పర్యవేక్షణ సక్రమంగా చేయకపోవటం వల్ల ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఈవిషయంపై ఈవోఆర్డీ గుత్తా శోభన్‌బాబును వివరణ కోరగా కొన్ని పంచాయతీల్లో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమేనన్నారు. అయినప్పటికీ పారిశుధ్య కార్యక్రమాలు అన్నిచోట్ల క్రమంతప్పకుండా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండు పంచాయతీల్లో మాత్రమే చేపల పాట సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే ఆ సొమ్ము జమ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

- కనిగిరిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- సర్వే చేస్తున్న అధికారులు



సర్వే చేస్తున్న అధికారులు

కనిగిరి, జూలై 26: కనిగిరి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఈక్రమంలో శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మమ్మ చెట్టువీధి, బొడ్డుచావిడి రోడ్డును డివిజన్ సర్వేయర్ కొలతలు చేపట్టారు. తొలుత నగరికంటి బసవయ్యసెంటర్ నుంచి బొడ్డుచావిడి వరకు ల్యాండ్ స్కేపింగ్ కొలతలు చేపట్టారు. రామాలయం వీధి మలుపు తిరిగేందుకు అవసరమైన స్కేపింగ్ కొలతలు చేపట్టారు.

డివిజన్ సర్వేయర్ అధికారులు, మున్సిపల్ అధికారులు సర్వే చేపట్టడంతో అలజడి మొదలైంది ఎవరి నిర్మాణాలు ఎంత వరకు పోతాయో అంటూ లెక్కలు వేసుకుంటున్నట్టు చర్చ సాగుతుంది. ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో భాగంగా ప్రధానంగా ప్రభుత్వ, అసైన్డ్, పోరంబోకు స్థలాలను కూడా కలుపుకుని జరిగిన ఆక్రమణలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నట్లు అధికారుల వైఖరి నెలకొందని అధికార వర్గాల్లో చర్చ సాగుతుంది. కనిగిరి - కందుకూరు రోడ్డు, కనిగిరి - ఒంగోలు రోడ్డు, కనిగిరి - పామూరు రోడ్డు, కనిగిరి - గార్లపేట రోడ్డులలో ప్రజా అవసరాల మేరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలోనే డివిజ న్‌గా రూపాంతరం చెందటంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఎన్నికలు రావటంతో ఆ అంశం వాయిదా పడింది. దీంతో ఎన్నికల అనంతరం రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణలు తొలగించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆక్రమణలు తొలగించేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

చిట్టీల నిర్వాహకుడు పరార్

- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసులను ఆశ్రయించిన వైనం



ఎస్సై వద్ద వాపోతున్న బాధితులు

తాళ్లూరు, జూలై 26: మండలంలోని తూర్పుగంగవరంకు చెందిన ఓ చిట్టీల నిర్వాహకుడు పరారయ్యాడు. దీంతో చీటిపాట వేస్తున్నవారు ఆందోళన చెందుతూ పోలీసులను ఆశ్రయించారు. చీటిపాట నిర్వాహకుడి తండ్రి గతంలో హోటల్ నిర్వహించటంతో ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో కూలీనాలీచేసుకుని జీవనం సాగించే కూలీలు కూడా అతనివద్ద చీటీపాటలు వేస్తున్నారు.పాటదారులకు సకాలంలో పాడినపాటదారులకు డబ్బులు చెల్లిస్తూ నమ్మకం పొందటంతో గ్రామంలో దాదాపు 70మందికి పైగా చీటిపాటలు వేశారు.

ఇటీవలకాలంలో పాటపాడిన వ్యక్తులకు డబ్బులు చెల్లించటంలో జాప్యం చేశాడు. కొందరి పాటదారుల సొమ్ముకూడా తనకు అవసరం ఉందని సొంతానికి వాడుకున్నారు. మరికొందరు అధిక వడ్డీకి ఆశపడి అప్పుగా ఇచ్చారు. చీటీపాట డబ్బులు కోసం బాధితులు నిర్వాహకుడి ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. రేపు,ఎల్లుండి అంటూ మాటలు చెబుతూ కాలయాపన చేశాడు. బాధితుల ఒత్తిడి పెరగటంతో వారం క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పరార్ అయ్యాడు. అతని గురించి సమాచారం తెలియకపోవడంతో ఆందోళన చెందుతూ శుక్రవారం బాధితులు పోలీసులను ఆశ్రయించారు. స్థానిక ఎస్సై కె.విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



డీజీపీ ద్వారకా తిరుమలరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

దర్శి జూలై 26: దర్శి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు డీజీపీని కోరారు. శుక్రవారం సాయంత్రం తిరుమలరావును డీజీపీ కార్యాలయంలో వారు కలిశారు. ఈసందర్భంగా ఎన్నికల సందర్భంగా దర్శి నియోజకవర్గంలో జరిగిన సంఘటనలు వివరించినట్టు వారు పేర్కొన్నారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నా పోలీసులు పట్టించు కోలేదని ఫిర్యాదుచేశారు. ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. సమర్థవంతమైన అధికారులను నియోజకవర్గంలో నియమించాలని కోరగా, డీజీపీ సానుకూలంగా స్పందించారు. ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలకు సంబంధించిన సమాచారాన్ని తీసుకొని చర్యలు తీసుకుం టామని డీజీపీ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీఎస్‌పురం(పామూరు) జూలై 26: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని అరివేముల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ గద్దె ఏడు కొండలు సూచించారు. శుక్రవారం సీఎస్‌పురం మండలం అరివేముల ఎస్సీ కాలనీలో ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది షేక్ మంజూర్‌అహమ్మద్, ఎస్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ముండ్లమూరు, జూలై 26: ముండ్లమూరు మండల సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఆర్.జనార్దన్ తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పీసీపల్లి, జూలై 26 :పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం సమగ్ర శిక్ష అభియాన్, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కమ్మవారిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరపనేని నవీన్ సహకారంతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జుబేదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాళ్లూరు, జూలై 26: మండలంలోని బొద్దికూరపాడు పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేసిన తరువాత దోమలు వ్యాప్తిచెందకుండా తగు నివారణ మందులు పిచికారి చేయాలన్నారు. మంచినీటి పైపులైన్లలో మురుగునీరు కలిసి మంచినీరు అపరిశుభ్రం కాకుండా చూడాలన్నారు. సిబ్బంది తరుచూ గ్రామాల్లో సంచరిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కేజేఎస్ రాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ షహనాజ్ బేగం, సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రైతుల సంక్షేమం

కనిగిరి(హనుమంతునిపాడు), జూలై 26: టీడీపీతోనే రైతుల సంక్షేమం సాధ్యమని ఆపార్టీ నందనవనం గ్రామ అధ్యక్షుడు పెంచికల రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామపంచాయితీ పరిధిలోని 500మంది రైతులకు సబ్సిడీపై జొన్న విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారులు నిర్వహించే అవగాహన సదస్సులో పాల్గొని పంట సాగులో మెలకువలను తెలుసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరిశపోగు కృపారావు, కావేటి నారాయణ, ఆకుపాటి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కాశయ్య, పెన్నా గురవయ్య, శివన్నారాయణ, గంధం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఉగ్ర ప్రత్యేక పూజలు



వాసవీమాత ఆలయంలో పూజలు చేస్తున్న డాక్టర్ ఉగ్ర

పామూరు, జూలై 26: నియోజకవర్గ అభివృద్ధికి శ్రీవాసవిమాత ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పామూరులోని శ్రీవాసవి కన్యాకా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం రాత్రి జరిగిన ఆషాడశుద్ధి శాకాంబరి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలోని శాకాంబరిమాత అలంకరణలో ఉన్న అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ యేల్చూరి బాలకొండలు దంపతులు ఉగ్ర కు ఘనంగా సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. సంవృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో ఈ ప్రాంతం కళకళలాడాలని అమ్మ వారిని మొక్కుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, బి.జయరామిరెడ్డి, బి.నారాయణరెడ్డి యారవశ్రీను, బొల్లా నరసింహారావు, డీవీ మనోహర్, అమీర్‌బాబు, డాక్టర్ గద్దె ఏడుకొండలు, నరసారెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



కొమ్మమూరు కాల్వలో కోతపడిన కట్ట వెంట వేసిన ఇసుక మూటలు



హైలెవల్ ఛానల్‌లో గుర్రపుడెక్క

- అధ్వానంగా సాగునీటి కాల్వలు
- నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- డెల్టా పరిధిలోని కాల్వలకు స్వల్పకాలిక టెండర్లు
- ప్రతిపాదనల దశ దాటని సాగర్ కుడి కాల్వల బాగు

మరమ్మతులు జరిగేనా?

సాగునీరు పారాల్సిన కాల్వలు.. తూటికాడ, జమ్ము, రబ్బరు మొక్కలతో నిండిపోయాయి. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చివరి భూములకు సాగునీరు అందించాల్సిన కాల్వలు పూడికతో నిండిపోయాయి. సాగునీటి కాల్వల కట్టలు కోతకు గురై ఉన్నాయి. సాగునీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నా పాలకులకు పట్టలేదు. ఐదేళ్లు అటు వర్షాభావం.. ఇటు అరకొర ఉన్న సాగునీరు కాల్వల ద్వారా సక్రమంగా అందక రైతులు అల్లాడిపోయారు. అయినా పాలకులు కాల్వల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు.. రైతుల గోడు ఆలకించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలో అయినా సాగునీటి కాల్వల బాగుపై దృష్టి సారిస్తారని రైతులు ఆశిస్తున్నారు. ఖరీఫ్‌కు సాగునీటి ఇబ్బందులు లేకుండా కనీసం తాత్కాలిక మరమ్మతులు తక్షణం చేయాలని రైతులు కోరుతున్నారు.

గతంలో పనులు చేయకుండానే దోచేశారు

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి డెల్టా కాల్వల మరమ్మతులు, అత్యవసర మరమ్మతులు పూర్తిచేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత నాలుగు సీజన్లలో ఒక్కపని కూడా లేదు. ప్రభుత్వం రైతుల కోసం కేటాయిస్తానన్న నిధుల మాట అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయి చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతుల కోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వం విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓఅండ్ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవన్నీ పోయి చివరకు ఓఅండ్ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా విదిలింపులే ఉండటంతో పనులు జరిగిన పరిస్థితి లేదు. ఆ కొద్దిపాటి నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్నప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్లు చూపించి, చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌లోనూ రూ.22 కోట్లు ప్రభుత్వం ఓఅండ్ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం దోచేశారు.



బాపట్ల జమ్ములపాలెం తూర్పు డ్రైన్‌లో పెరిగిపోయిన గుర్రపు డెక్క

రూ.22.54 కోట్ల ప్రతిపాదనలతో సరి

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బ తిన్నాయి, చాలా మైనర్లకు నీటిని సరఫరా చేసే తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సరఫరాలో నియంత్రణ ఉండటంలేదు. సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. మరమ్మతులకు జలవనరుల శాఖ రూ.22.54 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. మరమ్మతులు తప్పనిసరి అయినా ప్రభుత్వం నిధులు విడుదల ఊసెత్తకపోతుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి డివిజన్లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 473 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ22.54 కోట్లు వ్యయం అంచనా వేశారు. ఈ పనులపై ఇటీవల మంత్రి నిమ్మల సమీక్షించినా నేటి వరకు నిధులు కేటాయింపులు లేవు.



పల్నాడులో కాల్వలు కనిపించనంతగా పెరిగిన కంప చెట్లు



బాపట్ల, తెనాలి, నరసరావుపేట జూలై 26 (ఆంధ్రజ్యోతి): దెబ్బతినిపోయి గండ్లు పడటానికి సిద్ధంగా ఉన్న కాల్వ కట్టలు. కాల్వల్లో సాగునీరు కిందికి పోకుండా కమ్మేసిన గుర్రపుడెక్క. షట్టర్లకు రంధ్రాలు పడి, చెక్కలు అడ్డుపెట్టినా వృథాగా పోతున్న సాగు నీరు. ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి కాల్వలు, డ్రెయిన్ల దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు చివరి భూములకు చేరడం కష్టమే. నీటి విడుదల ఆలస్యమైనా, నీరు చివరి వరకు చేరకున్నా పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అయినా నాటి పాలకులు సాగునీటి వ్యవస్థ గురించి కనీసంగా కూడా ఆలోచించలేదంటే ఆశ్చర్యం కాదు. డెల్టా పరిధిలో గత నాలుగు సీజన్లలో ఒక్క పనికూడా జరిగిన దాఖలాలే లేవు. దీంతో సాగునీటి కష్టాలు మరింత పెరిగిపోయాయి. చుక్కనీరు చివరి భూమి వరకు వెళ్లాలంటే ఒక ప్రహసనమే. కేవలం చిల్లర విదిలింపులతో అప్పటి వైసీపీ సర్కారు సరిపెట్టింది. దీంతో ఒక్క గండీ పూడ్చలేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. అప్పట్లో ఓఅండ్ఎం నిధులే దిక్కు. అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాకుండా వారికి తోచినంత ఇచ్చి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. సాగునీరు చివరి భూముల వరకు అందాలంటే కాల్వలే కీలకం. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ కాల్వలు గత నాలుగేళ్లుగా అధ్వానంగా మారిపోయాయి. పట్టించుకునే దిక్కులేక, దెబ్బతిన్న కట్టలను బాగుచేసేవారులేక, షట్టర్లు తుప్పు పట్టిపోయిన పరిస్థితి. ఇక కాల్వల్లో నీరు ప్రవహించడానికి దారిలేదన్నట్లు పిచ్చిచెట్లు, ముళ్ల కంపలు, తూటుకాడ, గుర్రపు డెక్క పెరిగిపోయి అడ్డుగా మారిపోయాయి. ప్రస్తుతం ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. జలాశయాలకు పుష్కలంగా నీరు వస్తోంది. ఈ పరిస్థితుల్లో సాగునీటి కాల్వల మరమ్మతుల విషయంలో దేనినీ ఆలస్యం చేయడానికి వీలులేదు. మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేసేందుకు ప్రభుత్వం సత్వరం చర్యలు తీసుకోవాలి. ఐదేళ్లుగా సాగర్ పరిధిలోని కాల్వల్లో పూడిక తీత నోచుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఇటీవల మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్షించగా.. పనులు నిర్వహణ ప్రతిపాదనలకే పరిమితమైంది. నిధుల విడుదలపై నేటి వరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాదికి కాలువలకు మరమ్మతులు లేనట్లేనన్న అభిప్రాయం అధికారుల నుంచి వ్యక్తమవు తోంది. కాలువలు బాగు చేయకపోతే సాగునీటి పారుదలకు ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కృష్ణా పశ్చిమ డెల్టా కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం ఇటీవల రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. అయితే అటు పట్టిసీమ నీరు, ఇటు వర్షాలతో ప్రస్తుతం కాల్వల్లో నీరు పుష్కలంగా పారుదల అవుతుంది. దీంతో కాల్వల మరమ్మతులకు ఇబ్బందులు తప్పడంలేదు. కాల్వలకు సకాలంలో నీరొచ్చిందన్న ఆనందం కాల్వల ఎగువ భూముల రైతులకుంటే, చివరి భూముల రైతులు మాత్రం నీరు అందని పరిస్థితుల్లో మరమ్మతులు జరిగితే బాగుంటుందని ఎదురు చూస్తున్న పరిస్థితి.

డెల్టాలో పనులపై సందిగ్ధత

కృష్ణా పశ్చిమ డెల్టాలో అత్యవసర మరమ్మతుల కోసం ఈ సీజన్‌కు ప్రభుత్వం రూ.13.62 కోట్లు మంజూరు చేసింది. వీటితో డెల్టా కాల్వలు, డ్రెయిన్లలో అత్యవసరమనుకున్న 188 పనులు పూర్తి చేసేందుకు నీటిపారుదల శాఖ సన్నద్ధమయింది. కృష్ణా పశ్చిమ విభాగం పరిధిలో 85 పనుల కోసం రూ.4.98 కోట్లు, రేపల్లె, చీరాల డ్రెయినేజీ డివిజన్‌ల పరిధిలో 98 పనులకు రూ.7.3 కోట్లు, గుంటూరు వాహిని కింద 5 పనుల కోసం రూ.1.31 కోట్లు కేటాయించారు. అయితే ఇప్పటికే కాల్వలకు నీరొచ్చేయటం, డెల్టాలో వరి సాగు వెద పద్ధతిలో మొదలవడంతో పనులు ఆచరణలో ఎంతవరకు సకాలంలో పూర్తవుతాయనేదే సందేహంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు పనులను చిన్నవిగా విభజించి, స్వల్పకాలిక టెండర్లను పిలిచింది. అయితే కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం పూర్తై, వారు పనులు మొదలుపెట్టడానికి ఇంకా పక్షం రోజులు పట్టే పరిస్థితి. ఈ తరుణంలో పనులు సాగేతీరుపై సందిగ్ధత నెలకొంది.

కౌలు కష్టాలు.. తీరినట్లేనా..?

- వార్షిక రుణ పద్దులో రుణాలకు పెద్దపీట
- ఐదేళ్లుగా సర్దుబాటుకే ప్రాధాన్యమిచ్చిన గత ప్రభుత్వం
- కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం రూ.200 కోట్ల రుణాలు

బాపట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు రుణ కష్టాలు తీరనున్నాయా.. అంటే అవునని కూటమి ప్రభుత్వం చెప్తోంది. ప్రధానంగా పంటల సాగు చేసే వారిలో కౌలు రైతులే అధికం. అయితే సాగు వ్యయం కోసం వడ్డీ వ్యాపారులను కౌలు రైతులు ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రభుత్వం నుంచి రాయితీలు, సబ్సిడీలు, లబ్ధి భూ యజమానులు పొందుతుండగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కష్టాలు, నష్టాలు, అప్పులు మిగులుతున్నాయి. చివరకు పంటల సాగుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను కూడా కౌలు రైతులు పొందలేకపోతున్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రాయితీ కార్డులు(సీసీఆర్) కూడా దక్కక పోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా సక్రమంగా పొందలేకపోతున్నారు. గత ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలపై దృష్టి సారించకపోవడంతో ఐదేళ్ల తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో అప్పుల పాలై పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వేల కోట్ల వ్యవసాయ రుణాల పద్దును బ్యాంకర్ల సమక్షంలో ప్రభుత్వం ఘనంగా ప్రకటించడం.. తర్వాత అన్నదాతలకు రుణాలను సర్దుబాటు చేసి వాటినే రుణాలుగా ఇచ్చినట్లు గొప్పగా ప్రకటించుకోవడం పరిపాటిగా జరిగింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో బ్యాంకు రుణాల విషయంలో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రకటించిన వార్షిక రుణ పద్దులో వ్యవసాయం వాటి అనుబంధ రుణాలకు పెద్దపీట వేసింది. అదేవిధంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులకే రూ.200 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. రుణాల విషయంలో బ్యాంకులు ఉదారంగా ఉండాలని ప్రభుత్వం బ్యాంకర్లకు సూచించింది. గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ దఫా ఎట్టిపరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇచ్చింది. ఈ క్రమంలో తాజా వార్షిక పద్దులో ప్రకటించిన వేల కోట్ల రుణాలు ఈ సారైనా రైతులకు అందివారి అధిక వడ్డీ కష్టాలు తీరి బలవన్మరణాలు తగ్గుతాయనే ఆకాంక్ష సర్వత్రా వ్యక్తమవుతోంది.



పొలం దున్నుతున్న రైతు

వ్యవసాయ రుణాలు రూ.10,053 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అన్నింటికి కలిపి రూ.10,053 కోట్లు అందించాలని వార్షికపద్దులో ప్రకటించారు. దీనిలో ఖరీఫ్, రబీ రెండు సీజన్లు కలిసే ఉన్నాయి ఖరీఫ్‌కు పంట రుణాలు రూ.3,750 కోట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిలో ఇప్పటి వరకు రూ.1850 కోట్లను అందించగా, వ్యవసాయ అనుబంధ సేవలకి కలిపి ఇప్పటికే రూ.3,250 కోట్లను రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. రబీ సీజన్‌కు వచ్చేసరికి రూ.2,592 కోట్లను రుణాలను అందించాలని వార్షికపద్దులో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వ్యవసాయ రుణాలలో 15 శాతం వృద్ధి నమోదవడం రైతులపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కనబడుతోంది.

కౌలు రైతులకే రూ.200 కోట్లు

ఈ సారి ఒక్క కౌలు రైతుల రుణ వాటానే రూ.200 కోట్లకు ప్రభుత్వం పెంచేసింది. దీనికి తగ్గట్టే సీసీఆర్‌సీ కార్డుల విషయంలో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ కౌలు రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను ప్రభుత్వం కనబరుస్తోంది. గడచిన ఐదేళ్ల కలిసి వైసీపీ ప్రభుత్వం కౌలు రైతులకు అందించిన రుణాలు రూ.150 కోట్లలోపే కావడం గమనార్హం. వాస్తవానికి పంట రుణాల మొత్తం పద్దులో 5 శాతం కౌలు రైతులకు రుణాలుగా అందించాలన్నది ప్రభుత్వాల ఉద్దేశం. దీనిని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. కౌలు రైతులకు తీవ్ర అన్యాయం చేయడమే కాకుండా వారి ఆత్మహత్యలకు కారణమైంది. ఐదేళ్లలో కౌలు రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే క్రమంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.200 కోట్ల రుణాలను వారికి అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు

సర్దుబాట్లకే ప్రాధాన్యం..

వైసీపీ ప్రభుత్వంలో వార్షికపద్దులో అందించే రుణాలను పెద్దమొత్తంలో చూపి ఆచరణలోకి వచ్చేసరికి సర్దుబాటుకే మొగ్గుచూపి రైతులను వంచించింది. రుణాల విషయంలో బ్యాంకుల ఎదుట రైతులు ధర్నాకు దిగిన ఉదంతాలను గతంలో చూశాము. ప్రకటించిన పద్దులో 70 శాతం రుణాలను సర్దుబాటు చేసి వాటిని కూడా రుణాలు ఇచ్చినట్లు చూపి లక్ష్యాలను వందశాతం చేరుకున్నామనే ఆర్భాటపు ప్రకటనలను వైసీపీ చేసేది. ప్రస్తుత వార్షిక పద్దులో నేరుగా రుణాలను రైతులకు అందించడంపై శ్రద్ధపెట్టాలని, అన్నదాతలు స్వచ్ఛందంగా సర్దుబాటుకు ఇష్టపడితే తప్ప రుణాలు ఇవ్వడానికే బ్యాంకర్లు ప్రయత్నించాలనే ఆదేశాలను ప్రభుత్వం ఇవ్వడం ఈ సారి పద్దులో అన్నదాతలకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగిస్తోంది. గత ప్రభుత్వం ప్రకటించిన రుణాల కన్నా ఈ సారి వార్షిక పద్దులో వ్యవసాయ అనుబంధ రంగాల వాటా పెరగడంతో పాటు వాటిని అందించే విషయంలో స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం ఇవ్వడంతో ఈ సారి తమకు అధిక వడ్డీల బెడద తప్పుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అయితే మరింత ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వడివడిగా.. కృష్ణమ్మ

- శ్రీశైలానికి పోటెత్తుతున్న వరద
- అంతకంతకు పెరుగుతున్న వరద
- సాగర్ జలాశయానికి నీటి విడుదల
- కుడి కాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ వడివడిగా వస్తోంది. శ్రీశైలం దిశగా పరుగులు పెడుతూ వస్తోంది. దీంతో అంతకంతకు జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. దాదాపు 2.46 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. ఇది క్రమంగా మూడు లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీశైలానికి 10 రోజుల వరకు వరద ప్రవాహం కొనసాగుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే 110 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నాగార్జునసాగర్ జలాశయానికి శుక్రవారం నీటిని విడుదల చేశారు. నాలుగు రోజుల్లో సాగర్ జలాశయానికి కూడా భారీగానే వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో కుడికాల్వ ఆయకట్టుకు సాగునీటి భరోసా వస్తోంది. గత ఏడాది వరి సాగు కోల్పోయిన రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణానది పరివాహక ప్రాంతంలో గత రెండు రోజుల్లో 600 మీమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో ఆల్‌మట్టి, తుంగభద్ర జలాశయాలకు వరద నీటి ప్రవాహం పెరగనున్నది. ఇప్పటికే శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరింది. దీంతో ఆయా జలాశయాలకు వస్తున్న వరదనీటిని దిగువకు వదిలేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద నీరు రెండు రోజుల్లో రానున్నది. నారాయణపూర్ జలాశయానికి వస్తున్న నీటిని అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. మొత్తం 3.12 లక్షల కూసెక్కుల నీరు శ్రీశైలానికి రానున్నది. శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తూ సాగర్‌కు 30,784 క్యూసెక్కుల నీరు వస్తున్నది. తాగునీటి అవసరాలకు కుడి కాల్వకు సాగర్ నుంచి 6,990 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



శ్రీశైలం జలాశయానికి జలకళ

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ టీఎంసీలలో	ప్రస్తుత నిల్వ టీఎంసీలలో	వస్తున్న వరద నీరు క్యూసెక్కుల్లో	విడుదల చేస్తున్న నీరు క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	123.08	83.48	2,04,098	2,66,586
నారాయణపూర్	33.31	26.85	2,61,397	2,65,494
జూరాల	9.66	5.99	2,24,083	2,26,375
తుంగభద్ర	105.78	96.25	87,766	84,149
శ్రీశైలం	215.81	110.47	2,46,965	31,784
నాగార్జున సాగర్	312.05	123.34	29,589	6,990
పులిచింతల	45.77	1.03	276	50

విచ్చల విడిగా.. వసూళ్ల దందా



- ఒక్కో స్టేషన్‌కు రూ.5 లక్షల టార్గెట్
- కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసుకుని వసూలు

అద్దంకి, జూలై 26: అద్దంకి నియోజకవర్గంలోని ఓ సర్కిల్‌కు జిల్లాలోని అన్ని ప్రాంతాలకంటే ఆదాయం ఎక్కువ. వద్దన్నా నెలవారీ మామూళ్లు పెద్దమొత్తంలోనే వస్తుంటాయన్నది జగమెరిగిన సత్యం. అయితే అంతటితో ఆ సర్కిల్ అధికారి తృప్తి చెందడంలేదు. ఒక్కో స్టేషన్ పరిధిలో రూ.5 లక్షలను టార్గెట్ పెట్టి వసూళ్లకు దిగినట్లు తెలుస్తుంది. ఆ సర్కిల్ అధికారి వసూళ్ల దందాకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. తన పరిధిలో ఉన్న స్టేషన్లకు స్టేషన్‌కు ఒక్కో కానిస్టేబుల్‌ను ప్రత్యేకంగా నియమించుకుని వసూళ్ల దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సదరు మొత్తాన్ని ఆయా కానిస్టేబుళ్ల వసూలు చేసిన తర్వాత కాకుండా ముందే చెల్లించి ఆ తర్వాత వసూళ్ల చేసుకోవాల్సిందే. దీంతో సదరు కానిస్టేబుళ్లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. అధికారి అండతో సదరు కానిస్టేబుళ్ల మరింత రెచ్చి పోయి వసూళ్ల చేస్తున్నారు. ఎన్నికలకు ముందు వచ్చిన సదరు అధికారి ఎన్నికల సమయంలో కూడా పెద్దఎత్తున వసూళ్ల చేసినట్లు విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పాత పద్ధతిలోనే ఆ అధికారి వసూళ్ల దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా గ్రానైట్ ఫ్యాక్టరీలు, క్వారీలు, రేషన్ బియ్యం తరలింపు తదితర అక్రమ రవాణాదారుల నుంచి వసూళ్ల చేస్తున్నట్లు తెలుస్తుంది. సదరు సర్కిల్ పరిధిలో గ్రానైట్ అక్రమ రవాణా బృందాలు పది ఉన్నాయి. తాను సదరు సర్కిల్‌లో ఉన్నంత వరకు ఇబ్బంది లేదన్న హామీతో వారి నుంచి ముందుగానే రూ.5 లక్షలు చొప్పున తీసుకున్నట్లు తెలుస్తుంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలే స్వయంగా అనధికార చెక్‌పోస్టులు పెట్టి వసూలు చేశారు. అయితే ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నేతలెవరు అటువైపు వెళ్లే వారు కాకపోవటంతో సదరు అధికారికి కాలం కలిసి వచ్చిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు సదరు అధికారి దందాలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తీరప్రాంతాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ వెంకట మురళి



బాపట్ల, జూలై 26: సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యూలేషన్ జోన్) తీరప్రాంతాలు, ప్రాదేశిక నీటి పరిమితి ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సీఆర్‌జెడ్ 2019 నోటిఫికేషన్ అమలు కొరకు ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూనే తీరప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మడ అడువులు, వాగులు, ఇసుక దిన్నెలను దెబ్బతీయకుండానే అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 492 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో కోస్టల్ రెగ్యూలేషన్ జోన్ ఏర్పాటు కానుందన్నారు. పర్యాటకులు, సందర్శకులు విరివిగా రావడానికి సీఆర్‌జెడ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సీఆర్‌జెడ్‌లో అభివృద్ధిలేని ప్రాంతాల విస్తీర్ణం కుదించాలని రిసార్ట్స్ యాజమానులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రజలు కోరారు. సమావేశంలో జేసీ బి.సుబ్బారావు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాఘవరెడ్డి, శాస్త్రవేత్తలు కె.సౌందర్‌రాజన్, ఆర్.సమనిధి, ఏపీసీజెడ్ ఎంఎ మీరా, షేక్.సుభానీ తదితరులు పాల్గొన్నారు.

నిధులు దోచేశారు..!

- గ్రామ పంచాయతీల్లో అంతా గోల్‌మాల్
- కరెంటు సామగ్రి, బ్లీచింగ్ పేరుతో వినియోగం
- లెక్కాపక్కా లేని రికార్డులు
- పంచాయతీల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..
- పంచాయతీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు షోకాజ్ నోటీసులు

కొందరు అక్రమార్కులు అధికారం ముసుగులో నిధులను అడ్డంగా దోచేశారు. గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని పంచాయతీల్లోని కొంతమంది సర్పంచ్‌లు, అధికారులు తాము చెప్పిందే రాజ్యాంగమన్న విధంగా వ్యవహరించారు. నిధులను ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారు. అందుకు సంబంధించిన రికార్డులు, రసీదులు సక్రమంగా లేనేలేవు. ముఖ్యంగా ఒంగోలు డివిజన్ పరిధిలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంది. మేజర్ పంచాయతీలైన సింగరాయకొండ, ఉప్పుగుండూరు, దొడ్డవరంల గ్రామాల్లో లక్షల రూపాయల నిధులను అక్రమంగా వినియోగించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్థుల ఫిర్యాదుల మేరకు విచారణ జరిపిన అధికారులు అవినీతికి పాల్పడిన ఒక్కొక్కరిపై వేటు వేస్తున్నారు. అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తుండగా, సర్పంచ్‌లకు చెక్‌పవర్ రద్దుచేస్తున్నారు.

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26 : జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో నిధుల వినియోగంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మేజర్ పంచాయతీల్లో ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికారులు వేగం పెంచారు. అక్రమార్కులపై దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు వినియోగించిన ఘటనలు బయటకు వస్తుండటంతో పాలకవర్గాల్లో ఆందోళన నెలకొంది. ఉప్పుగుండూరు గ్రామపంచాయతీలో అయితే ఏకంగా సర్పంచ్‌కు తెలియకుండానే అప్పటి వైసీపీ నాయకుల అండదండలు చూసుకొని పంచాయతీ కార్యదర్శి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. పంచాయతీ నిధులు అక్రమం గా ఖర్చుచేశారని, వాటి వినియోగంపై విచారణ చేయాలని ఇటీవల ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అయితే ఆ నిధుల వినియోగంపై విచారణకు ఆదేశించగా పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు వెలుగులోకి రావడంతో పంచాయ తీ కార్యదర్శి, జూనియర్ సహాయకులకు జిల్లా పంచాయతీ అధికారి ఉషారాణి షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఆ పంచాయతీలో సుమారు రూ.42లక్షల నిధులు నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేసినట్లు తెలిసింది.

సింగరాయకొండ గ్రామ పంచాయతీ జూనియర్ సహాయకులు సీహెచ్ విజయకృష్ణ పంచాయతీ రికార్డులు అప్పగించకుండా విధులకు గైర్హాజరు కావడంతో సస్పెండ్ చేస్తూ డీపీవో ఉషారాణి ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ సర్పంచ్ తాటిపర్తి వనజకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

సింగరాయకొండగ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగంపై చేసిన విచారణ నివేదికను సకాలంలో ఇవ్వకపోవడంతో ఒంగోలు, కనిగిరి డివిజనల్ పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు ఇస్తూ ఈనెల 16న డీపీవో ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు.

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ వాటర్ స్కీం నిధులను దుర్వినియోగం చేశారని ఈనెల 16న సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే పంచాయతీ కార్యదర్శిని తాజాగా శుక్రవారం సస్పెండ్ చేశారు.

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ జూనియర్ సహాయకులుగా ఉంటూ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన ఎం.శ్రీరామమూర్తి సర్పంచ్‌తో కలిసి రూ.42.70 లక్షల నిధులను అసాధారణంగా ఖర్చుచేసినట్లు డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక ఇచ్చారు. ఆ మేరకు కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సింగరాయకొండలో భారీగా దుర్వినియోగం

సింగరాయకొండ మేజర్ పంచాయతీలో సుమారు రూ.40లక్షల మేరకు నిధులను డ్రా చేసినట్లు తెలిసింది. పంచాయతీ నిధుల వినియోగంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని జనసేన పార్టీ ఆ మండల నాయకుడితో పాటు మరికొంతమంది ఫిర్యాదులు చేశారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేయడంతో జనరల్ ఫండ్ నుంచి రూ.13 లక్షలు, 15 ఆర్థికసంఘం నిధులు సుమారు రూ.38.73 లక్షలు డ్రా చేయగా అందులో రూ.24.87 లక్షలు సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతభత్యాలకు చెల్లించారు. మిగిలిన రూ.12లక్షల నిధులకు రికార్డులు లేని పరిస్థితి ఏర్పడింది. అక్కడ పనిచేసే జూనియర్ అసిస్టెంట్ గత జనవరి నుంచి తన కార్యాలయానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో ఇటీవల ఆ ఆఫీసు తాళాలు పగలగొట్టి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు దొడ్డవరం గ్రామపంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని భారీగా నిధులను దుర్వినియోగం చేసినట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శుల ద్వారా..

అనేక పంచాయతీల్లో ఉన్న అరకొర నిధులను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా గ్రామాల్లో ఏదైనా అత్యవసర పనులు ఉంటే వాటిని పూర్తిచేసి నిధులు డ్రా చేస్తారు. కానీ అందుకు భిన్నంగా పారిశుధ్య నిర్వహణ కోసం అవసరమయ్యే బ్లీచింగ్, కరెంటు సామగ్రిలను కొనుగోలు చేసినట్లు తెలిసింది.

అందుకు సంబంధించిన రసీదులను కూడా ఇష్టారీతిన పెట్టినట్లు సమాచారం. సింగరాయకొండ గ్రామపంచాయతీలో అయితే పూర్వ పంచాయతీ కార్యదర్శుల సమయంలో విద్యుత్ సామగ్రి కొనుగోలు చేసినట్లు ఇప్పుడు బిల్లులు పెట్టారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా గ్రామ పంచాయతీల్లో జరిగిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అక్రమార్కుల్లో అలజడి మొదలైంది.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామపంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే జాన్ బాషాను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. జాన్‌బాషా ప్రస్తుతం బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావురు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. దొడ్డవరం గ్రామపంచాయతీలో వాటర్‌స్కీంకు సంబంధించి రూ.25.02 లక్షల నిధులు దుర్వినియోగమయ్యాయి. ఇటీవల ఆ విషయంపై అధికారులు విచారణ చేపట్టారు. అయితే ఆ నిధులకు సంబంధించి జాన్‌బాషా అధికారులకు వివరాలు ఇవ్వలేదు. దీంతో వాటిని దుర్వినియోగం చేశారన్న అభియోగంతో ఆయనను సస్పెండ్ చేశారు. ఇప్పటికే ఆ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై పంచాయతీ సర్పంచ్ చెక్‌పవర్‌ను కూడా రద్దుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు అరకొరగా ఉన్న నిధులను కూడా అధికారపార్టీ సర్పంచ్‌లు ఇష్టారీతిన ఎలాంటి బిల్లులు లేకుండా ఖర్చుచేశారు. ఆయా నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు రావడంతో వాటిపై విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలకు ఉపక్రమించారు.


సింగరాయకొండ పంచాయతీ కార్యాలయం

పూడికతీత పనులు చేపట్టండి


మాట్లాడుతున్న కార్యదర్శి కోటినాగయ్య

ఇంకొల్లు, జూలై 26: పలు ప్రాంతాలలో మురుగుపారుదల లేక నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయని, వెంటనే పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్థులు విన్నవించారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను సభలో కార్యదర్శి కోటినాగయ్య దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన మురుగు కాల్వ పూడిపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుందన్నారు. పర్చూరు రోడ్డుకు ఇరువైపుల మురుగుకాల్వపై ఆక్రమణలను తొలగించి ఎప్పటికప్పుడు పూడికతీయాలన్నారు. అలాగే గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్థులు సభలో కోరారు. చెరువులను శుభ్రం చేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు. ఆయా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని కార్యదర్శి కోటినాగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు బెల్లం సాంబయ్య మాలిక్ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు రోటరీ సత్కారం

మార్టూరు,జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం రాత్రి స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఏడుగురు విశ్రాంత సైనికులను రోటరీ క్లబ్ వారు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు అధ్యక్షత వహించారు. అనంతరం సభావేదిక పై విశ్రాంత సైనికులు పెనుబోతు హనుమయ్య(జొన్నతాళి), కొర్రపాటి కిషోర్ కుమార్ (కోనంకి),బీవీ రామారావు (జె పంగులూరు), అమరనేని శ్రీనివాసరావు (ముప్పవరం),పావులూరి చౌదరి(మార్టూరు), సందిపోగు డేవిడ్(మార్టూరు) బిల్లా భాస్కరరావు (మార్టూరు) లను క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబ శివరావు, గరిమిడి శ్రీనివాసరావు, కొర్రపాటి కాజారావు, రావి అంకమ్మచౌదరి, చెన్నుపాటి బసవ రాములు,ఇంటూరి ఆంజనేయులు, ఎం ఈశ్వరప్రసాద్,తాళ్లూరి సాంబశివరావు,షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరునికి సమాచారాన్ని పొందే హక్కు



సమాచార హక్కు చట్టం గురించి అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్డీ సుబ్బారావు

పర్చూరు, జూలై 26: సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరునికి ఉంటుందని మార్టూరు మండల ఈవోఆర్డీ బి.సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమాచార హక్కు చట్టం 2005పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈవోఆర్డీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ కూడా పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల లోపు అందించాలన్నారు. సెక్షన్ 4(1) ప్రకారం అధికారులు సమాచారానికి సంబంధించిన అన్నీ రికార్డులు, రిజిస్టర్‌లను తప్పక నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడీఏ మోహనరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రామకృష్ణ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీపడొద్దు

చీరాల, జూలై 26: అన్న క్యాంటీన్ పునఃప్రారంభానికి సంబంధించిన పనుల నాణ్యతలో రాజీ పడొద్దని, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్ సూచించారు. శుక్రవారం ఆయన అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు సక్రమంగా అందేవిధంగా తగిన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్ చెప్పారు. శుక్రవారం అక్కాయిపాలెం ఎత్తిపోతల పథకంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు, రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయకట్టులోని పలు గ్రామాల రైతు ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఉద్యోగుల్లో అలజడి

- ఎప్పుడో భర్తీచేసిన ఉద్యోగాలకు ఇప్పుడు విచారణలు
- శాఖలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సిబ్బంది వణుకు

ఒంగోలు(కలెక్టరేట్), జూలై 26: జిల్లా వైద్యారోగ్యశాఖలో ఎప్పుడో భర్తీచేసిన పోస్టులపై ఇప్పుడు విచారణలు జరుగుతుండటంతో ఆ శాఖ ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. 2004 నుంచి ఇప్పటివరకు జరిగిన నియామకాలపై రాష్ట్రస్థాయి అధికారులు విచారణలు చేస్తుండటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వైద్యశాఖలో 2002లో గుంటూరు రీజియన్ పరిధిలో భర్తీచేసిన హెల్త్ అసిస్టెంట్ల నియామకాల్లో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఆ నేపథ్యంలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ శోభారాణి విచారణ చేపట్టారు.

ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో విచారణ పూర్తికాగా గురువారం ఒంగోలులో విచారణ జరిగింది. 2002 నుంచి ఇప్పటివరకు 160 హెల్త్ అసిసెంట్లు పోస్టులు భర్తీచేయగా, వారిలో వందమంది ఉద్యోగులు రెగ్యులర్ అయ్యారు. మరో 60 మంది కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇప్పుడు వారందరూ అందుకు సంబంధించిన నియామక ఉత్తర్వులతోపాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు చూపాల్సిన అవసరం వచ్చింది.

అంతా అయోమయం

సాధారణంగా ఉద్యోగ నియామకాల భర్తీలో అక్రమాలు జరిగాయంటే అప్పటి నోటిఫికేషన్‌తో పాటు రోస్టర్ విధానం, ఏ కేటగిరికి ఎన్ని ఇచ్చారు తదితర అంశాలతో విచారణ చేపడుతారు. అలా కాకుండా నేరుగా 2002 నుంచి ఇప్పటివరకు భర్తీచేసిన పోస్టులపై విచారణ పేరుతో ఉద్యోగులందరినీ వైద్యశాఖ కార్యాలయానికి పిలిపించడంతో వారిలో ఆందోళన నెలకొంది. వైద్యశాఖపై ఎప్పుడు ఎవరు ఫిర్యాదులు చేస్తారో, ఎప్పుడు ఎవరు విచారణ చేస్తారో తెలియదు, ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారీ విచారణకు రావాలని ఆదేశాలిస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు ఉన్నారు. గత నియామకాలపై అనేకమార్లు విచారణలు చేసి అక్రమాలు జరిగాయని నిర్ధారించినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజా విచారణ కూడా అలానే ఉంటుందా అన్న అనుమానాలున్నాయి. కేవలం ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసేందుకే విచారణ చేస్తున్నారా? అన్న ఆరోపణలున్నాయి.

అసెంబ్లీలో ఆకట్టుకున్నారు

- వివరణాత్మక సమాధానాలిచ్చిన మంత్రులు
- నాలుగు సబ్జెక్ట్‌లపై అనర్గళంగా మాట్లాడిన ఏలూరి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం ఐదు రోజులే జరిగినప్పటికీ అసెంబ్లీ సమావేశాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవటంలో జిల్లాలోని అధికారపార్టీ ఎమ్మెల్యేలు సఫలీకృతులయ్యారనే చెప్పుకోవచ్చు. తొలిసారిగా మంత్రులైనప్పటికీ ఇటు స్వామి అటు రవికుమార్ సభ్యుల ప్రశ్నలకు వివరణాత్మక సమాధానాలు ఇచ్చి మన్ననలు పొందారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు నాలుగు అంశాలపై అనర్గళంగా మాట్లాడారు. మిగిలిన ఎమ్మెల్యేలు సీఎం నుంచి ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల వరకు తిరిగి ఆయా నియోజకవర్గాల సమస్యల పరిష్కారం కోసం తొలి అడుగు వేశారు. వైసీపీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిరోజు సమావేశాలకు అలా వచ్చి ఇలా వెళ్లిపోగా ఆ నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు మాత్రం దరఖాస్తులు పట్టుకొని అసెంబ్లీ లోను బయట మంత్రుల చుట్టూ తిరగటం కనిపించింది.

ప్రస్తుతం ఐదురోజులు పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు అభివృద్ధి పనుల సాధన, సమస్యల పరిష్కారంలో కలిసికట్టుగా ముందడుగు వేశారు. అసెంబ్లీ బయట లోపల కూడా ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు కలిసి తిరగటం ముఖ్యమంత్రి నుంచి ఆయా మంత్రుల వరకు కలిసి వెళ్లి మాట్లాడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్రప్రభుత్వం జిల్లాను వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేర్చిన వెంటనే అందరూ సీఎంని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించి ఐక్యంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి రావటం పట్ల చంద్రబాబు కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఆ సందర్భంలోనే ఎమ్మెల్యేలు జిల్లాకు సంబంధించి ఆయన ఇచ్చిన హామీలను గుర్తుచేయటం విశేషం. పర్చూరు, కందుకూరు ఎమ్మెల్యేలు ఏలూరి, ఇంటూరి సీఎంని కలిసి నియోజకవర్గాల సమస్యల చిట్టాను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర మంత్రులు నారాయణ, జనార్దన్‌రెడ్డి, రామానాయుడు, సత్యప్రసాద్‌తోపాటు జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులను ప్రత్యేకంగా కలిసి ఆయారంగాల వారి సమస్యలు వివరించి కొన్ని హామీలు పొందారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తాగునీరు, గ్రామీణాభివృద్ధి సమస్యలపై అటు పవన్‌కళ్యాణ్ ఇటు లోకేష్‌తోపాటు కొందరు అధికారులను కలిశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల సీఎంతోపాటు లోకేష్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ మంత్రులతోపాటు తనకున్న పరిచయాలతో కొన్ని శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయి పలురంగాల అంశాలపై కదలిక తెచ్చుకోగలిగారు. మధ్యలో అటు వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఇటు దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు అధికారులను కలిసి కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.

ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు స్వామి, రవికుమార్‌లు వారి శాఖలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు దీటైన సమాధానాలు ఇచ్చి ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌ల దృష్టిని ఆకర్షించారు. మంత్రి స్వామి వద్ద ఎక్కువ శాఖలు ఉండటంతో నాలుగు రోజులుపాటు సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. శాసనమండలిలో విద్యుత్ రంగంపై వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి రవికుమార్ సమాధానమిస్తూ చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి కోసం నాడు చంద్రబాబు ప్రయత్నిస్తే, చెత్తపై పన్ను వేసి తలాతోక లేని నిర్ణయాలతో విద్యుత్ శాఖను జగన్ అప్పులపాలు చేశాడంటూ చక్కటి ఉదాహరణలతో ప్రసంగించారు. ఆ సమయంలో శాసనమండలిలో ఉన్న లోకేష్ కూడా రవి ప్రసంగాన్ని ఆసక్తిగా వినటం, చప్పట్లు కొట్టడం విశేషం. అన్ని అంశాలపై అవగాహన ఉన్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరికి ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం కల్పించారు. నాడు-నేడు పనులు, గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసకర చర్యలపై ఆయన ప్రసంగించారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తిచూపుతా ఆయన అనర్గళంగా చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

సింథైట్ ఫ్యాక్టరీలో నిషేధిత వ్యర్థాల వాడకం

- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన
- అధికారుల తనిఖీల్లో వెల్లడి
- గ్రామస్థుల నుంచి వివరాలు సేకరణ


సింథైట్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అధికారులు

మేదరమెట్ల , జూలై 26: మేదరమెట్లలోని సింథైట్ ఫ్యాక్టరీలో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. శుక్రవారం అధికారుల బృందం పరిశీలనలో ఇవి వెలుగుచూశాయి. నిషేధిత మిరప వ్యర్థాలను వినియోగిస్తుండటాన్ని అధికారులు గుర్తించారు. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న మిర్చి కోరును భరించలేక పోతున్నామని గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్‌చార్జి కలెక్టర్ చామకుర్తి శ్రీధర్ ఫ్యాక్టరీ యాజమాన్యం, గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో నిర్ణయం మేరకు మిరప వ్యర్థాలను ఫ్యాక్టరీలో వినియోగించరాదని ఆదేశించారు. అయితే అధికారుల ఆదేశాలను ఫ్యాక్టరీ యాజమాన్యం బేఖాతరు చేసింది. శుక్రవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాఘవరెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనజర్ శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి వై. రామకృష్ణ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాసులు, స్థానిక ఆర్ఐ పోతురాజుతో కలిసి సింథైట్ ఫ్యాక్టరీని పరిశీలించారు. ఫ్యాక్టరీలో నిషేధిత మిరప వ్యర్థాలను వాడడం కనిపించింది. గతంలో ఇన్‌చార్జి కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా యాజమాన్యం వ్యర్థాలను వాడటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మొత్తం పరిశీలించిన అధికారుల బృందం యాజ మాన్యం పలు ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు గుర్తించింది. అనంతరం వీరంతా గ్రామంలో పర్యటించి గ్రామస్థులను ఫ్యాక్టరీ గురించి ప్రశ్నించారు. రోజంతా మిర్చి కోరు వస్తోందని, ఫ్యాక్టరీ అధికారులకు ఫోన్‌చేసినా స్పందించడం లేదని వారు తెలిపారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి


ఉప్పుమాగులూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో హనుమారెడ్డి

బల్లికురవ, జూలై 26: వర్షాకాలం కావటం వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాలలో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో హనుమారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో ఉన్న నిధులతో గ్రామాలలో మురుగు కాలువల్లో వ్యర్థాలను తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని అయన సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు,(బుజ్జి) పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు

చినగంజాం, జూలై 26: ప్రకృతి వ్యవసాయం చేయడం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ఎంటీ పీ.భారతి అన్నారు. మండలంలోని చింతగుంపల్లి గ్రామంలో వీవోఏలు, పరిమళ, లలిత డ్వాక్రా గ్రూపు సభ్యులకు, రైతులకు బీజామృతం తయారీ విధానం, దాని వలన కలిగే ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజామృతంతో విత్తన, నారు శుద్ధి చేయవచ్చునని తెలిపారు. నీరు, ఆవుపేడ, ఆవు మూత్రం, పుట్టమట్టి, సున్నంతో బీజామృతం తయారు చేస్తారని తెలిపారు. దీనితో విత్తన శుద్ధి చేయడం వలన విత్తనానికి సంక్రమించే వ్యాధులు దరి చేరవని, విత్తనం పూర్తి స్థాయిలో మెలకెత్తడానికి ఉపయోగపడుతుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయమ్మ, జి.విజయశాంతి, ఉదయభాస్కర్, జ్ఞానానందం, రైతులు, వీవోఏలు పాల్గొన్నారు.


బీజామృతం తమారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగించాలి

మార్టూరు: గ్రామాలలోని మహిళాసంఘాలు ప్రకృతి వ్యవసాయం రైతులకు అవగాహన కలిగించాలని డీపీఎం మోహన్ అన్నారు.శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండలసమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంటీఎస్ నీలం ప్రకాష్ కుమార్ అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీపీఎం మోహన్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారత్నం, కోటమ్మ, శంకర్, రహమాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో నిర్మల

డిజిటల్ కంటెంట్‌పై అవగాహన కల్పించాలి

● డిప్యూటీ డీఈవో నిర్మల

పంగులూరు, జూలై 26 :పాఠశాల స్థాయిలో చేపట్టే శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ కంటెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని చీరాల డిప్యూటీ డీఈవో నిర్మల కోరారు. మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి, పాఠ్య బోధనకు ఉపాధ్యాయులు రూపకల్పన చేసిన పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థుల విద్యాస్థాయి, సామర్థ్యాలను గుర్తించారు. గడిచిన విద్యా సంవత్సరంలో ఎన్.ఎం.ఎం.ఎస్‌లో సాధించిన ఫలితాలను, ట్రిపుల్ ఐటీలో విద్యార్థులకు లభించిన సీట్ల వివరాలను హెచ్‌ఎం గిరిజ వివరించారు. పాఠశాల నిర్వహణ తీరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేసిన డిప్యూటీ డీఈవో నిర్మల పాఠశాల పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు. గత విద్యా సంవత్సరంలో ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.



ముక్తేశ్వరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న ఈఈ మస్తాన్‌రావు

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

● అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

బల్లికురవ. జూలై 26 : మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు చేపడుతున్నామని అశాఖ అద్దంకి ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో నూతనంగా బల్లికురవ మండల కేంద్రం నుంచి ఏర్పాటు చేస్తున్న త్రీఫేస్ విద్యుత్ లైన్ పనులను ఈఈ పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైన లోవోల్టేజీ సమస్యలు లేకుండా విద్యుత్ సిబ్బంది పని చేయాలన్నారు. రైతులకు 9 గంటల వ్యవసాయ విద్యుత్ అందిస్తున్నామని, లైన్‌లలో లోపాలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. నేల జారిన విద్యుత్ వైర్లను వరుస క్రమంలో అన్ని గ్రామాలలో సరి చేయాలని సూచించారు. ఈపరిశీలనలో ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేగవంతంగా కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు

అద్దంకి: మెరుగైన విద్యుత్ సరఫరాకు కొత్త విద్యుత్ లైన్ల పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. అద్దంకి పట్టణంలోని 5 వ వార్డులో జరుగుతున్న కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులను ఈఈ శుక్రవారం పరిశీలించారు. డీఈఈ సత్యనారాయణ, ఏఈ శివప్రసాద్, టీడీపీ నేతలు వడ్డవల్లి పూర్ణచం ద్రరావు, చిలుకూరి అనిల్, బాచిన వెంకటసుబ్బారావు తదితరులు ఉన్నారు.



పనులకు సంబంధించి కొలతలు తీస్తున్న టీటీడీ అధికారుల బృందం

రాతి ముఖమండప నిర్మాణ పనుల పరిశీలన

అద్దంకి, జూలై26: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణ పనులను టీటీడీ అధికారుల బృందం శు క్రవారం పరిశీలించింది. రాతి ముఖ మండపం నిర్మాణానికి సుమారు 7 కోట్ల రూపాయలు అంచనా వ్యయం కాగా టీటీడీ నుంచి 2 కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి 2 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ నేపథ్యంలో టీటీడీ నిధులు విడుదలకు గాను ఇప్పటి వరకు జరిగిన పనులను టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించి కొలతలు తీసింది. విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ వీఎస్ పాల్, ఎంఆర్‌వో శేషయ్య, ఏఈ చిరంజీవి, టెంపుల్ ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని లలితమ్మ హత్య కేసు

● ఓ వ్యక్తి, మాజీ వలంటీర్‌పై అనుమానం

● అతడి ఆచూకీ కోసం గాలింపు

● రౌడీ షీటర్‌ల స్టేట్‌మెంట్‌లు సేకరణ

● హంతకుడి వేటలో పోలీసులు



లలితమ్మ (ఫైల్)

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జూలై 26 : చీరాల మండలం ఈపూరుపాలెం విశ్రాంత ఉపాధ్యాయిని పిల్లి లలితమ్మ(78) హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. అయితే ఇప్పటి వరకు జరిగిన విచారణలో ఒక కేబుల్ బాయ్, బోయిన వారిపాలెంకు సంబంధించి మరొక వ్యక్తితో పొలంకు సంబంధించి స్వల్ప వివాదాలు ఉన్నట్లు తెలుస్తున్నాయి. అంతేకాకుండా ఆరోజు నుంచి సేకరించిన టవర్ డంప్‌ను నిశితంగా పరిశీలిస్తున్నారు. అలాగే అనుమానితునికి దగ్గరగా ఉన్న ఓ మాజీ వలంటీర్ సంఘటన జరిగిన మరుసటి రోజు నుంచి కనిపించకపోవడంపై అనుమానాలు పెద్ద ఎత్తున రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే చాలామంది ఫోన్ డేటాను కూడా పోలీసులు తీసినట్లు సమాచారం. రౌడీ షీటర్‌ల స్టేట్‌మెంట్‌లు రికార్డు చేస్తున్నారు. దాదాపుగా నేడో రేపో ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు వెల్లడించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనం నుంచి జారిపడిన మహిళ

● చీరాల ఏరియా వైద్యశాలకు తరలింపు

చీరాలటౌన్ జూలై 26 : ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడిన మహిళను కుటుంబ సభ్యులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం చినగంజాం సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం చీరాల ఉడ్‌నగర్‌కు చెందిన జినేఖా గతకొద్ది కాలంగా ఎడమ కంటికి సంబంధించి ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో కుమారుడు హజ్రాన్‌తో కలిసి ఒంగోలు వెళ్లి చికిత్స తీసుకున్నారు. ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా చినగంజాం సమీపంలోని జాతీయ రహదారిలో బుర్కా వెనుక చక్రంలో ఇరుక్కుంది. దీంతో ఆమె ఒక్కసారిగా వాహనం నుంచి జారి కిందపడింది. దీంతో చికిత్స చేయించుకున్న కంటి వైపు తల రోడ్డుకు తగిలి బలమైన రక్త గాయమైంది. అంతేకాకుండా శరీరంపై పలు రక్త గాయాలు అయ్యాయి. దీంతో కుమారుడు 108 సహాయంతో తల్లిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

వజ్రాల వేటకు వేలం వెర్రిగా..

బల్లికురవ ప్రాంతం నుంచి పరుగులు

రోజూ వందల మంది

పల్నాడు జిల్లాకు వెళుతున్న వైనం



వజ్రాల కోసం భూమిలో వెతుకుతున్న ఓ కుటుంబం

బల్లికురవ. జూలై 26 : అదిగో అక్కడ విలువ కలిగిన వజ్రాలు భూమిలో దొరుకుతున్నాయి అని పుకార్లు షికార్లు చేస్తుండటంతో బల్లికురవ ప్రాంతం నుంచి ప్రజలు వేలం వెర్రిగా పల్నాడు జిల్లాకు వజ్రాల వేటకు పరుగులు పెడుతున్నారు. కొందరు మాత్రం తమకు కొన్ని తక్కువ పాయింట్లు కలిగిన వజ్రం దొరికిందని మరింత ఆశతో వెతుకులాటకు వెళుతున్నారు.

అదిగో పులి ఇదిగో మేక అన్న చందంగా ప్రజల పరిస్థితి నెలకొంది. ఏటా వ్యవసాయ సీజన్ లో భూమిలో నుంచి వజ్రాలు బయట పడుతున్నాయి అని కొంత కాలం నుంచి ప్రజలలో ప్రచారం ఉంది. కొందరు వజ్రాలపై ఆశలతో పదిహేను రోజుల నుంచి బల్లికురవ ప్రాంతం నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు మండలం శ్రీరామపురంకు పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. అక్కడ ఎర్ర నేలలో వజ్రాలు బయట పడుతున్నాయి అని కొందరు ఆటోలు పెట్టుకొని మరి వలస వెళుతున్నారు. కొందరు వ్యవసాయ కూలీలు పనులు మానుకొని వజ్రాల వేటకు వెళుతున్నారు. కొందరు వజ్రాల పాయింట్లు తనిఖీ చేసే మిషన్ కూడా తీసుకుపోయి అక్కడే పనికి వచ్చే రాళ్లను ఏరుకొని తెచ్చుకొంటున్నారు. ఎక్కడ విన్నా గ్రామాలలో వజ్రాల వేట గురించే ప్రజలు చర్చించుకుంటున్నారు. కొందరు ప్రజలు మాత్రం ఇవి పుకార్లు అని కొట్టి పారేస్తుండగా కొందరు మాత్రం నిజంగా వజ్రాలు దొరుకుతున్నాయని నమ్ముతూ పల్నాడు జిల్లాకు వెళుతున్నారు. రెండు రోజుల క్రితం వజ్రాల కోసం వెళ్లిన వారిని పల్నాడు జిల్లాలోని పోలీసులు అడ్డుకొని వెనక్కి పంపించారు. అయినా కొందరు మాత్రం మళ్లీ వజ్రాల వెతుకులాటకు వెళుతూనే ఉన్నారు. అధికారులు వెంటనే వజ్రాల బయట పడుతున్న విషయాలను గమనించి ప్రజలకు తగు సూచనలు చేయాలని పలువురు కోరుతున్నారు.



తక్కువ కేటగిరిలో ప్రజలకు దొరికిన వజ్రం

అభివృద్ధి, ఐకమత్యమే కోటయ్య ఆయుధాలు

- మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల, జూలై 26 : అభివృద్ధి, ఐకమత్యం అనే నినాదాలే ప్రజాబంధు ప్రగడ కోటయ్య నినాదాలని, ఆ స్ఫూర్తిని నేటితరం విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం వద్ద శుక్రవారం కోటయ్య జయంతిని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో బలరాం మాట్లాడుతూ స్వలాభాపేక్షతో వేస్తున్న అడుగులతో సత్ఫలితాలు దూరమవుతున్నాయన్నారు. మాచర్ల మోహనరావు, డాక్టర్ వరికూటి అమృతపాణి, అడుసుమల్లి వెంకట సుబ్బయ్య, దామర్ల శ్రీకృష్ణ, గవిని శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ ప్రగడ కోటయ్య రాష్ట్రంలోను, ప్రత్యేకంగా చీరాల నియోజకవర్గ అభివద్ధికి తనదైన ముద్రవేశారన్నారు. ముందుగా కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రగడ కోటయ్య అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వల్ప వాగ్వాదం...

ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య కుమారుడు డాక్టర్ మహేంద్రనాథ్, పలువురు నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రజాబంధు ప్రగడ కోటయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే బలరాం అనుచరులతో కలసి కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో నిర్వాహకులు ముందు తమకు ప్రాధాన్యత ఇవ్వలేదని మహేంద్రనాథ్ వెంట వచ్చిన వారిలో ఒకరు ఒకింత పరుషంగా మాట్లాడటంతో ఇరువైపుల వ్యక్తుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఇదిలా ఉంటే కోటయ్యకు నివాళులు అర్పించే క్రమంలో బలరాం, కింద ఉన్న మహేంద్రనాథ్‌ను పైకి రమ్మని పిలవగా, పలకరింపుగా అభివాదం చేస్తూ అంకుల్ మీరు వేసి రండి, మేం తరువాత వేస్తామని చెప్పారు.



ప్రగడకోటయ్య జయంతి సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం

217 జీవో రద్దుపై హర్షం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పల్లెపాలెం మత్స్యకారులు

చినగంజాం, జూలై 26 : వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన జీవో నెంబరు 217ని టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై మండల పరిధిలోని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో జీవోనెంబరు 217ని రద్దు చేయడంపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అగ్ని కుల క్షత్రియ కమిటీ సభ్యులు గొల్లపోతు వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుదు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావుల చిత్రపటాలకు మత్స్యకారులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన జీ.వో 217 వలన రాష్ట్రంలో సుమారు 700 మత్స్యకార సహకార సంఘాలు, నాలుగు లక్షల మంది మత్స్యకారులకు నష్టం వాటిల్లిందని టీడీపీ పర్చూరు నియోజకవర్గ బీసీ సెల్ కార్యవర్గ సభ్యులు కొక్కిలిగడ్డ రామాంజనేయులు తెలిపారు. జీవో రద్దుతో 3,325 చిన్న తరహా సాగునీటి చెరువులు, 23,920 పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు మత్స్యకార సొసైటీలకే దక్కనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అదికారంలోకి రాగానే 217 జీవోని రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, ఇచ్చినట్లుగానే రద్దు చేసి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులకు మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పర్చూరు నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు దండ్రుప్రోలు తిరుపతిరావు, జి.నాగేంద్రబాబు, అవనిగడ్డ వెంకటరావు, ఎ.నాగస్వాములు, జి.శరత్‌బాబు, వి.ఏసునాదం, కే.శ్రీను, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

మూడు ద్విచక్రవాహనాలు దహనం

● గుర్తుతెలియని వ్యక్తులు చేసినట్లు అనుమానాలు



కాలిపోయిన వాహనాలను, వస్తువులను పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్

మార్టూరు, జూలై 26: మండలంలోని కోనంకి గ్రామంలో షేక్ ఖాజావలి అనే వ్యక్తి ఇంటిలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలు, ఒక సోడాబండి పూర్తిగా దహనమయ్యాయి. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది శుక్రవారం ఉదయం బాధితుని కుమారుడు షేక్ మస్తానవలి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాల్లోకి వెళితే.. ఖాజావలి కోనంకిలో సోడా బండిని నడుపుకుంటూ వ్యవసాయసీజన్‌లో బళ్లారి వెళ్లి వ్యవసాయం చేస్తుంటారు. ఇటీవల బళ్లారి వెళుతూ సోడాబండిని, తన ద్విచక్రవాహనాన్ని ఇంటి వరండాలో ఉంచాడు. అయితే ఈ ఇంటిలో ఖాజావలి కుటుంబం నివశించడం లేదు. ఇంటి ఎదురుగా ఉన్న మరో ఇంటిలో వారు ఉంటున్నారు. ఆ ఇంటి వరండాలో అతని బంధువులకు చెందిన మరో రెండు ద్విచక్రవాహనాలు కూడా ఉంచారు. దాంతో గుర్తుతెలియని వ్యక్తులు మూడు ద్విచక్రవాహనాలను, సోడాబండిని దహనం చేశారు.అనంతరం ఈ మంటలు వ్యాపించి ఇంటి కరెంటు మీటరు, వైర్లతో పాటు ఇంటిలోపల బీరువా, దుస్తులు కూడా కాలిపోయాయి. అయితే పెద్దగా శబ్దాలు రావడం, మంటలు వ్యాపించడంతో ఇంటి ఎదురుగా మరో ఇంటిలో నివసిస్తున్న ఖాజావలి కుమారుడు మస్తానవలి ఇంటినుంచి బయటకు వచ్చి సమీపంలోని బంధువులను పిలిపించి మంటలను ఆర్పివేయించాడు.కాని అప్పటికే పూర్తిగా నష్టం జరిగింది.ఈ ప్రమాదం కాకుండా సమీపంలోని మరో ఇంటిముందు ఉన్న స్కూటీని,ఇంటిలోని సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకు పోయారు.వారు దొంగతనం చేసి వెళుతూ ఈ అగ్నిప్రమాదం చేసి ఉంటారని షేక్ మస్తానవలి అనుమానంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి బాపట్ల నుంచి క్లూస్‌టీం బృందం రాగా వారు వేలిముద్రలను సేకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పత్తిలో గులాబి పురుగు నివారణపై అవగాహన

ఇంకొల్లు, జూలై 26: మండలంలోని ఇడుపులపాడులో పత్తి పంటను బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ పరిశీలించారు. పత్తి, నవధాన్యాల పంటల సాగులో మెలకువలు రైతులకు వివరించారు. పత్తిలో గులాబి పురుగును అరికట్టేందుకు 20 రోజుల నుంచి వేపకషాయం పిచికారీ చేయడంతో పాటు లింగాకర్షణ బుట్టలను పెట్టుకోవాలని సూచించారు. కౌలురైతులు తప్పకుండా కౌలుదారు కార్డులను పొందాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీలో వ్యవసాయ పనిముట్లు, సూక్ష్మపోషకాలైన జింకు, జిప్సం, బోరాన్‌లు అందజేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుగోపాల్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న ఆటో

నలుగురికి గాయాలు

పంగులూరు, జూలై 26 : ముందు వెళుతున్న బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని బైటమంజులూరు సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం తాళ్లూరుకు చెందిన ఆటో డ్రైవర్ టి. మణికంఠ తన ఆటోతో గుంటూరు నుంచి మేదరమెట్ల బయలుదేరాడు. బైటమంజులూరు సమీపంలో ముందు వెళుతున్న బైకును ఢీకొని ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మేడికొండూరుకు చెందిన శివపార్వతి అనే మహిళకు తీవ్ర రక్త గాయాలు కాగా బైకుపై వెళుతున్న ముప్పవరం గ్రామానికి చెందిన పూర్ణారావు, జనకవరం గ్రామానికి చెందిన కుంచాల మహేష్, కుంచాల శివకృష్ణలకు గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పెనుగంచిప్రోలులో మొక్కు తీర్చుకున్న టీడీపీ నేతలు



పెనుగంచిప్రోలులో మొక్కు తీర్చుకుంటున్న అద్దంకి పట్టణ టీడీపీ నేతలు

అద్దంకి, జూలై26 : టీడీపీ కూటమి అధికారంలోకి రావటం, గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో అద్దంకి పట్టణ టీడీపీ నేతలు శుక్రవారం పెనుగంచిప్రోలులో మొక్కు తీర్చుకున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జి కుందారపు రామారావు(చినరాముడు) ఆధ్వర్యంలో అద్దంకి పట్టణ టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పెనుగంచి ప్రోలు వెళ్లి లక్ష్మీతిరుపతమ్మను దర్శించుకొని మొక్కు తీర్చుకున్నారు.

విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

అద్దంకి, జూలై26: విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది రఫీ అన్నారు. అద్దంకి పట్టణంలోని ఎన్‌టీఆర్ డి గ్రీ కళాశాలలో శుక్రవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలు , హెల్మెట్ వినియోగించాల్సిన ఆవశ్యకత గురించి న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, టి. మార్త శ్రీనివాస్, ప్రకాష్, గృహలక్ష్మిలు వివరించారు. కరస్పాండెంట్ రత్తయ్య, ప్రిన్సిపాల్ పెద్ద రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది రఫీ

క్యాజువాల్టీలో బెడ్‌పై మందుబాబు

● బిత్తరపోయిన ఆసుపత్రి సిబ్బంది

చీరాలటౌన్ జూలై 26 : 'బయట ఎండ ఎక్కువగా ఉంది. ఉక్క పోస్తుంది. ఏరియా హాస్పిటల్‌లో చల్లగా ఉంటుంది. కాసేపు పడుకుని రెస్ట్ తీసుకుందామని పించింది. ఆ మందుబాబుకి.. ఇంకేముంది క్వార్టర్ మందు వేసి ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాజువాలిటీలో బెడ్‌పై పడుకొని మత్తు నిద్రలోకి జారుకున్నాడు. ఆసుపత్రి సిబ్బంది వచ్చి లేపడంతో అసహనం వ్యక్తం చేశాడు. ఈఘటన చీరాల ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం వెలుగుచూసింది. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన దానియేలు కుటుంబ సమస్యలతో మద్యానికి బానిసగా మారాడు.శుక్రవారం మద్యం బాగా పట్టించాడు. ఆతరువాత చీరాల ఏరియా హాస్పిటల్‌లో బెడ్‌లు బాగుంటాయి. పైగా చుట్టూ చెట్లతో చల్లగా ఉంటుందని భావించాడు. ఈక్రమంలోనే ఊగుకుంటూ హాస్పిటల్‌లో క్యాజువాల్టీకి వచ్చాడు. అప్పటికే హాస్పిటల్ సిబ్బంది ఓ యాక్సిడెంట్ కేసుకు సంబంధించిన వారికి వైద్యం అందిస్తూ బిజీగా ఉన్నారు. దీంతో అతనే మంచి బెడ్ చూసుకున్నాడు. నేరుగా ఫ్యాన్ వేసుకుని పవళించాడు. ఇతని బెడ్ వద్దకు వచ్చాక ఆరోగ్య సిబ్బంది లేపి బాబు ఏమిటి మీ సమస్య అని అడిగారు. మందు వేశాను. కాసేపు పడుకుంటానని నిద్ర మత్తులో చెప్పాడు. బిత్తర పోయిన సిబ్బంది సెక్యూరిటీ సహాయంతో బయటకు పంపించారు. ఇదంతా గమనించిన ఆంధ్రజ్యోతి ఆ సన్నివేశాలను కెమెరాలో బంధించింది.



మద్యం మత్తులో బెడ్‌పై ఉన్న మందుబాబు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

అద్దంకి, జూలై26: సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. అద్దంకి పట్టణం 8 వ వార్డు పరిధిలోని నర్రావారిపాలెం, రామకృష్ణాపురం, శ్రీరామ్‌నగర్ కాలనీ, గొర్లమిట్టలలో శుక్రవారం కమిషనర్ సత్యనారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా సైడ్ డ్రైన్‌లు, తాగునీటి సమస్య, శానిటేషన్, కుక్కల బెడద తదితర సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. టీడీపీ నేతలు దొప్పలపూడి ప్రసాద్, నర్రా రవీంద్రనాథ్, బిళ్ళపాటి రామాంజనేయులు, నర్రా సుబ్బారావు, శివకృష్ణ, బొజ్జా విజయ్‌కుమార్, యద్దనపూడి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీఆర్ బాండ్లలో అక్రమాలపై నిగ్గుతేల్చాలి



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 26 : వైసీపీ ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల అక్రమాలపై నిగ్గుతేల్చాలని గురువారం అసెంబ్లీ సమావేశ ప్రశ్నోత్తరాల సమయంలో చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధానంగా చీరాల, ఒంగోలు, బాపట్లకు సంబంధించి విడుదల చేసిన టీడీఆర్ బాండ్ల వివరాలు వెల్లడించాలన్నారు. జరిగిన అక్రమాలపై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడాసామగ్రి అందిస్తున్న బీవోబీ అధికారులు

బల్లికురవ. జూలై 26 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ఉన్న బ్యాంకు అఫ్ బరోడా శాఖ తరఫున అగ్రామంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ దన్‌పాల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అవసరాలకు తమ బ్యాంకు తరఫున చేయూత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో

స్వర్ణ(పర్చూరు), జూలై 26: కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో మొలబంటి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు, స్కూల్ రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాని హెచ్‌ఎం సుబ్బారావుకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వసతులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

అమ్మవారికి ఆషాడమాస ప్రత్యేక పూజలు



ఆషాడమాస పూజల్లో పాల్గొన్న మహిళలు

ఇంకొల్లు,జూలై 26 : భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న ఇంకొల్లు పద్మాలంకమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులు సంప్రదాయబద్ధంగా ఆషాడమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు లలితా సహస్రనామ పారాయణం చేశారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరి అమ్మ వారికి ఆషాడం సారె



కన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారె సమర్పిస్తున్న వాసవి వనిత క్లబ్ సభ్యులు

చినగంజాం, జూలై 26 : పెనుగొండ క్షేత్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి చినగంజాం మండల వాసవి వనితా క్లబ్ సభ్యులు ఆషాడ మాసపు సారె కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవి వనితా క్లబ్ మండల అధ్యక్షురాలు కోట సుచిత్ర ఆధ్వర్యంలో సభ్యురాలు తమ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని, విశేష పూజలు నిర్వహించి, అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చినగంజాం మండల ఆర్యవైశ్య కమిటీ అధ్యక్షులు కోట శివరామకృష్ణ, వాసవి వనిత క్లబ్ జెడ్.సీ పొట్టి శైలజ, మండల కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి మోటుమర్రి శేషుకుమారి, క్లబ్ సభ్యురాలు, కుటుంబసభ్యులు సారె కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్చూరు, జూలై 26: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

● రూ.5 లక్షల పరిహారం

విద్యార్థి గురుమహేంద్ర మృతిపై రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అమరావతిలోని తన చాంబర్‌లో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ జరిగిన ప్రమాద విషయాన్ని తెలియచేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ జరిగిన ఘటనపై వెంటనే విచారణ చేపట్టాలని డీఈఓకు ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అండగా నిలుస్తామని, రూ.5లక్షల పరిహారం అందచేస్తామన్నారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందిస్తామని తెలిపారు.



కుమారుడు గురుమహేంద్ర మృతదేహంపై విలపిస్తున్న తల్లిదండ్రులు

రేయ్.. గురూ లేవరా!

- కేఎన్ఆర్ పాఠశాలలో దారుణం ● కుప్పకూలిన భవన సన్‌షేడ్, గోడ
- విద్యార్థి దుర్మరణం ● గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- పిల్లలున్న చోట జాగ్రత్తగా ఉండాలి కదా : డీఈవో
- వందల మందికి ఇద్దరే టీచర్లు ఎలా..? : హెచ్ఎం
- బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : మంత్రి నారాయణ
- 'నాడు-నేడు' పనుల్లో బయటపడ్డ డొల్లతనం

నాడు-నేడు పనులను నాసిరకంగా చేపట్టడం తోపాటు నిధులు ఇవ్వక అర్ధంతరంగా పనులు ఆపించిన గత ప్రభుత్వ పాలకులదా!?. సగం పనులు జరిగిన భవనం వద్దకు పిల్లలను వెళ్లకుండా చూడాల్సిన బాధ్యతను విస్మరించిన ఉపాధ్యాయులదా!? ఇలా తప్పు ఎవరిదైనా ఆ తల్లికి మాత్రం పుత్రశోకం మిగిల్చింది. 'స్కూలుకు వెళ్లొస్తానమ్మా' అంటూ ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన కుమారుడు సాయంత్రం నిర్జీవంగా కనిపించడంతో కన్నపేగు విలవిల్లాడిపోయింది. నవమాసాలు మోసి కంటికి రెప్పలా పెంచుకున్న కొడుకు ఇక లేడని తెలుసుకున్న ఆ తల్లి గుండె పగిలేలా విలపించింది. 'ఓ దేవుడా ఏం పాపం చేశామయ్యా.. మా బిడ్డను పొట్టన పెట్టుకున్నావే.. రేయ్ గురు... లేవరా!?'నంటూ రోదిస్తున్న ఆ మాతృమూర్తిని చూసి అందరి కళ్లు చెమ్మగిల్లాయి. నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న భవనం గోడ కూలి కిందపడటంతో ఓ విద్యార్థి మృతి చెందడం అందరినీ శోకసంద్రంలో ముంచెత్తింది.

నెల్లూరు (విద్య/క్రైం), జూలై 26 : తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రాంతానికి చెందిన కొత్తపాలెం గురవయ్య, రూప దంపతులకు ఇద్దరు కుమారులు. బిడ్డల చదువుల కోసం వీరు నెల్లూరుకు వలసొచ్చారు. నగరంలోని ఇస్కాన్ సిటీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గురవయ్య వాచ్‌మన్‌గాను, రూప కూలి పనులకు వెళుతోంది. వీరి చిన్న కుమారుడు గురుమహేంద్ర (14) కేఎన్ఆర్ నగరపాలక సంస్థ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన మహేంద్ర సాయంత్రం లాంగ్‌బెల్ తర్వాత నిర్మాణంలో ఉన్న నాడు-నేడు రెండవ దశ అదనపు తరగతి గదుల మొండి గోడల వద్దకు వెళ్లి గోడపైన ఉన్న సన్‌షేడ్‌ను పట్టుకొని ఆడుకుంటున్న సమయంలో సన్‌షేడ్, దానిమీద ఉన్న గోడ విరిగి గురుమహేంద్రపై పడ్డాయి. ఇది గమనించిన తోటి విద్యార్థులు అక్కడే ఉన్న ఉపాధ్యాయులకు తెలిపారు. హుటాహుటిన వారు ఘటనాస్థలికి చేరుకొని శిథిలాల కింద ఉన్న విద్యార్థిని బయటకు తీశారు. గురుమహేంద్ర తలపై గోడ బలంగా పడటంతో అప్పటికే మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయప్రకాష్ వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నగర డీఎస్పీ శ్రీనివాసులరెడ్డితోపాటు ఇన్‌స్పెక్టర్ నారాయణ స్కూలు వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని గుండెలవిసేలా రోదించారు. జీజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వందల మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులను అదుపు చేయడం కష్టంగా మారుతోందని, అందుకే ప్రమాదం జరిగిందని పాఠశాల హెచ్ఎం పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్నారు.



విద్యార్థి గురుమహేంద్ర (ఫైల్)

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కేఎన్ఆర్ పాఠశాలలో జరిగిన ప్రమాద ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ నాయకులు డిమాండ్ చేశారు. పేరెంట్స్ కమిటీ నేతలు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో అసంపూర్తిగా నిర్మాణాలు చేసి నిలిపివేసిన భవనాల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జరిగిన అక్రమాలకు, సంఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నరహరి, నేతలు తదితరులు ఉన్నారు.



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న డీఈవో రామారావు



వాదులాడుకుంటున్న డీఈవో, హెచ్ఎం

● డీఈవో వర్సెస్ హెచ్ఎం

స్కూలు వద్దకు చేరుకున్న డీఈఓ రామారావు జరిగిన విషయాలను తెలుసుకుని హెచ్ఎం విజయప్రకాష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన రక్షణ తీసుకుని ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదని ప్రశ్నిస్తుండగా హెచ్ఎం సైతం డీఈఓపై విరుచుకుపడ్డారు. పాఠశాలలో వందలాది మంది విద్యార్థులున్నా ఇద్దరు టీచర్లనే కేటాయించారని, ఇద్దరితో రక్షణ ఎలా సాధ్యమవుతుందంటూ నిలదీయడంతో పక్కనే ఉన్న ఇతర అధికారులు సర్దిచెప్పి పంపేశారు. కాగా, పాఠశాలలో జరిగిన ఘటనపై విచారణ చేపడతామని డీఈఓ తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషారాణి, ఆర్డీఓ మలోల, డిప్యూటీ ఈఓ లక్ష్మీ ప్రసన్న, కార్పొరేషన్ అదనపు కమిషన్ శర్మద, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, జనసేన నాయకుడు కిశోర్ తదితరులు పరిశీలించి జరిగిన ఘటనపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బయటపడ్డ డొల్లతనం

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గత వైసీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నాడు-నేడు పనులు చేపట్టింది. పాఠశాలల్లో పది రకాల పనులకు పాఠశాల స్థాయి, అవసరాన్ని బట్టి నిధులు కేటాయించి ఆయా పాఠశాలల కమిటీల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేశారు. ఈ పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే నాణ్యతాలోపాలతోపాటు నిధులు దుర్వినియోగం అవుతాయన్న ఉద్దేశంతో తల్లిదండ్రుల కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు హెచ్ఎంల పర్యవేక్షణలో పనులు చేపట్టాలని నాటి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అయితే జిల్లాలో మాత్రం అత్యధిక ప్రాంతాల్లో పేరెంట్స్ కమిటీల్లో వైసీపీకి చెందిన నాయకులే కీలకంగా వ్యవహరిస్తూ ఇష్టానుసారంగా పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ సామగ్రి మొదలు పనుల వరకు నాసిరకంగా జరిగాయని అప్పట్లో విమర్శలు గుప్పుమన్నాయి. అందులో భాగంగానే కేఎన్ఆర్ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో భవన నిర్మాణ పనుల్లో డొల్లతనం బయటపడింది. గత ఏడాది డిసెంబరులో కూడా నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనానికి సంబంధించిన మెట్లు నాసిరకంగా నిర్మించడంతో ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రాణహాని తప్పింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు కూలిన నిర్మాణం ఎవరి కంటా పడకుండా వేగవంతంగా పనులు చేపట్టారు.

● విద్యార్థి సంఘాల ఆందోళన

నాసిరకం నిర్మాణాలతోనే గోడ కూలి విద్యార్థి మృతి చెందాడంటూ విద్యార్థి సంఘాలు కేఎన్ఆర్ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. అధికారులు నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని, విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జరిగిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కేఎన్ఆర్ పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు

బోర్డు పరిమితి మేరకే పొగాకు పండించాలి

చైర్మన్ యశ్వంత్‌కుమార్ వెల్లడి ● అనధికార పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

కందుకూరు, జూలై 26: రానున్న సీజన్‌లో పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే రైతులు పొగాకు పండించాలని లేకుంటే నష్టపోతారని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ సూచించారు. వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబుతో కలిసి శుక్రవారం ఆయన కందుకూరులోని వేలం కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అపరాధ రుసుము లేకుండా అనధికార పొగాకు కొనుగోళ్లను ఆయన ప్రారంభించి వేలం తీరును పరిశీలించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు మంచి డిమాండ్ ఉన్నందున రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. అనంతరం రైతులతో సమావేశమై పొగాకు మార్కెట్ స్థితిగతులను వివరించారు. వచ్చే సంవత్సరం పరిమితికి మించి పొగాకు పండిస్తే అపరాధ రుసుము విధించేందుకు తాము అంగీకరించి ఈ అనుమతి తీసుకురావటం జరిగిందని వివరించారు. వచ్చే సంవత్సరం అంతర్జాతీయంగా మార్కెట్ ఎలా ఉంటుందో కూడా చెప్పలేమని అందువల్ల ప్రస్తుత ధరలను దృష్టిలో పెట్టుకుని అధిక ధరలకు పొలాలు, బ్యారన్లు లీజుకు తీసుకుని పొగాకు సాగుచేయటం వల్ల ఇబ్బందిపడే అవకాశం ఉందని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్‌చైర్మన్‌లను రైతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజగోపాల రెడ్డి, రైతుప్రతినిధులు, బయ్యర్లు పాల్గొన్నారు.



కందుకూరు-2 వేలం కేంద్రంలో పొగాకు వేలంను పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్, వైస్ చైర్మన్ తదితరులు

మళ్లీ అక్కడే!

- పట్టాలు తప్పిన గూడ్సు వ్యాగిన్
- వెనువెంటనే మరమ్మతుల పూర్తి
- తరచూ పట్టాలు తప్పడంపై ఉన్నతాధికారుల ఆరా



పట్టాలు తప్పిన వ్యాగిన్‌ను పైకి లేపుతున్న రైల్వే సిబ్బంది



విరిగిన సపోర్ట్ రైల్ పట్టా

బిట్రగుంట, జూలై 26 : బిట్రగుంట రైల్వేస్టేషన్ పరిధిలో రెండోసారి గూడ్సురైలు పట్టాలు తప్పడం అధికారుల్లో కునుకులేకుండా చేసింది. శుక్రవారం తెల్లవారుజామున 4.20 గంటలకు నెల్లూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే గూడ్సు రైలు దక్షిణ యాడ్ క్రాస్ పాయింట్ వద్ద పట్టాలు తప్పింది. మెయిన్ లైన్ నుంచి లూప్ లైన్ ద్వారా రోడ్ నెం.8లోకి వెళ్లే క్రమంలో పట్టాలు తప్పినట్లు గుర్తించారు. గూడ్సు వ్యాగిన్ ముందు చక్రాలు మాత్రమే పట్టాలు దిగాయి. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పట్టాలు తప్పిన వ్యాగిన్‌ను తొలగించి ఎల్సీగేట్ 144 వద్ద వాహనదారులకు ఇబ్బంది లేకుండా చేశారు. బిట్రగుంట, కావలి పీడబ్ల్యూ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని హైడ్రాలిక్ పవర్ మిషన్ సహాయంతో వ్యాగిన్‌ను యథావిధిగా పట్టాలపైకి చేర్చారు. మెయిన్ లైన్ క్రాస్ పాయింట్‌కు 30 అడుగుల దూరంలో సపోర్టింగ్ రైలు పట్టా విరగడంపై అధికారులు ఆరా తీస్తున్నారు. మూడు రోజుల క్రితం కూడా ఇదే ప్రాంతంలో గూడ్సు రైలు పట్టాలు తప్పింది. దీంతో అధికారులు సందిగ్ధంలో పడ్డారు. గూడురు, నెల్లూరు స్టేషన్ల తనిఖీ నిమిత్తం విచ్చేసిన ఉన్నత అధికారులకు ఈ విషయం తెలియడంతో ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు.

- క్వార్ట్జ్, సిలికా అక్రమాలపై ప్రభుత్వం సీరియస్
- పూర్తిస్థాయి విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాల అధికారులతో ఏడు బృందాలు
- వెంటనే రంగంలోకి దిగిన విచారణాధికారులు
- రూ.వేల కోట్ల ప్రజా సంపద దోచిన వైసీపీ నేతలు
- ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు

తవ్వింది ఎంత.. దోచింది ఎంత!?

చేసిన పాపాలకు శిక్ష అనుభవించక తప్పదన్నది చరిత్ర చెబుతున్న నిజం. అధికారమే అండగా వైసీపీ నేతలు సాగించిన దోపిడీ అంతా ఇంత కాదు. క్వార్ట్జ్ (తెల్లరాయి), సిలికా వంటి విలువైన ప్రజా సంపదను కొల్లగొట్టి రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఈ అక్రమాల పుట్టబద్ధలయ్యే సమయం ఆసన్నమైంది. జిల్లాలోని ఖనిజ సంపద దోపిడీని ఎన్డీయే కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన ఈ దోపిడీపై విచారణకు ఆదేశించింది. పలు జిల్లాల అధికారులతో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. వెంటనే నెల్లూరుకు చేరుకున్న విచారణాధికారులు తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో కొలతలు తీస్తున్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించు న్నారు. ఆ నివేదికలు అందిన వెంటనే ప్రభుత్వం క్రిమినల్ కేసులతో పాటు అక్రమార్కుల నుంచి దోచుకున్న ప్రజా సంపదను రికవరీ చేయాలని నిర్ణయించుకుంది. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

నెల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం, పొదలకూరు, గూడూరు రూరల్, రాపూరు మండలాల్లో ఎక్కడపడితే అక్కడ వైసీపీ నాయకులు విచ్చలవిడిగా తెల్లరాయిని తవ్వుకెళ్లారు. ప్రభుత్వం, అటవీ భూములతో పాటు పట్టా భూముల్లోనూ రైతులు, మైనింగ్ లీజుదారులను బెదరించి క్వార్ట్జ్‌ను కొల్లగొట్టారు. అప్పట్లో ప్రతిపక్ష నేతలు ఈ తవ్వకాలను అడ్డుకున్నా, ప్రజలు గగ్గోలు పెట్టినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. వైసీపీ నేతలే తెరవెనుక ఇదంతా చేయించడంతో నాడు ఎవరూ నోరు మెదపలేదు. చివరకు టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో అధికార యంత్రాంగం ఎన్నికల కోడ్ వచ్చాక విచారణకు పూనుకుంది. దాదాపు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్‌ను దోపిడీ చేసినట్లు నిర్ధారించి, రూ.255 కోట్లు పెనాల్టీలు విధించారు. దీని విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేల కోట్లు ఉంటుంది. ఈ అక్రమ తవ్వకాలకు వైసీపీ నేతలు బాధ్యులని గుర్తించి దాదాపు 200 మందికి మైనింగ్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. తాజాగా మరోసారి క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై పూర్తిస్థాయిలో విచారించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

● బెదిరించి లాగేసుకొని..!

చిల్లకూరు, కోట మండలాల్లోని అరుదైన సిలికా ఖనిజాన్ని వైసీపీ నేతలు హైజాక్ చేశారు. లీజుదారులను బెదరించి మైన్‌లను బల వంతంగా లాగేసుకున్నారు. 80 లీజులు ఉండగా అన్నిటినీ వైసీపీ నేతల చేతుల్లోకి వెళ్లిపోయాయి. నాడు మైనింగ్ లీజుదారులు టన్ను సిలికాను రూ.400 ధరతో డీలర్ లైసెన్సుదారులకు విక్రయించేవారు. వీరు కంపెనీలకు రూ.600 చొప్పున విక్రయించుకునేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక సిలికా మొత్తాన్ని లాగేసుకొని మైన్ లీజుదారులకు టన్ను రూ.100 చొప్పున ఇచ్చారు. అదే సిలికాను డీలర్ లైసెన్సుదారులకు రూ.1400 చొప్పున అమ్మడం ప్రారంభిం చారు. డీలర్లు టన్ను సిలికాను రూ.1800కు కంపెనీలకు విక్రయించా ల్సి వచ్చింది. దీంతో కంపెనీలన్నీ జిల్లాలోని సిలికాకు బదులు గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడం మొదలుపె ట్టాయి. ఇక అక్రమార్కులు దాదాపు 400 ఎకరాల ప్రభుత్వ భూము ల్లో కూడా సిలికాను తవ్వేశారు. కొందరు రైతులను బెదిరించి ఎకరానికి రూ.3 లక్షల చొప్పున ఇచ్చి ఆ భూముల్లో కూడా సిలికాను ఎత్తేశారు. ఇలా ఐదేళ్లపాటు సాగించిన దోపిడీ ద్వారా రూ.వేల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టారు.



సైదాపురం మండలంలో అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తున్న విచారణాధికారులు

● విచారణకు ఏడు బృందాలు

సిలికా, క్వార్ట్జ్ అక్రమాలపై విచారణకు ఏడు బృందాలను ఏర్పాటు చేస్తూ మైనింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. మూడు బృందాలకు నెల్లూరు మైనింగ్ డీడీ శ్రీనివాసకు మార్, మరో నాలు గు బృందాలకు గూడూరు డివిజన్ మైనింగ్ అధికారి డీవీ రంగకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. నెల్లూరు, ఒంగోలు, మార్కాపురం, తిరుపతి, గూడూరు, పలమనేరు, చిత్తూరు, దాచేపల్లి మైనింగ్ శాఖ కార్యాల యాల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ జియాలజిస్టులు, సర్వేయర్లు, సూపర్‌వైజర్లు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, టెక్నికల్ అసిస్టెంట్లను విచారణ బృందాల్లో సభ్యులుగా నియమించారు. నెల్లూరు, గూడూరు మైనింగ్ కార్యాలయాల పరిధిలో ఉన్న అన్ని క్వార్ట్జ్, మైకా, ఫెల్డ్‌స్పార్, సిలికా లీజు మైన్లలో తనిఖీలు నిర్వహించాలని, అలానే అనధికారిక తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లోనూ తనిఖీలు నిర్వహించి పూర్తిస్థాయి నివేదికలను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్అండ్‌బీ స్థలంలో వైసీపీ నేత అక్రమ కట్టడం

● ఉద్రిక్త పరిస్థితుల నడుమ తొలగించిన అధికారులు

లింగసముద్రం, జూలై 26: మండల కేంద్రమైన లింగసముద్రం గ్రామంలోని మీసేవా కేంద్రం సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న ఆ శాఖ స్థలంలో ఓ వైసీపీ నాయకుడు రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మించిన రేకులషెడ్డు తొలగింపు సందర్భంగా వైసీపీ, టీడీపీ నాయకులు ఘర్షణకు దిగారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్అండ్‌బీ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మించాలని టీడీపీ నేతలు ఎంపీడీవో శ్రీనివాసులును కోరారు. ఈ విషయం తెలిసిన వైసీపీ నాయకుడు వరికూటి కృష్ణారెడ్డి గురువారం రాత్రి రేకులషెడ్డు నిర్మించాడు. దీంతో షెడ్డు తొలగించాలని టీడీపీ నేతలు ఎంపీడీఓ శ్రీనివాసులను కోరడంతో శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎస్సై ఎం బాజీబాబు, పంచాయతీ కార్యదర్శి మాధవరావు, వీఆర్‌ఓ మస్తాన్‌వళిలు రేకుల షెడ్డు వద్దకు సిబ్బందితో వచ్చారు. అలాగే టీడీపీ శ్రేణులు, గ్రామస్థులు కూడా పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. అక్కడకు వచ్చిన వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డిని ఎలాంటి అనుమతులు లేకుండా రేకులషెడ్డు ఎలా నిర్మించారని పంచాయతీ కార్యదర్శి మాధవరావు అడగ్గా, తన స్వంత స్థలం ముందు ఈస్థలం ఉందని, అందుకే రేకులషెడ్డు నిర్మించానని చెప్పాడు. దీనికి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే తొలగించాలని మాధవరావు చెప్పారు. అయితే ఈ స్థలంలో చాలామంది కట్టడాలు నిర్మించారని, వారందరికీ నోటీసులు ఇచ్చి, తనకు కూడా నోటీసు ఇస్తే తొలగిస్తానని కృష్ణారెడ్డి బదులిచ్చారు. దీంతో ఇది రాత్రికి రాత్రి నిర్మించిన అక్రమ కట్టడం అని, వెంటనే తొలగించాలని టీడీపీ నేతలు జంపాల శివప్రసాద్, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, అడపా నర్సయ్య, మద్దెల రామారావు, షైల కేశవరావు వాగ్వివాదానికి దిగారు. ఈసందర్భంగా షెడ్డు తొలగించేందుకు కృష్ణారెడ్డికి కొంత సమయమివ్వాలని టీడీపీ నాయకుడు ఉప్పతి బాబురెడ్డి మరికొందరు వైసీపీ నేతలు వారికి నచ్చచెప్పారు. ఈనేపథ్యంలో కృష్ణారెడ్డి, బాబురెడ్డి, టీడీపీ నేతలకు తీవ్ర వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఎస్సై బాజీబాబు, గుడ్లూరు, వలేటివారిపాలెం ఎస్సైలు లక్ష్మణరావు, బాలూ మహేంద్రనాయక్‌లు, సిబ్బంది. ఇరువర్గాలను చెదరగొట్టి దూరంగా పంపించారు. అనంతరం మాధవరావు, వీఆర్‌ఓ మస్తాన్‌వళిలు రేకులషెడ్డును ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. కందుకూరు డీఎస్పీ ఎ శ్రీనివాసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.


ఎక్స్‌కవేటర్‌తో రేకుల షెడ్డును కూల్చేస్తున్న అధికారులు

మంత్రులను కలిసిన మన్నేటి


మంత్రులతో మాట్లాడుతున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, జూలై 26: రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వైద్యఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్‌లను విజయవాడ విమానాశ్రయంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు సహకరించాలని మంత్రులను కోరినట్లు ఆయన తెలిపారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలను 50 పడకలకు మార్చినా గైనకాలజిస్టు, పిల్లల వైద్యులతో పాటు అరకొర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన మంత్రి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు పీవీ రమణయ్య, సభ్యులు వీకే ప్రకాష్, సలహాదారు మామిడిపల్లి బాలగంగాధర్, వెంకట శ్రీనివాస్ ఉన్నారు.

సచివాలయాలకు అధినేతల చిత్రపటాల అందజేత

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని శకునాలపల్లి సచివాలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను నాయకులు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు సురేంద్రరెడ్డి, అలూరి రవీంద్ర, కల్లూరి వెంకటసుబ్బారెడ్డి, కేశవనారాయణ, కేశయ్య, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు కరీముల్లా, తేజ, అనూష, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

117 జీవోను రద్దు చేయాలి: యూటీఎఫ్

వింజమూరు, జూలై 26: యూటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీవో నెంబరు 117ను రద్దు చేయాలని కోరుతూ మండల విద్యాశాఖాధికారికి వినతిపత్రం అందజేశారు. అందులో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని, ఇతర సమస్యలపై విద్యాశాఖాధికారికి తెలియజేశామన్నారు. కార్యక్రమంలో చెంచలబాబు, వెంకటేశ్వరరెడ్డి, మీరావలి, నాగేశ్వర రావు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఊటుకూరులో పారిశుధ్య పనులు

వింజమూరు, జూలై 26: మండలంలోని ఊటుకూరు పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు మురుగునీరు నిలిచిన చోట దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లినట్లు, అలాగే తక్కెళ్లపాడు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ వెంగమ్మ తెలిపారు. పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో మురుగునీరు నిలిచిన చోట, బోరు, సైడ్ కాలువల వద్ద దోమలు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

మహిళ మృతిపై విచారణ

అనంతసాగరం : బొమ్మవరంలో పల్లవోలు బుజ్జమ్మ వాంతులు, విరేచనాలతో మృతి చెందినట్లు వచ్చిన ఆరోపణలపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే అనంతసాగరం పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అంద జేస్తామని తెలిపారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని గండిపాళెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలు ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాజులపల్లి అమర్నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరి రూరల్, జూలై 26: మండలంలోని శకునాలపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షాసప్తాహ్ కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షా సప్తహ కార్యక్రమం పరిశీలన

కావలిటౌన్, జూలై 26: కావలి పట్టణ జడ్పీ బాలురోన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షా సప్తహ కార్యక్రమాన్ని శుక్రవారం సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్నిరంగాల్లో రాణించేవిధంగా కేంద్రప్రభుత్వం వారంరోజుల పాటు పాఠశాలల్లో శిక్షా సప్తహ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ రఘురామయ్య, ఎంఈఓ గోవిందయ్య, ప్రధానోపాధ్యాయిన నీరజ తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి: ఎంపీడీవో


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో

సీతారామపురం, జూలై 26: ఓడీఎఫ్ ప్లస్ సర్వే త్వరగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం చేయకుండా వందశాతం పూర్తయ్యేటట్లు చూడాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలియజేశారు. ఆయన శుక్రవారం సీతారామపురం బిట్-1 సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఒకటవ తేది జరిగే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరు గంటల నుంచి ప్రారంభించి రెండు రోజులో పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలని కోరారు. సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, అనంతరం పలు రిజిష్టర్లు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ జీవన్, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి, మహిళ కార్యదర్శి హాజిరాబేగం, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి

ఉదయగిరి రూరల్, జూలై 26: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. వైద్యశాలలో ఇద్దరు వైద్యులు డిప్యుటేషన్‌పై వెళ్లినా వారి స్థానంలో ఎవరిని ఇంకా నియమించకపోవడంతో రోగులకు మెరుగైన సేవలందడం లేదన్నారు. అంతేకాకుండా రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ఉదయగిరి-నందవరం, ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణాలను పూర్తి చేసి ప్రజల కష్టాలను తీర్చాలని కోరారు. పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, కామాక్షమ్మ, పందిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధిని విస్మరించారు

ఉదయగిరి రూరల్, జూలై 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో మేజర్ పంచాయతీ అయిన ఉదయగిరి అభివృద్ధిని పాలకులు, అధికారులు మరిచారని టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, పలువురు టీడీపీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం రైతు సేవా కేంద్రం-1లో ఎంపీడీవో దేరకొండ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. వీధిదీపాలు వెలిగిన దాఖలాల్లేవన్నారు. మురికి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తూ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను కలిగిసుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సిమెంట్‌రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం నాసిరకంగా జరగడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. గ్రామసభకు సర్పంచ్, పలువురు వార్డుసభ్యులు హాజరుకాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎంపీడీవో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, సందానీ, సజిల్, అలీజాన్, నరసింహ, బాబు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఏవీఎస్ నాయకులు

ఆత్మకూరు, జూలై 26: ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆంధ్ర విద్యార్థి సంఘం (ఏవీఎస్) నియోజకవర్గ కన్వీనర్ మహంత్‌రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఏవీఎస్ నేతలు ఆర్డీవో కే మధులతకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వసతి గృహాలు శిథిలావస్థకు చేరాయని, మరికొన్ని దశాబ్దాల తరబడి అద్దె గృహాల్లోనే కొనసాగుతున్నాయన్నారు. బీసీ బాలికల వసతి గృహం ప్రహరీగోడ కూలిపోయిందని, మర్రిపాడు, రేవూరులోని వసతి గృహాలు సైతం అధ్వానంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు స్పందించి వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవీఎస్ నాయకులు శ్రీరామ్, ఆదిత్య, పూర్ణేష్, తిరుమల పాల్గొన్నారు.

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల సిబ్బందికి సన్మానం

వింజమూరు, జూలై 26: వింజమూరులోని వైఎస్సార్ క్రాంతిపథకంలో పనిచేస్తున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులో సంబంధించిన వీవోఏలు, సీసీలకు, ఏటీఎంకు స్థానిక భారతీయ స్టేట్ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో చిరుసన్మానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు చీఫ్ మేనేజర్ వై.రామకృష్ణ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి నిరంతరం స్వయం సహాయక బృందాల సభ్యులు పాటుపడుతున్నారని తెలిపారు. అదేవిధంగా మా బ్యాంకు పరిధిలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు 350 ఉన్నాయని తెలిపారు. ఈ గ్రూపులన్నింటికి ఒక్కొక్క దానికి సుమారు రూ.20లక్షల మేర రుణాలు ఇస్తున్నామని తెలిపారు. సంఘ సభ్యులు రుణాలను సకాలంలో చెల్లిస్తూ బ్యాంకు అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నారని అలాంటి వారిని సన్మానించుకోవడం బ్యాంకు అదృష్టమని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు చీఫ్ మేనేజర్ వై.బాబురావు, ఫీల్డ్ ఆఫీసర్ మధు, కృష్ణమోహన్, మహేష్, స్థానిక ఏపీఎం సురేష్, ఫీల్డ్ అధికారి మధు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తత అవసరం


చెట్లను పరిశీలిస్తున్న జయశ్రీ

ఉదయగిరి రూరల్, జూలై 26: పండ్లతోటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖాధికారి జయశ్రీ సూచించారు. శుక్రవారం ఉదయగిరితో పాటు దుత్తలూరు మండలంలోని సోమరేగడ, వెంకటంపేట గ్రామాల్లో బత్తాయి, మామిడి, డ్రాగన్‌ఫ్రూట్ తోటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వేరుకుళ్లు తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ ఏ భరత్, రైతులు పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన

నేలటూరులో సాగులో ఉన్న మినుము పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మినుము పంటలో తెగులు నివారణకు లీటర్ నీటికి 0.5 గ్రాముల అసటామాప్రైడ్‌ను పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్, ఏఈవో వీపీఏ స్రవంతి పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాల తనిఖీ

సీతారామపురం, జూలై 26: మండల పరిధిలోని సీతారామపురం, పబ్బులేటిపల్లి సచివాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి అప్‌డేట్ చేయడంతో పాటు పేర్ల చేర్పులు మార్పులు చేయడం జరుగుతుందని తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు

కావలి, జూలై 26: వివిధ రేజిమెంట్లకు చెందిన 587 మంది సైనికుల ప్రాణత్యాగంతో కార్గిల్ యుద్ధంలో భారత్‌కు విజయం లభించిందని కార్గిల్ యుద్ధవీరుడు మారుబోయిన యానాది తెలిపారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం కావలిలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బీవీ రాజారావు అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీ స్థానిక బీపీఎస్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ ర్యాలీలో అఖిలభారతీయ పూర్వ సైనిక సేవాపరిషత్, రెడ్‌క్రాస్, రోటరీక్లబ్ తదితర సంస్థల ప్రతినిధులు సంఘీభావంగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో గాయపడిన సైనికుడు మారుబోయిన యానాదిని ఈ సందర్భంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తాను కార్గిల్ యుద్ధంలో గాయపడి నెల రోజులు కోమాలో ఉన్నానని తెలిపారు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైనికులు కార్గిల్ శిఖరాలపైకి చేరి బంకర్లు ఏర్పాటు చేసుకుని ఉన్నా అత్యంత సాహసంతో మన సైనికులు వారిని తరిమికొట్టడం జరిగిందన్నారు. అనంతరం జూలై 26న టైగర్‌హిల్స్‌పై మన జాతీయపతాకాన్ని ఎగురవేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వసైనిక సేవాపరిషత్ కావలిశాఖ కన్వీనర్ డీ రవిప్రకాష్, జమున, రెడ్‌క్రాస్ రక్తకేంద్రం సిబ్బంది, రోటరీక్లబ్ ప్రతినిధులు స్వర్ణలత, సలీమ్‌బేగ్, గోపీక్రిష్ణ మాజీ సైనికులు, కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, రహీమ్,బాషా, జాన్, శ్రీనివాసులు, సాలోమన్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ పనుల తనిఖీ


అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

కావలి, జూలై 26: కావలి ఆర్డీవో శీనానాయక్ మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం కావలి పట్టణంలో పలుచోట్ల తనిఖీలు చేశారు. తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్ మరమ్మతుల పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఆగస్టు 15వ తేదీన అన్నా క్యాంటీన్‌లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్న సందర్భంగా త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అనంతరం దాని పక్కనే గతంలో అమృత్ పైలాన్‌ను ధ్వంసం చేసిన స్థలంలో జాతీయ జండా ఐకాన్ నిర్మాణాన్ని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సొంత నిధులతో చేయిస్తుండగా పరిశీలించారు. అనంతరం రైతుబజారులను పరిశీలించారు. అక్కడ పారిశుద్యం నిర్వహణను పరిశీలించారు. పట్టణంలో పలుచోట్ల కేబుల్ వైర్లు వేలాడుతుండటంతో వాటి నిర్వాహకులను పిలిపించి సరిచేయించాలని, వారు సరి చేయకపోతే ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న వైర్లను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ డీఈ సాయిరాం, పట్టణ ప్రణాళికాధికారి బాబూరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడికతీత పనుల పరిశీలన

కావలి, జూలై 26: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కావలి పట్టణంలో డ్రైనేజీ పూడికతీత పనులను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చేపట్టారు. పట్టణంలో ట్రంకు రోడ్డు, సినిమాహాల్ రోడ్డులలో జరుగుతున్న పనులను శుక్రవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అలాగే తీసిన పూడికను అక్కడ నుంచి వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి

ఆత్మకూరు, జూలై 26 : ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెంట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వలన ఉపయోగాలను వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు.

●**అల్లూరు:** అల్లూరు పట్టణంలో శుక్రవారం నెల్లూరు ఆర్టీఓ పూర్ణచంద్రరావు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు ద్విచక్రవాహనాలకు పత్రాలు లేని కారణంగా సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని మిగిలిన వాహనాలకు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతోపాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ కార్య క్రమంలో అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కరించాలి

గుడ్లూరు, జూలై 26 : మండల కేంద్రమైన గుడ్లూరు రెడ్డిపాలెం పాత రైస్‌మిల్ వీధిలో ఏర్పడిన పంచాయతీ పైపులైన్ లీకేజీ సమస్య పరిష్కరించి కుళాయి నీరు అందించాలని ఆ ప్రాంత కాలనీకి చెందిన పలువురు మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డిపాలెం పాతరైస్ మిల్లు వీధికి పక్కగా నూతన ఇంటి నిర్మాణాలు చేస్తున్న కొందరు తమ ఇంటికి అడ్డుగా ఉందనే కారణంచేత, రహదారికి పక్కగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ముందుకు జరిపి, పైపులైన్ ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయించడంతో కుళాయి పైపులైన్ దెబ్బతిందని దీంతో నీటి సరఫరాను అధికారులు నిలుపుదల చేయడంతో గత వారం రోజుల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైన మండల స్థాయి విద్యుత్, పంచాయతీ, మండల పరిషత్ అధికారులు వెంటనే స్పందించి పైపులైన్ మరమ్మతులు వెంటనే చేయించాలని, అలాగే రహదారికి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని కూడా తొలగించి, పాత స్థానంలోనే ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరారు.

బిచ్చగాని వద్ద రూ.1.50 లక్షలు దోచుకున్న దొంగలు

లింగసముద్రం, జూలై 26: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన శాగం రాగయ్య అనే బిచ్చగాని వద్ద దొంగలు రూ.1.50 లక్షలు దోచుకున్నారు. గ్రామానికి చెందిన ఆయన బంధువులు కొందరు ఈ సంఘటనపై రాగయ్య చేత మూడు రోజుల క్రితం లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. వారు అందించిన సమాచారం మేరకు 5 రోజుల క్రితం రాగయ్య గ్రామ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి గుడి వద్ద రాత్రి ఒక్కడే నిద్రిస్తుండగా దొంగలు అతని వద్ద నగదును తీసుకొని కొట్టి పరారయ్యారు. ఈ సంఘ టనలో నలుగురు వ్యక్తులు పాల్గొన్నట్టు వారు అను మానాలు వ్యక్తం చేస్తూ, వారి పేర్లు కూడా పోలీసులకు చెప్పినట్టు తెలిపారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

అల్లూరు, జూలై 26: జనసేన పార్టీ బలోపేతం కావాలంటే క్రియాశీలక సభ్యత్వం కీలకమని ఆ పార్టీ కావలి ఇన్‌చార్జి అలహరి సుధాకర్ అన్నారు. అల్లూరులో శుక్రవారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం : డీటీసీ


ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న డీటీసీ.

కావలి రూరల్, జూలై 26: పర్యావరణ పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యుటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బి చందర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్డీవో కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్టీవో వై సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీటీసీ చందర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో డీటీసీ చేతుల మీదుగా 30 రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్టీవో కార్యాలయ ఇన్‌స్పెక్టర్‌లు సుందర్‌రావు, కరుణాకర్, లక్ష్మీభాయ్, కందుకూరు ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ రఫీ, నెల్లూరు ఇన్‌స్పెక్టర్ లు మురళిమోహన్, బాలమురళీక్రిష్ణ, రాంబాబు, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో ముగిసిన జాతీయస్థాయి సెమినార్

కందుకూరు, జూలై 26: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం సాయంత్రం ముగిసింది. భారతదేశంలో ఆర్థిక సేవలు - అవకాశాలు, సమస్యలు మరియు సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన ఈ సెమినార్‌లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల అర్థశాస్త్ర ప్రొఫెసర్లు హాజరై దేశ ఆర్థిక పురోగమనం, అన్నివర్గాలు ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలపై తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అర్థశాస్త్ర ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ సెమినార్‌లో జరిగిన చర్చల సారాంశం దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతోకొంత దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్ ముగింపు కార్యక్రమంలో కో ఆర్డినేటరు డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జేబీ డిగ్రీ కళాశాలను సందర్శించిన వీసీయు వీసీ


ఇండోర్ స్టేడియంను పరిశీలిస్తున్న వీసీయు వీసీ

కావలిటౌన్, జూలై 26: జవహర్ భారతీ డిగ్రీ కళాశాలను శుక్రవారం విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉప కులపతి ఆచార్య విజయ భాస్కర్‌రావు సందర్శించారు. కళా శాల ప్రాంగణమంలోని క్రీడామైదానం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, గార్డెన్ సందర్శించారు. ఆయన మాట్లా డుతూ విశ్వోదయ వ్యవస్థాపకుడు దొడ్ల రామచంద్రారెడ్డి అంకితభావంతో చేసిన కృషి ఫలితమే విశ్వోదయా విద్యాసంస్థలని నాటి వైభవం తలచుకున్నారు. విశ్వోదయకు పూర్వ వైభవం కల్పించేందుకు కృషిచేయాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో విద్యాపరమైన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు : వంటేరు

జలదంకి, జూలై 26: ఐదేళ్ళ జగన్ రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారని కావలి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నాయకుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 40రోజుల చంద్రబాబు పాలన చూసి ప్రజలు ఆనందంగా ఉంటే జగన్‌కు మతిభ్రమించి ఢిల్లీ వెళ్ళి ధర్నా చేయడం చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణక్రాక సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఇండ్ల సుదాకర్, దగుమాటి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ మండల నాయకుడు చేవూరి జనార్ధన్‌రెడ్డి, బీజేపీ నేత మారెళ్ళ బ్రహ్మారెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం ప్రధాని మోదీ, సిఎం, డిప్యూటీ సిఎంలు చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల చిత్రపటాలను బ్రాహ్మణక్రాక, బికె అగ్రహారం గ్రామసచివాలయాల్లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నీరజ పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి : ఎస్సై

ఉలవపాడు, జూలై 26: విద్యార్థి దశలోనే సరైన లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి చదవాలని ఎస్సై బాజీరెడ్డి సూచించారు. ఉలవపాడు జూనియర్ కళాశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై బాజీరెడ్డి విద్యార్థులకు పలు సూచనలు అందించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి గోపిచంద్ ప్రకాష్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ మహ్మద్ రఫీ, లైబ్రరీ అధ్యాపకులు హనుమంతరావు పాల్గొన్నారు. కళాశాల సిబ్బంది ఎస్సై బాజీరెడ్డిని సత్కరించారు.

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మోషే

కందుకూరు, జూలై 26: గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారని తెలిపారు. ఆయనవెంట ఎస్సీ సెల్ నాయకులు గోన ప్రతాప్‌కుమార్ తదితరులున్నారు.

తమిళనాడు బోట్లను అడ్డుకోవాలి

● రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌కు మంత్రి కొల్లు ఆదేశం

కావలి, జూలై 26: తమిళనాడు నుంచి నెల్లూరు జిల్లా తీరప్రాంతాలకు వచ్చి వేటాడుతున్న బోట్లను తక్షణం అడ్డుకోవాలని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో శుక్రవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి మంత్రిని కలిసి కావలి, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో తమిళబోట్లు వచ్చి వేట సాగిస్తున్నందున స్థానిక మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దాని వలన వారికి కలుగు నష్టాలను గురించి వివరించారు. తమిళనాడు నుంచి పెద్దపెద్ద బోట్లు మన తీరంలోకి వచ్చి స్థానిక మత్స్యకారుల వలలను నాశనం చేస్తూ మత్స్యకార వృత్తిని దెబ్బతీస్తున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి తమిళ బోట్లు ఈప్రాంతాలకు రాకుండా తక్షణమే తగు చర్యలు తీసుకుని మత్స్యకారులు నష్టపోకుండా చూడాలని ఫిషరీస్ కమిషనర్‌ను ఆదేశించారు.

డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి : ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు/ఉదయగిరి రూరల్, జూలై 26 : ఉదయగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గంలోని సమస్యలపై మాట్లాడుతూ సాగు, తాగునీటితో పాటు డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మెట్ట ప్రాంతం కావడంతో విశాలమైన భూభాగం ఉన్నప్పటికీ సాగునీరు లేక పొలాలు బీడు భూములుగా మారుతున్నాయన్నారు. సాగునీరు అందిస్తే వేలాది ఎకరాలు బంజరు భూములుగా మారుతాయని తెలిపారు. ఉదయగిరి, వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి వినతిపత్రం అందజేశారు. అలాగే మెట్ట వాసులకు ఆరోగ్య భద్రత కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.